ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 254 పేజీలు: 12 వెల: 6.50


**71 మందితో బీహార్ బిజెపి తొలి జాబితా**

**అమెరికా అధ్యక్షునికి మాజీల ప్రశంసలు**

9లో


# విశాఖలో గూగుల్ ఎఐ హబ్

**15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు**

**సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రుల సమక్షంలో ప్రకటించిన గూగుల్**

**ఇది గొప్ప చారిత్రక ఒప్పందం: ముఖ్యమంత్రి**

**అమెరికా వెలుపల విశాఖలోనే అతిపెద్ద డేటా సెంటర్**




గురువారం న్యూఢిల్లీలో గూగుల్‌తో ఒప్పందంలో సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్, మంత్రి నారాలోకేష్, గూగుల్ ప్రతినిధులు

**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతీ కుటుంబానికి ఏఐని దగ్గర చేసేలా ప్రయత్నిస్తామని సిఎం చంద్రబాబు అన్నారు. ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతోందని తెలిపారు.గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని అభివృద్ధి చేశామని, ప్రస్తుతం విశాఖను కూడా ఐటీ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వెలువడింది. విశాఖలో 6 బిలియన్ డాలర్లతో డేటా సెంటర్ ఏర్పాటును ధ్రువీకరిస్తూ ఇన్వెస్ట్ ఇండియా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ కూడా అధికారికంగా వెల్లడించింది. ఒక గిగావాట్ సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో నిర్మాణంకానుంది. గ్రీన్‌ఎనర్జీ వినియోగంతో గేమ్ ఛేంజర్‌గా నిలవనుంది. మూడు సముద్రపు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ద్వారా విశాఖలో ఈ కేంద్రం ఏర్పాటు కానుంది. >>2

## కొత్త టెక్నాలజీతో పాఠ్యాంశాలు

**ప్రపంచ వేదికపై విశాఖ గూగుల్ హబ్ కీలక పాత్ర:మంత్రి లోకేష్**

**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా ఏపీలో పాఠ్యాంశాలు ఉంటాయని ఎపి మానవ వనరుల మంత్రి నారాలోకేష్ అన్నారు. విశాఖ ఎఐ హబ్ కేవలం ఆంధ్రప్రదేశ్, గూగుల్‌కే కాదు... యావత్ భారతదేశానికి చరిత్రాత్మకమైంది. గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, విస్తృతమైన సేవలను అందించబోతోంది. ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముందుండి నడిపించడం గర్వకారణంగా భావిస్తున్నామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని తాజ్ మాన్ సింగ్ హోటల్‌లో విశాఖ ఎఐ హబ్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - గూగుల్ ప్రతినిధి బృందం నడుమ కీలక అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో ఏర్పా >>2



## మావోయిస్టు అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

**మరో 62 మంది కూడా అదే బాట**

**మల్లోజులపై పలు రాష్ట్రాల్లో రూ.10 కోట్ల రివార్డులు**

**జనజీవన స్రవంతిలో కలిసే నక్సలైట్లకు పునరావాసం**

**చత్తీస్‌గఢ్ డి.సిఎం విజయ్ శర్మ**

**హైదరాబాద్/చర్ల, అక్టోబరు 14, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది, గత కొన్ని రోజులుగా పార్టీపై దిక్కార స్వరం వినిపిస్తూ, ఆయుధాలు వీడి లొంగిపోవాలని చెబుతున్న పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పోలిట్ బ్యూరో సభ్యుడు, పార్టీ మహారాష్ట్ర అధిపతి కూడా అయిన మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ, అలియాస్ భూపతి, ఊరఫ్ భరత్ 62 మంది అనుచరులతో కలిసి మంగళవారం నాడు మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయారు. మల్లోజుల లొంగిపోతున్నట్లు దాదాపు నెల రోజులుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన పెద్ద సంఖ్యలో అనుచరులతో కలిసి లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

మావోయిస్టు పార్టీలో 52 ఏళ్లుగా అనేక హోదాల్లో కొనసాగిన 69 ఏళ్ల మల్లోజుల వేణుగోపాల్ రావు ఇంతకు ముందుగా ప్రకటించినట్లుగా తన అనుచరులు 62 మందితో కలిసి గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు. మల్లోజుల తన అనుచరులతో కలిసి లొంగిపోతున్నట్లు ముందుగానే పోలీసులకు సమాచారం అందడంతో దానికి అనుగుణంగా పోలీసులు గడ్చిరోలి జిల్లా పోలీసు కార్యా >>2



## భగ్గుమన్న బస్సు

**20 మంది ప్రయాణికులు సజీవ దహనం**

**రాజస్థాన్‌లో తీవ్ర విషాదం**

**జైసల్మేర్, అక్టోబరు 14:** రాజస్థాన్‌లో మంగళవారం ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. కదులుతున్న బస్సులో మంటలు చెలరేగాయి. దాంతో 20 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళ్తున్న ప్రైవేటు బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు పిల్లలు, నలుగురు మహిళలు ఉన్నట్లు తెలుస్తున్నది. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన వారిని జోధ్‌పూర్‌కు తరలించారు. కదులున్న బస్సులోనే ఒక్కసారిగా పొగలు వచ్చాయి. కొద్ది నిమిషాల్లోనే >>2

## కాకినాడ సెజ్ రైతులకు 2180 ఎకరాలు వెనక్కి

**ఎన్నికల హామీని నిలబెట్టుకున్న డిసిఎం పవన్**

**భూముల రిజిస్ట్రేషన్‌కు స్టాంప్ డ్యూటీ, ఫీజుల రద్దు**

**రెవెన్యూ శాఖ కీలక ఉత్తర్వులు**



**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసేలా నిర్ణయం తీసుకుంది కూటమి ప్రభుత్వం.పవన్ కల్యాణ్ చొరవ తీసుకొని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. దీంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో సుమారు 1,551 మంది రైతులకు మేలు జరగనుంది. అయితే, సిఎం చంద్రబాబు నాయుడుతో ఈ విషయంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చర్చించారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు సిఎం చంద్రబాబు. దీంతో డి.సిఎం పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ, రైతుల పక్షాన నిలుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సెజ్ కోసం సేకరించిన 2,180ఎకరాలభూమిని తిరిగి రైతులకే అప్పగించాలని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో పిఠాపురం నుంచి పోటీ చేసిన పవన్ కల్యాణ్, కాకినాడ సెజ్ రైతుల సమస్యను పరిష్కరిస్తానని బలంగా హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం జీవో జారీ చేసినా, క్షేత్రస్థాయిలో భూములు రైతులకు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పవన్ దృష్టికి తీసుకువచ్చారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి అవసరాలకు కూడా భూమిని వాడుకోలేకపోతున్నామని రైతులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన పవన్, తాను అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆమోదంతో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ఫలితంగా, కాకినాడ సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములను తిరిగి రైతులకు అప్పగించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. ఈ భూములను రైతుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసేందుకు ఎలాంటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములు వసూలు చేయవద్దని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాలకు చెందిన సుమారు 1,551 మంది రైతులకు భారీ ఊరట లభించనుంది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ స్పందిస్తూ, తన ఎన్నికల హామీ పట్ల సానుకూలంగా స్పందించి, రైతుల పక్షాన నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## మిథున్ రెడ్డి నివాసంలో సిట్ సోదాలు

**పలు కీలక పత్రాలు స్వాధీనం**

**తిరుపతిరూరల్, అక్టోబరు14 ప్రభాతవార్త:** రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నివాసంలో మంగళవారం సిట్ అధికారులు నిర్వహించిన సోదాలు ముగిశాయి. లిక్కర్ స్కాం కేసు విచారణలో భాగంగా తిరుపతిలోని మిథున్‌రెడ్డి నివాసంలో సిట్ అధికారులు సోదాలు చేపట్టినట్లు సమాచారం. ఇంట్లో వున్న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సిట్ అధికారులు కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు అడిగి, వివరణ కోరినట్లు విశ్వసనీయ సమాచారం. సోదాలు అనంతరం సిట్ అధికారులు పలు కీలక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇదే కేసు విచారణలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు నగరాలలోని ఎంపి మిథున్‌రెడ్డికి చెందిన నివాసాలు, కార్యాలయాల్లో కూడా సోదాలు చేసి, >>2

## ఐపిఎస్ అధికారి సంజయ్‌కు కోర్టులో చుక్కెదురు

**రెండో సారి బెయిలు పిటీషన్ కొట్టివేత**

**విజయవాడ, అక్టోబరు 14,పభాతవార్త ప్రతినిధి:** ఐపిఎస్ అధికారి సంజయ్‌కు ఎసిబి కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆయన రెండోసారి దాఖలు చేసుకున్నబెయిలు పిటీషన్‌ను సోమవారం విజయవాడలోని ఎసిబి కోర్టు కొట్టేసింది. గత ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక శాఖ డిజి,సిఐడి,ఎడిజిగా పనిచేసిన సమయంలో సంజయ్ అక్రమాలకు పాల్పడ్డారన్న కేసులో అభియోగాలు ఎదుర్కొంటూ జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

తొలిసారి దాఖలు చేసుకున్న బెయిలు పిటీషన్‌ను గత నెల 18న కోర్టు తోసిపుచ్చింది. తాజాగా వేసిన బెయిలు పిటీ షన్‌పై గతవారం ఎసిబి కోర్టులో ఇరు పక్షాల >>2

## డిజిపి నిద్రపోతున్నారా?

**రాష్ట్ర పోలీసులపై హైకోర్టు ఆగ్రహం**

**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పోలీసులపై హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. పరకామణిలో చోరికేసుకు సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాలను ఆమలు చేయకపోవడంపై జరిగిన విచారణలో తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తిరుమల పరకాణి నుంచి 72,000 రూపాయల విలువ చేసే 900 అమెరికా డాలర్లు చోరీ అయిన సంగతి తెలిసిందే. దీనిపై గతంలో విచారణ జరిసిన హైకోర్టు తిరుమల వన్ టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసు రికార్డులను సీజ్ చేయాలని ఆదేశించింది. అయితే, ఆ ఆదేశాలు అమలు కాకపోవడంతో తాజా విచారణలో ఆగ్రహం వ్యక్తం చేసింది. గత నెల 19న ఆదేశాలు ఇస్తే, ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది. సాంకేతిక కారణాలను సాకుగా చూపడాన్ని ఉపేక్షి ంచబోమని చెప్పింది. ఇంత జాప్యమెందుకుని నిలదీసింది.

డిజిపి నిద్రపోతున్నారా అంటూ ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయనప్పుడు పోలీసు శాఖను మూసివేయాలంది. రికార్డులను సీజ్ చేయకపోవడం వల్ల ఇప్పటికే వాటిని తార్మమారు చేసి ఉంటారన్న అనుమానాన్ని వ్యక్తం చేసింది. గత ఆదేశాలకు అనుగుణంగా రికార్డుల సీజ్, టిటిడి బోర్డు తీర్మానాలకు సంబంధించిన రికార్డులను కూడా జప్తు చేయాలని సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్‌ను ఆదేశించింది. వీటిని సీల్డ్ కవర్‌లో పెట్టి హైకోర్టు రిజిస్ట్రార్ ( జ్యుడిషియల్) ద్వారా అందజేయాలని డీజీని ఆదేశించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేస్తూ జస్టిస్ గన్నమనేని రామకఅష్ణ ప్రసాద్ ఆదేశాలిచ్చారు.


**మలేసియాలో చిన్నారులను కబళిస్తున్న వింత వైరస్** 9లో

# మరింత వేగంగా ఎఐ ఆవిష్కరణలు

**విశాఖ గూగుల్ హబ్‌పై ప్రధాని మోడీతో సంస్థ సిఇఒ సుందర్ పిచాయ్**

**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం...గూగుల్ మధ్య చారిత్రక ఒప్పందం,జరిగింది. ఈ సందర్భంగా టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్...భారత ప్రధాని నరేంద్రమోడీతో ఫోన్‌లో మాట్లాడారు. తమ కంపెనీ తొలి ఏఐ హబ్ విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ విషయాన్ని సుంఆదర్ పిచాయ్ తన 'ఎక్స్'పోస్ట్‌లో వెల్లడించారు. 'విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచుకునేందుకు ప్రధాని మోడీతో మాట్లాడా...ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుంది.

ఈ హబ్‌లో గిగావాట్ సామర్థ్యం ఉండే హైపర్ స్కేల్ డేటా సెంటర్, అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే, భారీ స్థాయిలో ఇంధన మౌలిక సదుపాయాలు ఉండనున్నాయి. ఈ హబ్‌తో ఆధునాతన సాంతేతికతను భారత్‌లో సంస్థలకు,వినియోగదారులకు అందించనున్నాం. కృతిమ మేధ ఆవిష్కరనలను మరింత వేగవంతం చేస్తాం.'అని సుందర్ పిచాయ్ రాసుకొచ్చారు. ఢిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్,ఐటీ,కమ్యూనికేషన్‌ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్,రాష్ట్ర మంత్రి నారా లోకేష్,గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్ళలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతి పెద్ద పెట్టుబడి. ఈ ఒప్పందం సందర్భంగా గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సీఈఓ థామస్ కురియన్ మాట్లాడుతూ...గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖ మారనుందని తెలిపారు. విశాఖ నుంచి 12 దేశాలతో సబ్‌సీ-కేబుల్ విధానం ద్వారా అనుసంధానం చేస్తామని చెప్పారు.



## నకిలీ మద్యం కేసు: జోగి రమేష్ పాత్రపై పోలీసు విచారణ

**విజయవాడ, అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపుతున్న నకిలీ మద్యం కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో మాజీ మంత్రి, వైఎస్సార్సీ నేత జోగి రమేష్ పాత్రపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రధాన నిందితుడు ఎ1 జనార్దన్ తాజాగా విడుదల చేసిన వీడియోలో,జోగి రమేష్ చెబితేనే నకిలీ మద్యం తయారుచేశానని చెప్పారు. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడుజనార్ధన్ ఆఫ్రికా >>2

# పరకామణి చోరీపై విస్తృత దర్యాప్తు



పరకామణిభవనంలో పరిశీలిస్తున్న సిఐడి డిజి

**తిరుమలలో సిఐడి డిజి రవిశంకర్**

**లెక్కింపు, భద్రతపై స్వయంగా పరిశీలన**

**పోలీసులనుంచి సిడి రికార్డులు, సిసి ఫుటేజి స్వాధీనం**

**తిరుమల,అక్టోబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణి లెక్కింపులో 2023వ సంవత్సరంలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌పై నిందితుడ్ని అప్పటి పోలీసు అధికారులు, గత పాలకమండలి పెద్దలు తప్పించారనే ఆరోపణలపై హైకోర్టు ఆదేశాలతో సిఐడి అధికారులు పునర్విచారణ మొదలుపెట్టారు. ఈ కేసు పురోగతి జాప్యంపై తాజాగా హైకోర్టు ధర్మాసనం తీవ్ర అసహనం,ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. 2023లో పరకామణిలో చోరీ జరిగిన ఘటనపై నమోదైన కేసుపై తిరుమల వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సిడి రికార్డులు, ఎఫ్ఐఆర్‌ను పరిశీలించారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకున్నారు. 2023 మార్చినెలలో తిరుమల పరాకమణి భవనంలో కరెన్సీనోట్లు, నాణేలు,విదేశీ కరెన్సీ లెక్కింపు సమయంలో అక్కడ విధుల్లో ఉన్న సివి రవికుమార్ 920 డాలర్లు విదేశీ >>2

## హైకోర్టుకు ముగ్గురు జడ్జిల బదలీ

**విజయవాడ,అక్టోబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. రాష్ట్రపతి ఆమోదం మేరకు తాజాగా బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి గుజరాత్ హైకోర్టు నుంచి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దూండి రమేష్, కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ సుబేందు సమంత తాజాగా ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ??ముగ్గురు జడ్జిలను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది.



గురువారం న్యూఢిల్లీలో గూగుల్‌తో ఒప్పందంలో సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్, మంత్రి నారాలోకేష్

# భగ్గుమన్న బస్సు

>> బస్సంతా మంటలు వ్యాపించాయి. ఇప్పటి వరకు సమాచారం మేరకు.. జైసల్మేర్–జోధ్‌పూర్ హైవేలోని థైయత్ గ్రామం సమీపంలో మధ్యాహ్నం 3.30గంటల ప్రాంతంలో ఈ దుర్ఘ టన జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు ఎప్పటిలాగే మధ్యాహ్నం మూడు గంటలకు జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్‌కు బయలుదేరింది. దాదాపు 20 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత, బస్సు వెనుక నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్, ప్రయాణికులు తేరుకునేలోపే బస్సంతా మంటలు వ్యాపించాయి. బస్సులో చిక్కుకున్న వారంతా కేవలువేశారు. పలువురు ప్రయాణి కులు కిటికీలు పగులగొట్టి బయటపడ్డారు.

చాలామంది లగేజీ అంతా మంటల్లో కాలిపో యింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులంతా అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్, పోలీసు సిబ్బందికి సమాచారం అందిం చారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే, బస్సులో మంటలు వ్యాపించడానికి కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



హర్యానా ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను మంగళవారం చండీఘర్‌లో పరామర్శించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

# విశాఖలో గూగుల్ ఎఐ హబ్

>> ముంబయికి రెండు రెట్ల సామర్థంతో రూపుదిద్దుకోనుంది. విశాఖలోని మధురవాడ దగ్గర 500 ఎకరాల్లో డేటా సిటీని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హౌసింగ్ డేటా సెంటర్లు, కృత్రిమ మేధ (ఏఐ) హబ్‌ల ఏర్పాటుకు అందులో చోటు కల్పించనుంది. డీప్ టెక్నాలజీ, బిగ్ డేటా, ఏఐ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా విస్తృత అవకాశాలున్నాయని భావిస్తున్న ప్రభుత్వం వాటిని అందిపుచ్చుకోవడానికి ఈ డేటా సిటీపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖలో ఐటీ రంగం అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా 2030 నాటికి గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని భారత కరెన్సీలో (రూ.1.33 లక్షల కోట్లు) విశాఖలో పెట్టనుంది. అమెరికా వెలుపల ప్రపంచంలోనే భారీ పెట్టుబడిగా గూగుల్ సంస్థ స్పష్టం చేసింది. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ సామర్థంతో ఏఐ డేటా హబ్ ను గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. గూగుల్ జెమిని ఏఐ, గూగుల్ సెర్చ్, గూగుల్ వర్క్ స్పేస్, యూట్యూబ్, క్లౌడ్, జీమెయిల్ లాంటి సేవలను ఈ హబ్ ద్వారా అందించనుంది. భారత్ దేశంతో పాటు దక్షిణాసియా దేశాలైన సింగపూర్, మలేసియా సహా ఆస్ట్రేలియా లాంటి దేశాలకు విశాఖ ఏఐ డేటా హబ్ నుంచే గూగుల్ సేవలు అందనున్నాయి. మొత్తంగా విశాఖ నుంచి 12 దేశాలకు కనెక్టివిటీ ఏర్పాటు చేసుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను గూగుల్ సమకూర్చుకోనుంది. ఇందులో భాగంగా సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మిస్తోంది. రెండు మిలియన్ మైళ్ల కంటే పొడవైన సబ్ సీ కేబుల్ ద్వారా ప్రపంచానికి కనెక్టివిటీ కేంద్రంగా విశాఖ మారనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గూగుల్ యూజర్లకు మరింత వేగంగా సేవలు అందించేలా ఈ ఏఐ డేటా హబ్ సేవలు అందించనుంది. ఈ క్రమంలో మంగళవారం విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై దిల్లీలో ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్‌తో ఎపి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా భారత్ ఏఐ శక్తి పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చాం, ప్రస్తుతం విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నామని అన్నారు. సాంకేతికతలో కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయి. డిజిటల్ కనెక్టివిటీ, డేటా సెంటర్, ఏఐ, రియల్‌టైమ్ డేటా కలెక్షన్లు ముఖ్యమైనవి. సాంకేతికను అందిపుచ్చుకోవడంలో ఎపి ముందు ఉంటుంది. 2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యమని వెల్లడించారు. హార్డ్ వర్క్ కాదు, స్మార్ట్ వర్క్ నినాదం తీసుకొచ్చామన్నారు. ఐదేళ్లలో గూగుల్ 15 బిలియన్ డాలర్లు ఖర్చు పెడతామనడం సంతోషదాయకం అని సీఎం అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో ప్రధాని మోదీ కీలకంగా వ్యవహరించారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ కు ధన్యవాదాలు సీఎం తెలియజేశారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో లోకేష్ ప్రధాన పాత్ర పోషించారన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ లకు ధన్యవాదాలన్నారు ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీ అందిపుచ్చుకోవటంలో భారత్ ప్రత్యేకం. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నది మా లక్ష్యమన్నారు.

**సీ కేబుల్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తుండటం మంచి పరిణామం: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

ఈ ప్రాజెక్టు అత్యంత వేగంగా అమల్లోకి రావటం దేశప్రగతిలో అత్యంత కీలకంగా మారుతుందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ విజనరీ నేతలు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి వారి ఆలోచనలు, తీసుకువచ్చిన విధానాలవల్ల ఈప్రాజెక్టు సాకారం అవుతోందన్నారు. ప్రోగ్రెసివ్ పాలసీలు, నిర్ణయాల్లో డైనమిజం వల్లే ఇదిసాధ్యం అన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి చేరుకోవడానికి ఇలాంటిపోటీ అవసరమన్నారు. ఏపీ కచ్చితంగా సాంకేతికరంగంలో తాను అనుకున్న లక్ష్యాలను సాధిస్తోందన్నారు. సరైన సమయంలో సరైన నాయకులువస్తే అభివృద్ధి వేగవంతమవుతుంది అని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

**గూగుల్ నిర్ణయానికి ధన్యవాదాలు: కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్**

విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని గూగుల్ నిర్ణయానికి ధన్యవాదాలని కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ అన్నారు. దేశంలోని ప్రతీ ఒక్కరి జీవితాలను ఈ నిర్ణయం మారుస్తుందన్నారు. టెక్నాలజీకి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు దేశ ప్రగతికి కీలకంగా నిలుస్తున్నాయన్నారు. ఎఐ ద్వారా చాలా మంది టెక్ నిపుణుల్లో ఆందోళన ఏర్పడిందన్నారు. కానీ వారి నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా మరిన్ని అవకాశాలు వస్తున్నాయి. డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయి. వీటితో పాటు సముద్రగర్భ సీ కేబుల్ వ్యవస్థ ద్వారా దక్షిణాసియా, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు విశాఖ కనెక్ట్ అవుతోంది. టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో వివిధ రాష్ట్రాలు కూడా పోటీ పడుతున్నాయి. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి చేరుకోవడానికి ఇలాంటి పోటీ అవసరమని కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ అన్నారు.

**విశాఖ నుంచి 12 దేశాలతో సబ్ సీకేబుల్ విధానం ద్వారా అనుసంధానం చేస్తాం: గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సిఇఒ థామస్ కురియన్**

గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సిఇఒ గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖ మారనున్నదని గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సిఇఒ థామస్ కురియన్ తెలిపారు. విశాఖ నుంచి 12 దేశాలతో సబ్ సీకేబుల్ విధానం ద్వారా అనుసంధానం చేస్తాం. అమెరికా వెలుపల పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారి. ఈ డేటా సెంటర్ ద్వారా ప్రపంచస్థాయి ఎఐ నిపుణులు తయారయ్యేందుకు అవకాశం ఉంది. వచ్చే ఐదేళ్లల్లో 15 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులకు అవకాశం ఉంది. భారత్‌కే కాదు, విశాఖ నుంచి వివిధ దేశాలకు కనెక్టివిటీకి అవకాశం ఉంది అని గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సిఇఒ థామస్ కురియన్ అన్నారు.

## కొత్త టెక్నాలజీతో పాఠ్యాంశాలు

>> టుకానున్న ఎఐ హబ్ కేవలం భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు సేవలు అందించడం మాత్రమే కాదు.. ప్రపంచ వేదికపై భారత్ కీలకపాత్ర పోషించేలా చేస్తుంది, అందుకే యావత్ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ఈ ప్రాజెక్టు కోసం సమష్టిగా కలసి పనిచేసిందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే ఎంతటి అద్భుతాలు సాధించవచ్చో ఈ ప్రాజెక్టు ద్వారా స్పష్టమవుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీజీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల విజనరీ లీడర్ షిప్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మార్గదర్శకత్వంలో పనిచేయడం ఆనందంగా ఉంది. సమాచార,ప్రసార శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ ప్రాజెక్ట్ రప్పించడానికి అద్భుతమైన సహకారం అందించారు. అందరి సమష్టికృషితో భారతదేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్ట్ ఆవిష్కృతమైంది. అంతర్జాతీయంగా అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన యువత నైపుణ్యం పెంచుకోవాలి, కృత్రిమ మేధస్సును (ఎఐ)ని స్వీకరించాలి, పాఠ్యాంశాలను పునర్వ్యవస్థీకరించాలి. మన యువతను కొత్త అవకాశాలకు సిద్ధం చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో మరో ముఖ్యమైన శాఖ రియల్ టైం గవర్నెన్స్. దీనిద్వారా కృత్రిమ మేధస్సు ఆధారిత పద్ధతులను అమలుచేయడం ద్వారా రైతులు, కూలీలు వంటి వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి వినియోగిస్తున్నాం. తద్వారా సమాజంలో వెనుకబడిన వర్గాల వారి ఆదాయం పెంచడమే లక్ష్యం. విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏదైనా ఒక నిర్ణయం తీసుకుంటే దానిని కచ్చితంగా అమలు చేస్తుంది. మా లక్ష్యాలను అధిగమించేందుకు గూగుల్ మార్గదర్శకత్వం వహించి సహకరించాల్సిందిగా కోరుతున్నాను. ఆంధ్రప్రదేశ్ ఎప్పటి నుంచో అధునాతన సాంకేతికతను ప్రోత్సహిస్తోంది. ఇది ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## ప్రాణభయంతో దేశం వీడి పారిపోయిన మడగాస్కర్ అధ్యక్షుడు

**అంటానానారివో(మడగాస్కర్), అక్టోబరు 14:** ద్వీప దేశం మడగాస్కర్‌లో రాజకీయ సంక్షోభం తీవ్ర స్థాయికి చేరింది. దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజా నిరసనలతో ప్రాణభయంతో దేశం విడిచి పారిపోయిన అధ్యక్షుడు ఆంద్రీ రజోలినా, తన అధికారాన్ని కాపాడుకునేందుకు అనవసర చర్యలకు పాల్పడ్డారు. తనపై ప్రవేశపెట్టనున్న అభిశంసన తీర్మానాన్ని అడ్డుకునే లక్ష్యంతో, ఏకంగా జాతీయ అసెంబ్లీని రద్దు చేస్తూ ఈరోజు సోషల్ మీడియా ద్వారా ఒక డిక్రీ జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆచూకీ ఎవరికీ తెలియదు. దేశంలో శాంతిభద్రతలను పునరుద్ధరించి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకే' ఈ నిర్ణయం తీసుకున్నట్లు రజోలినా మరో సోషల్ మీడియా పోస్టులో సమర్థించుకున్నారు. అసెంబ్లీని రద్దు చేస్తూ జారీ చేసిన ఈ డిక్రీ, రేడియో లేదా టెలివిజన్‌లో ప్రసారం అయిన వెంటనే అమల్లోకి వస్తుందని అధ్యక్ష భవనం ఫేస్‌బుక్‌లో పేర్కొంది. అయితే, అధ్యక్షుడి ఈ చర్య చట్టబద్ధం కాదని ప్రతిపక్ష నేత సిటెనీ రాండ్రియానసోలోనియాకో కొట్టిపారేశారు. జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడిని సంప్రదించకుండా తీసుకున్న ఈ నిర్ణయం చెల్లదని ఆయన స్పష్టం చేశారు. సోమవారం రాత్రి సోషల్ మీడియా ద్వారా మాట్లాడిన రజోలినా, తన ప్రాణాలకు ముప్పు ఉండటంతో దేశం విడిచి ఒక సురక్షిత ప్రాంతానికి వెళ్లినట్లు అంగీకరించారు. ఆయన ఆదివారమే ఫ్రాన్స్‌కు చెందిన సైనిక విమానంలో దేశం దాటినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. మరోవైపు, దేశంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. గతవారం సైన్యంలోని కొన్ని కీలక విభాగాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాయి.

నిరసనకారులపై కాల్పులు జరపాలన్న ఆదేశాలను పాటించబోమని అవి ప్రకటించాయి. తాజాగా, సైన్యంతోపాటు పోలీసు బలగాలుకూడా ఆందోళనకారులకు మద్దతుగా నిలవడం అధ్యక్షుడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. సెప్టెంబర్ 25న నీరు, విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా జెన్‌జీ యువత ప్రారంభించిన ఈనిరసనలు, అనతికాలంలోనే నిరుద్యోగం, పేదరికం, ప్రభుత్వ అవినీతి వంటి అంశాలతో దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు 22 మంది మరణించగా, 100 మందికి పైగా గాయపడినట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. దేశ సైన్యం, పోలీసులు కూడా ప్రజలపక్షాన నిలవడంతో రజోలినా పాలనకు గడ్డుకాలం మొదలైంది.

## జపాన్‌లో ఉధృతమవుతున్న మరో ఇన్‌ఫ్లుయెంజా!

### 130కిపైగా పాఠశాలలు మూసివేత

### టీకాలు వేయించుకోవాలని వైద్య ఆరోగ్యఅధికారుల హెచ్చరిక

**టోక్యో, అక్టోబరు 14:** కరోనా మహమ్మారి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఒక పెద్ద సంక్షోభం పొంచి ఉంది. జపాన్ మరో ఇన్‌ఫ్లుయేంజా మహమ్మారిని ప్రకటించింది. వాస్తవానికి ఆ దేశంలో ఫ్లూ కేసుల సంఖ్య అకస్మాత్తుగా పెరిగింది. అందువల్ల ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి మొదటి నుండి చర్యలు ప్రకటించారు. జపాన్‌లో 4,000 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. చాలా చోట్ల పాఠశాలలు మూసివేశారు. జపాన్‌లో ఫ్లూ రోగులు కొత్త కాదు, కానీ ఈ సంవత్సరం వారు పెరిగే సీజన్ కంటే చాలా ముందుగానే సమస్య తలెత్తింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం సాధారణ వ్యాప్తి అనుకోడాలని లేదని, ఐదు వారాల ముందుగానే వచ్చిందని ఇది ఆసియా అంతటా వైరస్ వ్యాప్తి నమూనాలో మార్పును సూచిస్తుందని హెచ్చరిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా వీలైనంత త్వరగా టీకాలు వేయించుకోవాలని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ పౌరులను కోరింది. ఈ కేసుల ప్రారంభ పెరుగుదల ఆసుపత్రి వ్యవస్థలపై ఒత్తిడిని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరించారు. దీనిని కాలానుగుణ ఫ్లూ వ్యాప్తి అని పిలుస్తున్నప్పటికీ, దాని తీవ్రత, సమయం భారతదేశంతో సహా ఇతర దేశాలకు హెచ్చరిక గంటలు లేవనెత్తాయి. ఎందుకంటే శీతాకాలం సమీపిస్తోంది, శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి.

అధికారులవివరాల ప్రకారం జపాన్‌లోని 47 ప్రిఫెక్చర్లలో 28 చోట్ల కేసుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా టోక్యో, ఒకినావా, కగోషిమాలో మరిన్ని కేసులు కనుగొన్నారు. అక్కడ 130కి పైగా పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు తాత్కాలికంగా మూసివేశారు. వైద్యుల ప్రకారం ఈ సంవత్సరం వ్యాప్తి అనేక కారణాల వల్ల మరింత తీవ్రంగా మారింది. ఇందులో ఫ్లూ వైరస్ విభిన్న జాతి కూడా ఉంది, ఇది మునుపటి కంటే శక్తివంతమైనదని చెబుతారు. అలాగే కోవిడ్19 మహమ్మారి సమయంలో సంవత్సరాల తరబడి తక్కువ సంపర్కం కారణంగా రోగనిరోధక శక్తిలో హెచ్చుతగ్గులు కూడా కేసుల సంఖ్య పెరగడానికి ఒక కారణం. అదనంగా క్రమరహిత వాతావరణం కూడా వైరస్ వ్యాప్తిని పెంచుతోంది. వైద్యులు కూడా దీనికి కారణం ఫ్లూకు వ్యతిరేకంగా టీకాలు వేయడం తగ్గడమేనని ఆపాదించారు. మహమ్మారి తర్వాత చాలా మంది నిర్లక్ష్యంగా మారారు, వార్షిక ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడానికి సమయం తీసుకోరు, దీనివల్ల వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. నిరంతర పర్యవేక్షణ, టీకాలు వేయడం చాలా అవసరం. వృద్ధులు, పిల్లలు, ఇప్పటికే అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు టీకాలు వేయించుకోవాలని వైద్యులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు

## సిట్ సోదాలు

>> పలు కీలక ఆధారాలు, పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. లిక్కర్ స్కాంకు సంబంధించి కీలక ఆధారాలు సేకరణలో భాగంగా సోదాలు చేసినట్లు తెలుస్తోంది. తిరుపతిలో ఎంపి మిథున్‌రెడ్డి ఇంట్లో ఉన్న ఫలంగా సిట్ అధికారులు సోదాలు నిర్వహించడంపై రాజకీయ వర్గాల్లో చర్చకొనసాగుతుంది. సిట్ అధికారుల సోదాలు నేపథ్యంలో ఎంపి నివాసం వద్ద భారీ బందోబస్త్ భద్రతను కల్పించారు. సోదాలు అనంతరం సిట్ అధికారులు ఎలాంటి ప్రకటన వెల్లడించలేదు.

## కోర్టులో చుక్కెదురు

>> వాదనలు ముగిసాయి. సంజయ్ అవినీతికి పాల్పడ్డారని మరిన్ని ఆధారాలు సేకరించాల్సిన దృష్ట్యా నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది వాదించారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకుంటూ... బెయిలు పిటీషన్‌ను ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు డిస్మిస్ చేస్తూ తీర్పు వెల్లడించారు.

## పోలీసు విచారణ

>> వెళ్లే ముందు రోజు మాజీ మంత్రి జోగి రమేష్ నివాసానికి వచ్చినట్లు అధికారులకు సమాచారం వచ్చింది. ఈ సమాచారాన్ని ధృవీకరించేందుకు పోలీసులు జోగి రమేష్ ఇంటి పరిసర ప్రాంతాల్లో సిసి టివి ఫుటేజ్‌లను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా జోగి నివాసంతో పాటు సమీప ఇళ్లలో ఉన్న సిసి టివి కెమారాల నుంచి ఫుటేజ్‌ను కూడా సేకరిస్తున్నారు. ఈ వీడియో ఆధారాలపై జోగి రమేష్ పాత్రపై మరిత స్పష్టత వచ్చే ఛాన్స్ ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## వారం - వర్జ్యం

15-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
నవమి ఉ.10.37
పుష్యమి మ.12.23
వర్జ్యం : రా.1.13–2.52
దు.ఉ.11.31–మ.12.18
రాహుకాలం - మ.12.00–1.30

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంత ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల విశేష జాగ్రత్తలు పాటించండి.

**వృషభం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మిథునం:** ఆధ్యాత్మిక విషయాలలో మత సంబంధమైన విషయాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం :** తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**సింహం:** అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది.

**కన్య :** లావాదేవీలు, మధ్యవర్తిత్వము మొదలయిన వాటి విషయ వ్యవహారాలలో జాగ్రత్తలు అవసరం.

**తుల :** వృత్తి పరంగా అభివృద్ధి సాధిస్తారు. తనఖాలు విడిపిస్తారు.

**వృశ్చికం:** ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడం కాస్త జాప్యం జరుగుతుంది.

**ధనుస్సు:** నమ్మకాలకు తావివ్వకుండా రొటీన్ సంతకాల విషయంలో బంధుత్వాలకు అతీతంగా వ్యవహరించండి.

**మకరం:** మీ మేధస్సు నలుగురిలో ప్రశంసించబడుతుంది. ప్రయాణాలు.

**కుంభం:** గృహావసరాల ఖర్చులు మితి మీరుతాయి. ఆర్థిక ఒడిదుడుకులు చికాకు కలిగిస్తాయి.

**మీనం :** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మల్లోజుల లొంగుబాటు

>> లయంలో తగిన ఏర్పాట్లు చేశారు. ఇటీవల కాలంలో ఛత్తీస్‌ఘడ్, తెలంగాణలోనే పదుల సంఖ్యలో నక్సలైట్లు లొంగిపోయారు. కానీ మహారాష్ట్రలో తాజాగా 62 మంది అనుచరులతో పార్టీ సీనియర్ నాయకుడు, గెరిల్లా వ్యూహకర్త మల్లోజుల లొంగిపోవడం సంచలనం రేపింది. మల్లోజులపై వివిధ రాష్ట్రాలలో మొత్తం పది కోట్ల రూపాయల రివార్డు వుండగా ఆయనతో పాటు లొంగిపోయిన 62 మందిపై లక్ష రూపాయల నుంచి పది లక్షల రూపాయల వరకు రివార్డు వుంది. లొంగిపోయిన వారిలో 25 మంది నక్సలైట్లు తమ వద్ద వున్న ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మల్లోజుల తన అనుచరులతో కలిసి లొంగిపోయిన విషయాన్ని గడ్చిరోలి పోలీసులు ధృవీకరించారు. మల్లోజుల తన అనుచరులతో కలిసి లొంగిపోవడం మావోయిస్టు పార్టీకి తీరని నష్టమని గడ్చిరోలి పోలీసు అధికారులు తెలిపారు. మిగతా మావోయిస్టులు కూడా పోలీసులకు లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవాలని వారు కోరారు. మల్లోజులతో పాటు 62 మంది నక్సలైట్లు గడ్చిరోలి పోలీసులకు లొంపోయిన విషయమై రాష్ట్ర నిఘా వర్గాలకు సమాచారం అందింది. వాస్తవానికి మల్లోజుల తెలంగాణ పోలీసులకు లొంగిపోతారని వార్తలు వచ్చాయి. ఒక దశలో ఆయన బెంగళూరులో అనారోగ్యంతో ఒక ఆసుపత్రిలో తెలంగాణ పోలీసుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని వార్తలు వెలువడ్డాయి. మావోయిస్టు కీలక నేత మల్లోజుల కిషన్‌జీ సతీమణి పోతుల సుజాతతో పాటు మరో ముగ్గురు ముఖ్య నేతలు నెల రోజుల వ్యవధిలో తెలంగాణ పోలీసులకు లొంగిపోవడం తెలిసిందే. ఈనేపథ్యంలో భూపతి కూడా తెలంగాణ పోలీసులకు లొంగిపోతారని మావోయిస్టు పార్టీ భావించింది. పోలీసులకు లొంగిపోయే ముందు ఆయన తన ఆయుధాలను పార్టీకి అప్పగించాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. దీనిపై నెల రోజులుగా చర్చసాగుతున్న తరుణంలో మల్లోజుల వేణుగోపాల్ రావు గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు. మల్లోజుల 62 మంది అనుచరులతో కలిసి గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయాన్ని ఛత్తీస్‌ఘడ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధృవీకరిం చారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన రాంచిలో మీడియాతో మాట్లాడుతూ మల్లోజుల లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలిందని అన్నారు. నక్సలైట్లు ఇప్పటికైనా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని, లొంగిపోయిన మా వోయిస్టులకు సర్కారు పునరావాసం కల్పిస్తుందని, వారిని అన్ని విధాల ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఛత్తీస్‌ఘడ్ ప్రజలు నక్సలిజం అంతం కావాలని కోరుకుంటున్నారని ఆయన తెలిపారు.

## పరకామణి చోరీపై విస్తృత దర్యాప్తు

>> కరెన్సీని చోరీ చేశాడు. ఆరోజే అక్కడ నిఘాలో ఉన్న ఎవిఎస్ఓ వై.సతీశ్‌కుమార్ గమనించి అతన్ని పట్టుకున్నాడు. ఆ తరువాత తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 24/2023 ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. తదనంతరం ఈ కేసు తిరుపతి రెండవ అదనపు మున్సిఫ్ కోర్టులో విచారణ చేపట్టారు. 2023మేనెల 20వతేదీ ఛార్జిషీట్ ఫైల్ చేశారు. అయితే ఈ కేసును అప్పటి టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, కొందరు పోలీస్ అధికారులు మధ్యవర్తిత్వం జరిపి అదే సంవత్సరం సెప్టెంబర్ 9వతేదీ లోక్‌అదాలత్‌లో 582 కేసుగా విచారణ సాగింది. గతంలో వైసిపి ప్రభుత్వంలోని పెద్దలు, గత టిటిడి బోర్డులో పెద్దలు, ఓ ఉన్నతాధికారి, ఓ పోలీస్ అధికారి కీలకంగా వ్యవహరించి వాటాలు పంచుకుని లోక్‌అదాలత్‌లో రాజీచేశారనేది ప్రధాన ఆరోపణ వచ్చింది. అంతేగాక నిందితుడైన రవికుమార్ 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను టిటిడికి విరాళంగా ఇచ్చాడు. ఈ కేసు మూసివేయడంపై శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో ఫిర్యాదు చేయడంతో గత నెల 20వతేదీ కేసు విచారణ చేపట్టిన ధర్మాసనం పూర్తిస్థాయిలో దేవుని పరకామణిలో సొమ్మును కాజేసిన రవికుమార్‌ను తప్పించిన పోలీస్ అధికారి, టిటిడి ఉన్నతాధికారి ఎవరనే కోణంలో కేసును పునర్విచారణ చేయాలని సిఐడి ఐజిని ఆదేశించింది. ఆ సమయంలోనే ఈ విషయంపై తిరుమల పరకామణిలో అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి కూడా ఆరోపించారు. ఈ చోరీకి సంబంధించి మూడురోజుల్లో ఈకేసు వివరాలు సిఐడి ఐజి ద్వారా న్యాయస్థానానికి అందజేయాలని ఆదేశాలిచ్చింది. అయితే పోలీసు ఉన్నతాదికారులు జాప్యం చేయడంతో దీనిపై సోమవారం జరిగిన విచారణలో సిఐడి డిజికి స్పష్టమైన ఆదేశాలివ్వడంతో మంగళవారం ఉదయం రవిశంకర్‌అయ్యన్నార్ తిరుమలకు చేరుకున్నారు. తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, 1టౌన్ సిఐ విజయకుమార్, టిటిడి విజిలెన్స్ వింగ్ విఎస్ఓ ఎన్టీవిరామ్‌కుమార్ ,ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్‌తో కలసి పరకామణి భవనాన్ని తనిఖీ చేశారు. స్వయంగా పరకామణి భవనంలోకి చేరుకుని కానుకల లెక్కింపు,నోట్లు,నాణేలు వేరు చేయడం, లెక్కించడం, భద్రతాపరమైన అంశాలను స్వయంగా గమనించారు .అక్కడ సిసికెమెరా ఆపరేటర్ చంద్రను కూడా విచారణ చేశారు. కొన్ని సిసిపుటేజీలు స్వాదీనం చేసుకున్నారు. మరీ రానున్నరోజుల్లో ఈ కేసుపై హైకోర్టు న్యాయస్థానం ధర్మాసనం వెలువడించే ఆదేశాలు,తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**అన్ని ఫైళ్లు, సిసిపుటేజీ హైకోర్టుకు సమర్పిస్తాం:సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్**

2023లో తిరుమల పరకామణిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి సిడి ఫైళ్ళు, రికార్డులు, సిసిపుటేజీలను తిరుమల పోలీసుల నుండి స్వాధీనం చేసుకున్నాం. అప్పట్లో రికార్డులన్నీ కూడా తీసుకుని వాటికి సంబంధించి ప్రొసీడింగ్స్ హైకోర్టుకు సమర్పించనున్నట్లు సిఐడి రవిశంకర్ మీడియాకు తెలిపారు. బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి కొన్ని ఆధారాలను సిఐడికి సమర్పించారు.

## గ్రామీణ పోస్టాఫీసుల్లో రైల్వే రిజర్వేషన్

### మరింత విస్తృతంగా ప్రయాణికులకు సౌకర్యాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** దేశవ్యాప్తంగా ఎంపికచేసిన పోస్టాఫీసులలో రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లను బుక్ చేసుకునే సౌకర్యం ప్రారంభం అవుతోంది. రైల్వే స్టేషన్‌లు లేదా కౌంటర్లు లేని మారుమూల ప్రాంతాల్లోని ప్రజల కోసం, రైల్వే మంత్రిత్వ శాఖతో కలిసి రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లను పోస్టాఫీసుల్లో బుక్ చేసుకునే సేవను ప్రారంభించింది. ఈ సదుపాయం ద్వారా అన్ని తరగతుల రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు.రైల్ హెడ్ లేదా రైల్వే కౌంటర్లు లేని ప్రాంతాలపై దృష్టి సారించి ఈ సేవ ప్రారంభించింది. ప్రస్తుతం దేశం అంతటా 333 పోస్టాఫీసులలో రైల్వే టిక్కెట్ బుకింగ్ సేవ అందుబాటులో ఉంది. ఇందులో ఎక్కువ భాగం గ్రామీణ, పాక్షిక గ్రామీణ ప్రాంతాలలో ఉన్నాయి. తద్వారా రైల్వే ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరుస్తున్నాయి. ఇప్పుడు రైల్వే టికెటింగ్ సేవను జోడించడం ద్వారా తమ సేవలను మరింత విస్తరించింది. పోస్టాఫీసు ఇంటి వద్దకే రైల్వే టిక్కెట్లను డెలివరీ చేసే సేవను కూడా అందిస్తుంది. రైల్వే టిక్కెట్లను బుక్ చేసుకోవాలనుకునే ప్రయాణీకులు ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్ ఉన్న పోస్టాఫీసుకు వెళ్లాలి. సాధారణంగా ఇవి రైల్వే స్టేషన్ లేదా కౌంటర్లు లేని ప్రాంతాలలో ఉంటాయి. ఇండియా పోస్ట్ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవచ్చు. కౌంటర్ వద్ద ఉన్న సిబ్బందికి మీ ప్రయాణ సమాచారాన్ని తెలియచేసి అక్కడ ఉన్న రిజర్వేషన్ ఫాం నింపి, టికెట్ డబ్బు కట్టాలి. పోస్టాఫీసు ద్వారా రైల్వే టిక్కెట్లను బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి రావడంతో, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల ప్రజలు రైల్వే ప్రయాణ సేవలను మరింత సులభంగా పొందగలుగుతారని కేంద్రం భావిస్తోంది

## తెలంగాణ ఆలయాల్లో కానుకల సమర్పణకు ఇ-హుండీలు

**హైదరాబాద్,అక్టోబర్ 14, ప్రభాతవార్త :** అంతా డిజిటల్ మయం అయిపోవడంతో చాలా మంది క్యాష్‌ను మెయింటేన్ చేయడం లేదు. దీంతో పుణ్యక్షేత్రాల దర్శనాలకు వెళ్లినప్పుడు హుండీలో వేయడానికి క్యాష్ లేక చాలా మంది ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యను పరిష్కరించడానికి తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది. తెలంగాణలోని ప్రధాన ఆలయాల్లో ఇ–హుండీ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇతర సేవల కోసం కూడా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అమలులోకి తెచ్చింది. అందులో భాగంగా.. భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం, బాసర జ్ఞాన సరస్వతి ఆలయాల్లోనూ క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ పేమెంట్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. త్వరలో అన్ని దేవాలయాల్లో అమలు చేయనున్నారు. ఇప్పుడు అంతా డిజిటల్ మయం అయిపోయింది.

చాలా మంది చేతిలో క్యాష్ ఉండటం లేదు. తీర్థ యాత్రలు, పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లినప్పుడు.. హుండీల్లో డబ్బులు వేయాలనుకున్నప్పుడు చేతిలో క్యాష్ లేక ఇబ్బంది పడుతుంటాం. అలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఆలయాల్లో భక్తులకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు దేవాదాయ శాఖ అన్ని రకాల సేవలకు డిజిటల్ చెల్లింపుల (ఈ పేమెంట్స్) విధానాన్ని తీసుకొచ్చింది. ఈ పేమెంట్స్ విధానం ప్రకారం ఇకపై హుండీల్లో నేరుగా డబ్బులు వేయలేకున్నా.. ఫోన్‌పే, గూగుల్ పే వంటి వ్యాలెట్లతో కానుకలు చెల్లించొచ్చు. అందులో భాగంగా ఇ–హుండీలను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఆలయంలో జరిగే వివిధ సేవలకు ప్రత్యేక డిజిటల్ అకౌంట్లను కూడా కేటాయించనుంది దేవాదాయ శాఖ.

15-10Pg3 ONG 3_15-10Pg3 ONG.qxd 10/15/2025 12:38 AM Page 1



# అవినీతి అక్రమాలకు కేరాఫ్ భూమన, అనుచరులు

### ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ



మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ

**తిరుపతి హెల్త్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** అవినీతి అక్రమాలకు భూమన కరుణాకర్ రెడ్డి, తన అనుచరులు కేరాఫ్ అడ్రెస్ అని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి సామీజీ పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమన కరుణాకర్ రెడ్డి పగటి వేషాలను ప్రజలు నమ్ముతారనుకోవడం అతని భ్రమ అని, పుణ్యక్షేత్రాలు తిరిగినంత మాత్రానా హింధువు కాలేదని, ఆయన చేసిన పాపాలు పోవు అని అన్నారు. రాజకీయ ఉనికి కోసం పనికట్టుకుని తిరుమలను, టిటిడిని విమర్శించడం మానుకోవాలని లేదంటే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గత వైసిపి హయాంలో తిరుమల స్వామి వారి ఆలయంలోనే జగన్ రెడ్డి గోవిందా గోవిందా అన్నప్పుడు అప్పుడు ఎక్కడికి పోయావు కరుణాకర్ రెడ్డి అని ఆయన ప్రశ్నించారు. వైసిపి హయాంలో గోవిందరాజ స్వామి దేవాలయం విమాన గోపురం పై ఉన్న విగ్రహాలను విరగొట్టి గోపురానికి గుండు కొడితే అప్పుడు ఏమి చేస్తున్నామని విమర్శించారు. వైసిపి హయాంలో తిరుమల అన్నదానంలో ప్రతి రోజు అన్నం ముద్దలు ముద్దలుగా భక్తులకు పెడుతూ ఉంటే ఆ అన్నం తినకుండా సగంలోనే భక్తులు లేచి వెళ్ళిపోయే వాళ్ళు అప్పుడు ఎక్కడికి పోయావ్ అని అన్నారు.

తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయానికి మించి విశాఖ శారద పీఠం వారు భవనం ఎత్తు కడితే అప్పుడు ఏమి చేస్తున్నావని ప్రశ్నించారు. తిరుమల హుండీ సొమ్ముకు కన్నం వేసి 100 కోట్లు పైగా దోచు కున్న సివి రవి కుమార్ వ్యవహారం బయటపడి నప్పుడు అప్పుడు ఎక్కడికి వెళ్ళావు సెటిల్‌మెంట్ చేశావా అని ఎద్దేవా చేసారు.

వైసిపి హయాంలో తిరుమల శేషాచలం కొండల్లో ఎర్రచందనం చెట్లు దోచుకునప్పుడు అప్పుడు ఏమి చేస్తున్నావని అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి క్రైస్తవుడని, తన కుమార్తెను క్రిస్టియన్ మత సంప్రదాయం ప్రకారం ఓ క్రైస్తవుడికి ఇచ్చి వివాహం జరిపించారని హిందుత్వం గురించి తిరుమల గురించి మాట్లాడుతూ ఉంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. ఇప్పటికైనా టిటిడి మీద విమర్శలు చేయడం మానుకో లేదంటే తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఆయన తెలిపారు.



## కర్నూలుకు చేరుకున్న డిజిపి

### మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

**కర్నూలు, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఈనెల 16 తేదీన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూల్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్ల పై మంగళవారం రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కర్నూల్ నగరంలోని బి.క్యాంప్ దగ్గర ఉన్న పోలీసు అతిథి గృహం చేరుకున్నారు. ఈ సందర్భంగా కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఏపీ రాష్ట్ర డిజిపిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందచేశారు.

## పనిచేసేవారికే గుర్తింపు

### వైసిపి కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ, అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీలో ఉత్సాహంగా పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని, ప్రాధాన్యత ఇవ్వాలని వైసిపి కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పదవులను బాధ్యతగా భావించి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నకిలీ మద్యంపై సిఎం చంద్రబాబు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తప్పుల మీద తప్పులు చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాలని, ప్రతి అనుబంధ విభాగాన్ని వాడుకోవాలని తెలిపారు. నియోజకవర్గం, పార్టీ కేంద్ర కార్యాలయానికి కళ్లు, చెవుల్లా పనిచేయాలన్నారు. మద్యం కల్తీ జరుగుతోందని, బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉన్నాయని, వాటిని అరికట్టకుండా వైసిపిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. ఇక కేతిరెడ్డి నకిలీ మద్యం వెనుక ప్రభుత్వ పెద్దలు ఉన్నారని, అందుకే కేసు విచారణ సక్రమంగా జరగడం లేదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విమర్శించారు.


BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II
AT: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad
O.A. No. 650 of 2025
BETWEEN:
M/s. YES Bank Ltd. ...Applicant
And
Mr. Shaik Madeena Irshad ...Defendants
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
Mr. Shaik Madeena Irshad, S/o. Sk Nayeem, Aged About 38Years, Occ: Pvt. Employee, R/o.H.No. 6-1-423, Flat No. 501, 5th Floor, Diamond Hills, Shaikpet, Hyderabad - 500008. Also at: Mr. Shaik Madeena Irshad, R/o. 7th Line, Datt Sai Apartments, NGO Colony, Ongole, Prakasam District - 523001. Also at: Mr. Shaik Madeena Irshad C/o. Reliance Jio Infocomm Ltd., 3rd Floor, Lake Shore Towers, Lumbini Classic Apts., Rajbhavan Road, Somajiguda, Hyderabad - 500082. ...Defendant/s
Please take the summons in the above O.A.No. 650/2025 filed by the Applicant for Recovery of money of Rs.21,23,254.01 against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily Newspaper and posted the matter on 19/11/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under; (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original Application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 19/11/2025 at 10.30 A.M at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 09th of October, 2025.
(By order of the Court)
Signature of the Officer
Authorised to issue Summons


## ఎక్సైజ్ సురక్ష యాప్ బీర్స్‌కు వర్తించదు: మంత్రి కొల్లు రవీంద్ర



ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ గురించి వివరిస్తున్న మంత్రి రవీంద్ర

**విజయవాడ, అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** బీర్స్ పై ఎక్సైజ్ అడ్డీసివ్ లేబుల్స్ ఇవ్వబడలేదని, బీర్స్ పై ఉన్న క్యూఆర్ కోడ్ యాప్‌కు సంబంధం లేకుండా, బీర్ కంపెనీలు స్వయంగా ఇస్తున్నాయని, ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ బీర్స్‌కు వర్తించదని మంత్రి కొల్లు రవీంద్రచేసారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ కేవలం మద్యం సీసాలకు మాత్రమే వర్తిస్తుందని , బీర్స్‌కు ఈ యాప్ ఉపయోగపడదని వివరించారు. బీర్స్ నకిలీగా తయారు చేయడం అత్యంత అరుదైనది కాబట్టి, ఈ రకమైన పర్యవేక్షణ అవసరం లేకపోతోంది. ఇక ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నేతృత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తదితర అధికారులు వర్చువల్ గా సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డెప్యూటీ కమిషనర్లు నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు అందరూ ఫీల్డ్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల వచ్చిన నకిలీ మద్యం ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్ చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులు లేదా అనధికారికంగా మద్యం విక్రయించే కేంద్రాలు ఎక్కడా ఉండకూ డదని, వాటిపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి సూచించారు. ఎక్సైజ్ డైరెక్టర్ చమకూరి శ్రీధర్ ఈ సందర్భంగా ఏపీ ఎక్సైజ్ సురక్ష" మొబైల్ యాప్ పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించారు. లైసెన్సుదారులు ఈ యాప్‌ను వెంటనే ఇన్‌స్టాల్ చేసి యాక్టివేట్ చేయాలని ఆయన సూచించారు. అక్టోబర్ 16 నుండి రాష్ట్రంలోని అన్ని రిటైల్ లిక్కర్ విక్ర యాలు తప్పనిసరిగా ఏపీ ఎక్సైజ్ సురక్ష (రిటైలర్) యాప్ ద్వారా మాత్రమే జరగాలి, ప్రతి మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి దాని నిజమైనదా కాదా అనేది నిర్ధారించాలి అని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రభుత్వం పారదర్శకత, వినియోగదారుల భద్రత, నకిలీ మద్యం నిర్మూలన కు కట్టుబడి ఉందని, సాంకేతిక ఆధారిత చర్యలతో ఎక్సైజ్ శాఖ పనితీరును బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయన పలు బార్లు తనిఖీ చేసారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ గురించి వివరించారు.

# బొల్లా వ్యాఖ్యలపై మహిళా కమిషన్ సీరియస్..

### మహిళలకు క్షమాపణలు చెప్పకుంటే తీవ్రంగా పరిగణిస్తాం

### హెచ్చరించిన డాక్టర్ రాయపాటి శైలజ



**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలను కించపరిచే విధంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యాఖ్యలు చేయడాన్ని ఖిరాష్ట్ర మహిళా కమిషనఖి తీవ్రంగా ఖండిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. "ఆడవాళ్ళంతా తాగుబోతులు" అన్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యాఖ్యలపై మంగళవారం మీడియా కథనాలు దుమారం రేగాయి. ఈ వ్యవహారంపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మీడియాతో మాట్లాడి తీవ్రంగా స్పందించారు. మహిళలను అవమానపరుస్తూ చేసిన ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మచ్చగా చెప్పారు. అలాగే, ఆయన దిగజారుడు మాటల్ని బట్టి బొల్లా బ్రహ్మనాయుడుకి మహిళల పట్ల ఉన్న చులకన భావం అర్థమవుతుందన్నారు. మహిళలను అగౌరవపరిచినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పాల్సిన నైతిక బాధ్యత బ్రహ్మనాయుడు పై ఉందన్నారు. అలా చేయకుంటే మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని రాయపాటి శైలజ హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల మాటలు ప్రజలు ఆదర్శవంతంగా స్వీకరించేలా ఉండాలి తప్ప అసహ్యించుకునేలా ఉండరాదని హితవు చెప్పారు. సంస్కారవంతులెవరూ బొల్లా బ్రహ్మనాయుడు మాదిరిగా మాట్లాడరని చెప్పారు. మహిళలను అవమానించే నాయకులు ప్రజాసేవకు అనర్హులని రాయపాటి శైలజ అన్నారు. ఒక మహిళపై ఎవరైనా వ్యాఖ్యలు చేసే ముందు వారింట్లో తల్లి, చెల్లి, భార్య, నిత్యం పూజించే దేవత కూడా మహిళనే అనేది గుర్తుపెట్టుకోవాలన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బ తీసే ప్రతీ వ్యాఖ్యను కూడా కమిషన్ తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. మహిళల్ని తూలనాడుతూ వ్యాఖ్యలకు పాల్పడే రాజకీయ నేతలపై నిఘాపెట్టి ప్రభుత్వ పెద్దలు సైతం ఇలాంటి విషసంస్కృతిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ గుర్తుచేశారు.

### ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా

# తిరుపతి, విశాఖపట్నంలను గుర్తించండి

### పర్యాటక మంత్రుల సమావేశంలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు మంత్రి కందుల వినతి



రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటక మంత్రుల సమావేశంలో ప్రసంగిస్తున్న కందుల దుర్గేష్

**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ పర్యాటక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మరింత కేంద్ర సహకారం అందించాలని, కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారం ఏపీలోని తిరుపతి, విశాఖపట్నంలను ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 14, 15 తేదీల్లో రాజస్థాన్ లోని ఉదయ్ పూర్‌లోని ఓ హోటల్లో కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు. కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులతో జరుగుతున్న సమావేశంలో ఏపీ ప్రభుత్వం తరపున మంత్రి కందుల దుర్గేష్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడిచిన 15 నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ మిషన్ లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరపున విశాఖపట్నం, తిరుపతిలను ప్రధాన గమ్యస్థానాలుగా ప్రతిపాది స్తున్నామని, ఈ ప్రాంతాలు తమ రాష్ట్ర వైవిధ్యాన్ని, సంసిద్ధతను, అంతర్జాతీయ ప్రమాణాలను ప్రతిబింబింపజేస్తాయని వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ 2025-26 పేరా సముద్రతీర, మెరైన్ గమ్యస్థానంగా విశాఖ,ఆధ్యాత్మిక, సాంస్కృతిక గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. జాతీయ మిషన్ లక్ష్యాలను సాధించడంలో ఏపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన జాతీయ మిషన్ పై చర్చించడానికి ఏర్పాటు చేసిన ఈ చారిత్రాత్మక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడం గర్వంగా భావిస్తున్నానన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024-29 నూతన పర్యాటక విధానం ప్రకటించిందని తద్వారా సమగ్ర, పెట్టు బడి ఆధారిత విధానాన్ని అవలం బిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. గడిచిన 15 నెలల్లో దాదాపు రూ.12,000 కోట్ల పర్యాటక పెట్టుబడులతో పాటు తాజ్, ఐటీసీ, ఒబెరాయ్, హిల్టన్, లెమన్ ట్రీ వంటి ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్లతో కూడిన 21 హోటల్ మరియు రిసార్ట్‌ప్రాజెక్టులను ఏపీకి వచ్చేలా ఆకర్షించామన్నారు. రూ.4,500 కోట్లతో ఈ ప్రాజెక్టుల ద్వారా ఇప్పటివరకు 18,000 మందికి పైగా ఉద్యోగాలను సృష్టించామన్నారు. అంతేగాక గ్రామీణ, గిరిజన పర్యాటక సర్క్యూట్‌లలో 10,000 హోమ్‌స్టేలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీకి ప్రత్యేకమైన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్ నర్ షిప్) నమూనా ద్వారా పర్యాటక గమ్య స్థానాల అభివృద్ధిని ఏకీకృతం చేస్తున్నామని తెలిపారు. తద్వారా స్థానిక సంఘాలు, వ్యాపారవేత్తలు, అంతర్జాతీయ భాగస్వాములను ఒకే వేదికపై తీసుకువచ్చి కలిసి పని చేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. 2029 నాటికి పర్యాటకరంగం రాష్ట్ర జీవీఏలో వాటాను 4.6 నుండి 8 కు పెంచడం, 5లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించడం, 50,000 హోటళ్లను ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు.

భారతదేశపు తొలి ఓషనేరియం, మెరైన్ ఎక్స్‌పీరియన్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని ఏపీ ప్రభుత్వం సంకల్పించినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, క్రూయిజ్ టెర్మినల్, భీమిలి-రుషికొండ పర్యాటక కారిడార్‌ను ఒక శక్తివంతమైన తీరప్రాంత హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను కాన్ఫరెన్స్ లో వివరించారు. తీరప్రాంతం,ఆధ్యాత్మికం కలగవలసిన ఈ రెండు ప్రాజెక్టులు భారతదేశ వైవిధ్యాన్ని, ప్రపంచస్థాయి పర్యాటక అనుభవాలను సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ సామర్థ్యాన్ని తెలుపుతాయని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు వివరించారు. జాతీయ మిషన్ రూపకల్పనలో భాగంగా తాము ఏపీ పర్యాటక గమ్యస్థాన అభివృద్ధిపై దృష్టి పెడతామని టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట అన్నారు.

# తిరుమల సమాచారం

## 30న తిరుమలేశునికి పుష్పయాగం: ఆర్జితసేవలు రద్దు



**తిరుమల,అక్టోబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వతేదీ గురువారం పుష్పయాగమహోత్సవం ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. 29వతేదీ సాయంత్రం అంకురార్పణ జరగనుంది. పుష్పయాగంరోజు ఆలయంలో ఉదయం రెండవ అర్చన, రెండవ గంట,నైవేద్యం అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి సంపంగి ప్రాకారంలోని కల్యాణమండపానికి వేంచేపు చేస్తారు, అక్కడ విశేష స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. 30వతేదీ మధ్యాహ్నం 1గంట నుండి చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి,రోజా,తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆరురకాల ఆకులతో 12రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులకు పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహిస్తారు.సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయమాడవీదుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆ రోజు ఆర్జితసేవలు తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజలసేవ, ఆర్జితబ్రహ్మోత్సవం రద్దయ్యాయి. వేకువజామున తోమాల,అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. 29వతేదీ బుధవారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ రద్దయ్యింది.

## నవంబరు17నుండి తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు



**తిరుమల,అక్టోబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** సిరులతల్లి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబర్ 17వతేదీ నుండి 25వతేదీ వరకు తొమ్మిదిరోజులపాటు వార్షిక కార్తీకమాస బ్రహ్మోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు 16వతేదీ సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. నవంబర్ 11న ఆలయంలో కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు ,రాత్రి 7గంటల నుండి 9గంటల వరకు అమ్మవారి వాహనసేవలు ఊరేగింపు జరుగుతుంది. అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంధ్రనాథ్‌తో కలసి సమావేశమై సమీక్షించారు. కాగా బ్రహ్మోత్స వాల్లో ఎంతో విశిష్టతవున్న గజవాహనం శుక్రవారం జరగనుండటం, చివరగా పంచమీతీర్థం మంగళవారం అత్యంత ప్రధానమైన రోజులు. భద్రతపరంగా, భక్తులకు సౌకర్యాలపై రాజీలేని ధోరణితో పనిచేయాలని నిర్ణయించారు.

### నవంబర్ 17నుండి బ్రహ్మోత్సవాలు

| తేదీ | ఉదయం | రాత్రి |
|---|---|---|
| 17 సోమవారం | ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 18 మంగళవారం | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 19బుధవారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 20 గురువారం | కల్పవృక్షవాహనం | హనుమంతవాహనం |
| 21 శుక్రవారం | పల్లకీఉత్సవం | గజవాహనం |
| 22శనివారం | సర్వభూపాలవాహనం, | స్వర్ణరథం (సాయంత్రం) గరుడవాహనం |
| 23 ఆదివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభ వాహనం |
| 24 సోమవారం | రథోత్సవం | అశ్వవా హనం |
| 25 మంగళవారం | పంచమీతీర్థం, | ధ్వజావరోహణం |

## తిరుమల పోలీసుల సేవలు భేష్



### భక్తుని అభినందనలు

**తిరుమల, అక్టోబరు 14ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల అన్నదానంభవనం క్యూలైన్లో భక్తుడు చరవాణీలు చోరీకి గురవడం, దీనిపై పోలీసులు సకాలంలో స్పందించి పట్టుకోవడం ఆనందం కలిగించిందని భక్తుడు తెలిపారు. బమ్మిడి అరుణ్ కుమార్ భక్తుడు ఈనెల 10వతేదీ తిరుమలకు వచ్చాడు.. తిరుమలలో స్వామివారి దర్శనానంతరం చరవాణీలు తీసుకుని అన్నదానం భవనం క్యూలైన్లోకి వెళ్ళాడు. ఆ సమయంలో తనజేబులోని చరవాణీలను ఎవరో చోరీచేశారు. ఆరోజు మధ్యాహ్నం వెంటనే సిసిటివి కమాండ్ కేంద్రానికి వెళ్ళి పిర్యాదు చేశాడు. వివరాలు తెలపడంతో తిరుమల 1టౌన్ పోలీసులు ఏఎస్ఐ ఆనంద్, కానిస్టేబుల్ అశ్రద్ధ చేయకుండా సాంకేతికతతో నైపుణ్యంతో పోగోట్టుకున్న చరవాణీలను సాయంత్రానికి రికవరీ చేశారని భక్తుడు టిటిడికి రాసిన లేఖ మంగళవారం చేరింది. ఆ లేఖలో పోలీసుల స్పందన, సాయం కృతజ్ఞత లుతో ధన్యవాదాలు తెలిపాడు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసి మాసంలో మంగళవారం ఉదయం ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. ఉదయం విఐపి బ్రేక్‌లో రేమాండ్స్ గ్రూప్ అధినేత ,ఎండి గౌతమ్‌సింఘా నియా, ఎన్జీఒ అధ్యక్షుడు విద్యాసాగర్, ఎస్పీ బాలుసతీమణి సావిత్రి బాలసుబ్రమణ్యం, ముంబై సినీదర్శకుడు మధు ర్భండార్కర్, ఎంపిమాగుంట శ్రీనివాసులురెడ్డి కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## మహారాష్ట్రలో చిక్కిన ఆంధ్రా వాంటెడ్ క్రిమినల్

**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ వాంటెడ్ క్రిమినల్ పోలీసులకు చిక్కాడు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు మహారాష్ట్ర ఏటీఎస్ సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో నిందితుడిని సోమవారం అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని అధికారులు మంగళవారం వెల్లడించారు. నిందితుడు తౌసిఫ్ షేక్‌పై ఆంధ్రాలో పలు కేసులు ఉన్నాయి. తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ అతడు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని అధికారులు తెలిపారు. నిందితుడికి కొంతమంది విదేశీ పౌరులతోనూ సంబంధాలు ఉన్నట్లు వెల్లడించారు. ఓ కేసులోఅతడు వాంటెడ్ నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. గత కొంతకాలంగా పరారీలో ఉన్న షేక్ గురించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ పోలీసులకు లీడ్ దొరికింది. దీంతో వారు మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)కు సమాచారమిచ్చారు. అనంతరం రెండు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి మాలేగావ్‌లో నిందితుడని అరెస్ట్ చేశారు.

## రోడ్లపైకి 190కొత్త 108 వాహనాలు

### గోల్డెన్ అవర్‌లోగానే ఆస్పత్రులకు తరలింపు

### వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**సచివాలయం,అక్టోబరు 14,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 190కొత్త 108 అంబులెన్స్‌లను రోడ్లపైకి తీసుకురాబోతున్నట్లు వైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో రోడ్డు,ఇతర ప్రమాద క్షతగాత్రులను ఇప్పటికంటె మరింత వేగంగా ఆస్పత్రులకు తరలించేందుకు వీలుకలుగుతుంది. కూటమి ప్రభుత్వం టెండరు నిబంధనలల్లో పేర్కొన్న ప్రకారం సిద్దమైన ఈ కొత్త అంబులెన్స్‌లను త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. గత ప్రభుత్వ హాయాంలో డొక్కు,తుక్కుగా తయారై తరచూ మరమ్మత్తులకు గురవుతున్న అంబులెన్స్‌లను తొలగించి, వాటి స్తానంలో కొత్త అంబులెన్స్‌లను నడపనున్నారు. దీంతో గోల్డెన్ అవర్‌లోనే రోడ్డు,ఇతర ప్రమాద క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో వైద్యం అందుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ వింగ్స్

**విజయవాడ,అక్టోబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 23వ డివిజన్ కార్పొరేటర్ టిడిపి ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి పాల్గొన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తక్కువ జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చాయని రోజువారి ఉపయోగించే చాలా వస్తువులపై జీఎస్టీ జీరో పర్సెంట్ లేదా 5% లేదా 12% మరియు 18% కలిగి ఉన్నాయని 99%వస్తువులు పన్ను రహితంగా ఉన్నాయని గతంలో ఉన్న స్లాబులు తగ్గించారని ఈ జీఎస్టీ రేట్లు తగ్గింపు వల్ల ప్రతి కుటుంబానికి చాలా వరకు ఆదా అవుతుందని వ్యాపారులకు అమ్మకాలు పెరుగుతాయని పేద మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ సూపర్ జీఎస్టీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రమాదేవి, డివిజన్ అధ్యక్షులు చింతా దుర్గారావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత కార్యదర్శి కోటి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వార్త


బంగారంలోని ప్రతికణానికి విలువ ఉన్నట్లే, జీవితంలోని ప్రతిక్షణానికి విలువ ఉంది.

-జార్జి ఇలియట్

# పశ్చిమాసియా పరవశం!

ఇప్పుడక్కడ తుపాకీ పేలుళ్లు, మిస్సైళ్ల గర్జనలు వినపడవు. కనపడేవన్నీ ఉద్విగ్న సన్నివేశాలు, ఆత్మీయ పలకరింపుల మధ్య ఇజ్రాయెలీ బందీల ఆనందబాష్పాలు, హమాస్ చెర నుంచి విడుదలైన ఇజ్రాయెలీలు కాని, ఇజ్రాయెల్ విడుదల చేసిన 1968 మంది పాలస్తీనియన్‌లు ఒక్కసారిగా ఇలాంటి మధురక్షణాలను చవి చూశారు. ఇంతకాలం బందీలుగా నాలుగు గోడల మధ్య ఇక ఆఖరి రోజులేనను కున్న తరుణంలో ఒక్కసారిగా వారిలో కాంతిరేఖ ప్రసరించింది. నవోదయం వెలుగు చూసింది.738 రోజులు చీకట్లో మగ్గినవారు ఇప్పుడు స్వేచ్ఛావాయువు. పశ్చిమాసియాలో శాంతికపోతాలు ఎగురు తున్నాయనడానికి సాక్షీభూతాలు. ఈసారి యుద్ధవిరమణ తంత్రంలో శ్వేతసౌధాధినేత ట్రంప్‌దే పైచేయి. ఎవరేమ నుకున్నా హమాస్, ఇజ్రాయెల్‌ల మధ్య సంధి కుదర్చడ మంటే మాటలు కాదు. ఇరుపక్షాల వారు ఒకరిపై ఒకరు రగిలిపోతున్నారు. వారి మధ్య కుదిరిన శాంతి ఒప్పందాలలో భాగంగా తొలిదశలో ఇరుపక్షాలు సోమవారం బందీలను పరస్పరం విడుదల చేశాయి. సజీవంగానైనా, నిర్జీవంగానైనా సరే 'మా వాళ్లు మాక్కావాలన్న' ధోరణిలో ఇజ్రాయెల్ పట్టుపట్టడంతో తొలి విడతగా తమ ఆధీనంలో ఉన్న 20మందిని సజీవంగా గాజా మూడు ప్రాంతాల నుంచి రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించింది. పాలస్తీనా ఖైదీల విడుదల ప్రక్రియ కూడా సజావుగానే సాగింది. ఇజ్రాయెల్ ఆక్రమణలో ఉన్న వెస్ట్ బ్యాంక్‌లోని పలు జైళ్లలో బందీగా ఉన్న పాలస్తీనియన్లు తమ ఆత్మీయులను కలుసుకోగలరు. ఈ శాంతి ఒప్పందం అమలయ్యే వరకు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెలీలు కాని, ఇటు వెస్ట్ బ్యాంక్‌లో మగ్గుతున్న పాలస్తీనియన్లు కానీ తాము సజీవంగా బయటపడతామని ఏనాడూ అనుకోలేదు. ఇక మానవతాసాయం కూడా అనుకున్నట్లుగానే ఏర్పాట్లు జరిగాయి. గాజా పునర్నిర్మాణానికి సహాయం చేస్తామని, పాలస్తీనీయులు ఉగ్రవాదాన్ని, హింసను వదిలిపెట్టాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హమాస్‌ను హెచ్చరిస్తూనే ఉగ్రవాదంపై ఇజ్రాయెల్ విజయం సాధించినట్లు ప్రకటించారు. ఇరుపక్షాల మధ్య శాంతి ఒప్పందం అమలు, సయోధ్యకు సంపూర్ణ స్థాయిలో సిద్ధం చేయడం వంటి అంశాల పర్యవేక్షణకు ట్రంప్ స్వయంగా ఈజిప్టుకు హాజరవడం విశేషించదగినది. ట్రంప్ మధ్యవర్తిత్వానికి కృతజ్ఞతగా ఈజిప్ట్ పార్ల మెంట్‌లో ఆయనకు సభ్యులంతా నిలబడి ఒక్కసారిగా చప్పట్లు కొట్టారు. అదే అత్యున్నత గౌరవం. ఇది చరిత్రలోనే లిఖించదగిన విషయం. గాజా స్ట్రిప్‌ను మరుభూమిగా మార్చిన రెండేళ్ల యుద్ధానికి ఎలాగైతేనేం తెరపడింది. అది తాత్కాలికమా? శాశ్వతమా అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. కాలమే నిర్ణయిస్తుంది. పాలస్తీనా ప్రాంతానికి చెందిన పాలస్తీనియన్లు విడుదలై ఊపిరి పీల్చుకుంటు న్నారు. తమ తమ ఇళ్లకు చేరుకునే సరికి అవి శిధిలమై, కూలిన భవనాలను, కూల్చినఇళ్లను చూసుకుని బావురు మం టున్నారు. గాజా, ఇజ్రాయెల్ మధ్య తుది ఒప్పం దాలు కుదిరి అమల్లోకి వచ్చేవరకు శాంతినెలకొల్పడానికి తాను కట్టుబడిఉంటానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా ప్రకటించడమే ఈ ఒప్పంద సారాంశం. నెతన్యాహు ఎంతైనా తెగిస్తాడని ప్రతీతి. అతనే స్వీయనిర్ణయాన్ని నిర్బంధంగా ప్రకటించారని హమాస్ నేతలు నమ్మి ముందుకు రావడం ఆటువంటి ఇరుపక్షాలు శాంతిమార్గంలో పయనింపచేసేందుకు అప్పుడు సంసిద్ధమయ్యాయి. ఇక ముందు గాజాను నిస్సైనికీకరణ చేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ శాంతి ఒప్పందా ల నేపథ్యం కనపడుతోంది. ఎవరెంతగా పోరాడారు.ఎవరి లక్ష్యాలు ఏమిటి?ఎవరు విజేతలయ్యారనేది ట్రంప్ చెప్పినంత సులభం కాదు. ఇరువర్గాలు భారీగానే నష్టపోయాయి. జననష్టం, ఆస్తినష్టాల విషయానికొస్తే ఇజ్రాయెల్ దాడుల్లో 67,800 మందిచనిపోయారు. వారిలో సగం మందికి పైగా మహిళలు, చిన్నారులే. ఇప్పటి శాంతి ఒప్పందంతో తమసొంత ప్రాంతాల్లోనే బందీలుగా ఉన్న పాలస్తీనియన్లకు స్వేచ్ఛ వచ్చినందుకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియాగుటెరస్ ఎంతో సంతోషం వ్యక్తంచేశారు. యుద్ధాలతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఇకపై గాజా స్ట్రిప్ ఇజ్రాయెల్‌లు శాంతి ధామాలని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతే తప్ప ఈ దేశాల మధ్య యుద్ధానికి ప్రధాన కారణమైన 'పాలస్తీనాఅంశంపై ట్రంప్ ఏమీ మాట్లాడలేదు. దీనిపై ఎలాంటిఒప్పందమూ జరుగలేదు. కాల్పుల విరమణ అన్నది ప్రధానాంశం.అయితే గాజా పునర్నిర్మాణం కోసం సుమారు రూ. 4.7 లక్షల కోట్ల అవసరమౌతుందన్న అంచనాలు వేశారు.అన్నీ ఇజ్రాయెల్ నేతృత్వంలోనే జరుగుతాయన్నది సుస్పష్టం. కాగా 'హమా స్' దళాలకు ఎలాంటి పని చెప్పకుండా గాజాలో పాలస్తీనా భద్రతా దళాల్ని ఏర్పాటు చేయమన్నారు. అంటేపాలస్తీనా సమస్యకు పరిష్కారం లభించనట్లే! ప్రత్యేక 'పాలస్తీనా' ఏర్పాటు అన్నది హమాస్ ఆకాంక్ష. శాంతి ఒప్పందాలు స్వాగతించదగినవే. ఇరుపక్షాలు శషభిషలు లేకుండా వాటి అమలు చేయడమూ మంచిదే. గాజా అంటే అతిచిన్న ప్రాంతం.ఈయుద్ధంలో పరమ కిరాతంగా ఊచకోతకోసిన చరిత్ర ఇజ్రాయెల్‌దే. ఒకనాటి ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు 56 శాతం భూభాగం ఇజ్రాయెల్‌ది కాగా 43 శాతం భూభాగం పాలస్తీనాకివ్వాలి. కానీ నిన్న మొన్నటి యుద్ధంలో ఇజ్రాయెల్ పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకుంది.పాలస్తీనా ప్రజల్లో అశాంతికి మూలకారణమయ్యిం ది. ఈ వివాదాలు ముగిసి పాలస్తీనాకు స్వతంత్ర దేశంగా గుర్తించబడినప్పుడే అక్కడ పూర్తిస్థాయి శాంతి నెలకొల్పినట్లవుతుంది. దానికోసం ఎదురు చూడాల్సిందే.

ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లోనైనా ధైర్యాన్ని కోల్పోరాదు.



హెచ్.లాంగ్‌ఫెలో

మన జీవితం మనం చేసిన పనులను బట్టి అంచనా వేస్తారు. కానీ జీవించిన కాలాన్ని బట్టి కాదు.



షేక్ స్పియర్

# నకిలీ డాక్టరేట్లతో ప్రతిభకు మకిలి!

***ఈ మధ్యకాలంలో రూ. 150 ఇస్తే చాలు ఆన్లైన్లో డాక్టరేట్ ఇస్తున్నట్టు ధ్రువపత్రాలను పప్పుబెల్లాలవలే పంచేస్తున్నారు. అలా ధ్రువపత్రాలను పొందినవారు వాటిని సామాజిక మాధ్యమాలలో పెట్టుకుని తెలుగు సాహిత్యాన్ని తామే ఉద్ధరిస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రముఖులు ఇటువంటి నకిలీ సంస్థలు ఇచ్చే డాక్టరేట్లు, పురస్కార సభలకు వెళ్లి వారి స్థాయిని తగ్గించుకోవద్దని రచయితలు సూచిస్తున్నారు. డాక్టరేట్లు, పురస్కారం ఇచ్చేవాడి అర్హత ఏమిటి అని ఎవరూ ప్రశ్నించడం లేదు. ఇటువంటి నకిలీ సంస్థలపై ప్రభుత్వం దృష్టిపెట్టి తీవ్రస్థాయి చర్యలు చేపట్టి, వారి ఆటలు సాగకుండా అడ్డుకట్ట వేసి ప్రతిభావంతుల ఆత్మగౌరవాన్ని కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉంది.***



షేక్ అబ్దుల్ హకీం జాని

ఈ మధ్య కాలంలో నకిలీ డాక్టరేట్లను ప్రదానం చేసే సంస్థలు తెలుగు రాష్ట్రాలలో కలకలం సృష్టించాయి. గౌరవప్రదమైన డాక్టరేట్లను ఒక ప్రహసనంగా మార్చారు. పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవడం ఫ్యాషన్గా మారిపోయింది. కొందరు సాహితీవేత్తలు, కళాకారులు ఏదో ఒక బిరుదును పేరుకుముందు తగిలించుకుని తమ ప్రతిభకు తార్కాణంలా వాటిని సమాజానికి చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని కళాసంస్థలు, సామాజిక సంస్థలు అవార్డుల పేరుతో సన్మానాలు, సత్కారాలు చేయడం తెలుగురాష్ట్రాలలో సర్వసాధారణంగా మారిపోయింది. కొంతమంది వ్యక్తులు ఏకంగా గౌరవ డాక్టరేట్లు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గొప్పగొప్ప యూనివర్సిటీలు ఇచ్చే డాక్టరేట్లను ఆయా సంస్థలు ఎగతాళి చేసేలా డాక్టరేట్లు ఇవ్వడం మొదలు పెట్టారు. వీటికోసం ఆయా సంస్థలు ఒక్కొక్కరి నంచి రూ.20వేల నుంచి రూ.50 వేల వరకు కూడా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సంస్థలు చేసే నకిలీ డాక్టరేట్ల అమ్మకాల వ్యాపారం వల్ల సామాజిక, సాంస్కృతిక, సాహితీ, కళల రంగాల్లో సేవ చేస్తూ వస్తున్న నిజమైన సంస్థలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ డాక్టరేట్లు ఇచ్చేవారు, తీసుకునేవారు ఇరువర్గాల వారు లాజిక్‌గా మాట్లాడుతుంటారు. ఆ సంస్థ ఇస్తుంది కాబట్టి మేము తీసుకుంటున్నామని తీసుకునే వారు చెబుతుంటే, మాకు ఐఎస్ఓ గుర్తింపు ఉంది. కాబట్టి మేము డాక్టరేట్లను ఇచ్చే అర్హత పొందాము, డాక్టరేట్లు తీసుకునే వారు అంగీకరిస్తున్నారు కాబట్టే మేము ఇస్తున్నాము అని ఇచ్చెనమ్మ వాయినం, పుచ్చుకోమ్మ వాయినంలో ఇరువర్గాలు మాట్లాడుతున్నారు. అసలు డాక్టరేట్ ఎలా వస్తుంది అనేమూలాల్లోకి వెళితే అనేక విషయాలు బహిర్గతమౌతాయి. వైద్య విద్యను అభ్యసించిన వారికి పేరుకుముందు డాక్టర్ అని పెట్టుకోవడానికి అర్హత ఉంది. అదేవిధంగా విశ్వవిద్యాలయాలలో అనేక సంవత్సరాలపాటు పరిశోధనలు చేసినవారు పట్టా పొందితే డాక్టరేట్ వస్తుంది. పలు రంగాలలో జీవితాంతం కృషిచేసిన వారి ప్రతిభను మెచ్చి యూజీసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు గౌరవడాక్టరేట్ ఇస్తాయి. ఈ రకమైన మూడు డాక్టరేట్లు పొందడమంటే ఆషామాషీ కాదు.అకుంఠిత దీక్షతో ఏళ్ళతరబడి కష్టపడి పనిచేస్తేనే అవి లభ్యమౌతాయి. అలా డాక్టరేట్లు పొందిన వారికి సమాజంలో ఎంతో గౌరవమర్యాదలు కూడా లభిస్తాయి. ఇటువంటి గౌరవమర్యాదలను అడ్డదారిలో పొందాలని కొందరు ప్రాకులాడుతున్నారు. కేవలం కీర్తికాంక్షతో తపించే ఇటువంటి వారి వద్ద డబ్బులు తీసుకుని కొన్ని సంస్థల వారు నకిలీ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేస్తున్నారు. కీర్తి కండూతి కలవారు ఇటువంటి నకిలీ డాక్టరేట్లు కొనుక్కుని తమ పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకుని ఈ సమాజాన్ని తామే ఉద్ధరిస్తున్నట్టు పోజులు కొడుతుంటారు. ఇటువంటి వారి బలహీనతలను తెలుసుకున్న సంస్థలు మాకు ఐఎస్ఓ గుర్తింపు ఉంది. మా సంస్థ డాక్టరేట్లు ఇవ్వడానికి నిజమైన అర్హతకలిగిందని నమ్మబలికి నకిలీ డాక్టరేట్లను పప్పుబెల్లాలవలే పంచేస్తున్నారు. దీనివల్ల విశ్వవిద్యాలయల్లో కష్టపడి చదివి నిజమైన డాక్టరేట్లు సాధించిన పరిశోధకులు, వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్లు, యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుండి ప్రతిభతో గౌరవ డాక్టరేట్లు పొందిన వారి ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అటువంటి ప్రతిభగలవారి గౌరవం కాపాడాలంటే నకిలీ డాక్టరేట్లను అరికట్టవలసిన అవసరం ఉంది. ఇటువంటి సంస్థలు రూ.20 వేల నుండి రూ.50 వేల వరకు ఒక్కొక్కరి నుండి వసూలు చేసి పేరొందిన



గొప్పకళాక్షేత్రంలో వైభవంగా నకిలీ డాక్టరేట్ల ప్రదాన సభను నిర్వహిస్తున్నారు. తమాషా విషయమేమిటంటే ఇటువంటి దోపిడీ సంస్థలు అతిథులుగా పిలవగానే పద్మశ్రీ పురస్కార గ్రహీతలు మొదలుకుని, కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీతలు, కళారత్న అవార్డు గ్రహీతలు, ప్రముఖులుగా ప్రశంసలందుకుంటున్నవారు సైతం ఎగబడి అతిథులుగా వెళుతున్నారు. అటువంటి వారంతా పురస్కార ప్రదాతలుగా ఉండటం వల్ల ఆ పురస్కారం చాలాగొప్పదనే భావన చూసే వారికి ఇంతమంది ప్రముఖుల చేతులమీదుగా ఈ నకిలీ గౌరవ డాక్టరేట్ అందుకున్న కలుగుతుంది. ఇదోరకమైన మాయ. వారు తమ పట్టణాలకు వెళ్ళి గౌరవ డాక్టరేట్ పొందినట్టు పత్రికలకు ప్రకటనలు ఇచ్చి తాము ప్రతిభావంతులమని సమాజానికి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఫోటోలలో ప్రముఖులు ఉండటంతో ఇది చాలా గౌరవప్రదమైన డాక్టరేట్ అని భ్రమపడి విలేకర్లు విపరీతంగా కవరేజ్ ఇస్తున్నారు. ఆ డాక్టరేట్ నకిలీది అని తెలిసేలోపు అందుకున్న వారు ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు.ఇటువంటి నకిలీ డాక్టరేట్ల ప్రదాన కార్యక్రమానికి ప్రముఖులు వెళ్ళడం మానుకుంటేనే వీటిని అరికట్టడానికి అస్కారం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. మంచి, చెడు విజ్ఞత తెలిసిన విద్యాధికులు కూడా అనాలోచితంగా ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొని నకిలీ డాక్టరేట్లకు ఎక్కడలేని గుర్తింపును ఇస్తున్నారు. కాబట్టి ఇటువంటి సంస్థలు ప్రముఖులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించినప్పుడు 'ఇవి నకిలీ డాక్టరేట్లు, వీటిని ప్రదానం చేయడం తప్పు' అని నిర్వాహలను మందలించవలసిన బాధ్యత వారిపై ఉంది. ముఖ్య అతిథులుగా వెళ్ళి పేపర్లో ఫోటోలు వేయించుకుందామని భావిస్తే తమ ప్రతిష్ఠ కూడా దిగజారిపోతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. మాకు ఐఎస్ఓ గుర్తింపు ఉంది కాబట్టి మా సంస్థ గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేయడానికి అర్హత పొందిందని కొన్ని సంస్థలవారు బుకాయిస్తున్నారు. ఈ నేపథ్యలో ఐఎస్ఓ అంటే ఏమిటో తెలుసుకుందాం.

**ఐఎస్ఓ అంటే ఏమిటి?**

ఐఎస్ఓ అంటే (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) ఈసంస్థ స్విట్జర్లాండ్లోని జెనీవాలో ఉన్న ఒక అంతర్జాతీయ ప్రమాణ సంస్థ. ఇది ఉత్పత్తులు, సేవలు, నాణ్యత నిర్వహణ వ్యవస్థలు ఇత్యాది వాటికి ప్రమాణాలు ఇవ్వడం మాత్రమే చేస్తుంది. ఐఎస్ఓ9001 క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఐఎస్ఓ 14001 ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్. ఇలాంటి వాటి ద్వారా ఒక సంస్థ పని నాణ్యత, విధాన పద్ధతులు సరైనవా అనిమాత్రమే నిర్ధారిస్తారు.అంతే కానీ ఐఎస్ఓ ఎప్పుడూ విద్యా అర్హతలు ఇవ్వదు. డాక్టరేట్లు ఇవ్వవడానికి అనుమతి అంతకన్నా ఇవ్వదు. ఐఎస్ఓ సర్టిఫికేట్ ఉన్నప్పటికీ అది విద్యా గుర్తింపు కాదు. నిజమైన డాక్టరేట్లను యూజీసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, డీమ్డ్‌యూనివర్సిటీలు, విదేశీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలుమాత్రమే చట్టబద్ధమైన డాక్టరేట్లు ఇవ్వగలవు. కులం బలంగా పని చేస్తున్న ఈ రోజుల్లో మతపరమైన డాక్టరేట్లు ఇచ్చేవారు ఒక అడుగు ముందుకు వేసి పద్యకవులు, వచన కవులకు కూడా డాక్టరేట్లు ఇవ్వడం ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలలోని పలురంగాలలో ప్రతిభావంతులకుడాక్ట రేట్లు ఇస్తున్నామని కొన్ని విదేశాలకు చెందిన విశ్వవిద్యాల యాలు సైతం హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతా లలో ఒకరోజు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న వంద మందిని సేకరించి ఒక్కొక్కరి నుండి రూ.50 వేలువసూలు చేసి అట్టహాసంగా కార్యక్రమాన్ని జరిపిగౌరవ డాక్టరేట్లు ఇస్తున్నారు. ఈ విధంగా వారు ఒక్కరోజు నిర్వహించిన కార్యక్రమానికిగాను రూ. 50లక్షలు సంపాదించుకుంటున్నారు.ఆ విశ్వవిద్యాలయానికి గుర్తింపు ఉందో?లేదో ఎవరు చూడరు. రూ.50 వేలు చెల్లించి గౌరవ డాక్టరేట్ తెచ్చేసి సమాజంలో రాత్రికిరాత్రి పేరుప్రఖ్యాతులు సంపాదించుకోవాలనే తపన తప్ప వీరివల్ల సమాజానికి ఎటువంటి ఉపయోగం లేదని గ్రహించలేకపోతున్నారు. ఇలా నకిలీ డాక్టరేట్లు ఇచ్చే సంస్థలు తెలుగు రాష్ట్రాలలో చాలా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో రూ. 150 ఇస్తే చాలు ఆన్లైన్లో డాక్టరేట్ ఇస్తున్నట్టు ధ్రువపత్రాలను పప్పుబెల్లాలవలే పంచేస్తున్నారు. అలా ధ్రువపత్రాలను పొందినవారు వాటిని సామాజిక మాధ్యమాలలో పెట్టుకుని తెలుగు సాహిత్యాన్ని తామే ఉద్ధరిస్తున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రముఖులు ఇటువంటి నకిలీ సంస్థలు ఇచ్చే డాక్టరేట్లు, పురస్కార సభలకు వెళ్ళి వారి స్థాయిని. తగ్గించుకోవద్దని రచయితలు సూచిస్తున్నారు. డాక్టరేట్లు, పురస్కారం ఇచ్చేవాడి అర్హత ఏమిటి అని ఎవరూ ప్రశ్నించడం లేదు. ఇటువంటి నకిలీ సంస్థలపై ప్రభుత్వ దృష్టిపెట్టి తీవ్రస్థాయి చర్యలు చేపట్టి, వారి ఆటలు సాగకుండా అడ్డుకట్ట వేసి ప్రతిభావంతుల ఆత్మగౌరమాన్ని కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ●

# మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలను ఆపలేమా?

కామిడి సతీష్ రెడ్డి

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు శృతిమించి పోతున్నాయి.గతంలో పలువురు పేదమహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రోఫైనాన్స్‌లు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారిపాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్స్‌లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పుంజుకున్న మైక్రో ఫైనాన్స్‌లు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీవారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్స్‌ల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘాటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాలలో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళలు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థికక్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలను ప్రారంభంలోనే నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగా ఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయడమో లేదా తామే భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు,రుణాల చెల్లింపులో నిజాయితీని ఆసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్స్‌లు విజృంభిస్తున్నాయి. ఆర్‌బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రోరుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రోఫైనాన్స్‌ల ఏజెంట్లు



పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిలు తిరుగుతున్నారు. 10మందితో సంఘాలు ఏర్పాటు చేయించి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారంవారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ. 30వేల మైక్రోరుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజీ లోన్‌లు కూడా ఇస్తున్నారు. దీంతో పలువురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రోరుణాలను స్వీకరిస్తూ చెల్లించలేక చతకిలపడుతున్నారు.రుణవాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోన్‌లో అందుబాటులో ఉండని పరిస్థితులు పెరుగుతున్నాయి.దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స్ ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణగ్రహితలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణ చెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. నేడు కూడా అలాంటి దుర్ఘాటనలు పునరావృత్తమయ్యే ప్రమాదాలున్నాయని పలువురు అంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లా డివిజన్,మండలకేంద్రాల్లో వేలాది మైక్రో ఫైనాన్స్‌లు వున్నాయని చెన్నయి రాష్ట్రం నుండే కార్య కలాపాలు నిర్వహిస్తూ ఉన్నాయి.రూ.30 వేల నుంచి రూ.2లక్షల వరకు ఇస్తున్న రుణాలను 48 వారాల్లో సమ వాయిదాలతో చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క వాయిదా చెల్లింపులో ఆలస్యం జరిగినా భారీ జరిమానాతో వసూళ్లు చేస్తున్నారు.సకాలంలో వాయిదాలు చెల్లించని రుణగ్రహితల పరువును బజారులో నిలదీస్తున్నారు. ఈ క్రమంలో మైక్రో ఫైనాన్స్‌లను నిషేధించాలంటూ మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.లేనిపక్షంలో పలు పేదకుటుంబాలు విచ్ఛిన్నమయ్యే ప్రమాదాలు ఉన్నాయి. అవగాహన రాహిత్యం, ఆర్థిక అవసరాల కోసం అధికవడ్డీతో రుణాలుతీసుకుంటున్న పలువురు మహిళలు వాయిదాలు చెల్లించలేక మొహం చాటేస్తున్న పరిస్థితి ఉంది.స్తోమతకు మించి రుణాలు మంజూరు జరుగుతుండడంతో తిరిగి చెల్లించలేక ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలోనే గత దుర్ఘటనలు పునరావృత్తమయ్యే ప్రమాదం ఉంది. ●

# రెవెన్యూ వ్యవస్థలో పర్యవేక్షణ అవసరం

తరిగోపుల నారాయణస్వామి

ప్రస్తుత కాలంలో మన సమాజంలో ఎదురవుతున్న సమస్యలలో ఒకటి రెవెన్యూ వ్యవస్థలో నెలకొన్న అవ్యవస్థలు. సాధారణ ప్రజలు తమ హక్కుల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నిస్సహాయ స్థితిలో పడుతున్నారు. ప్రభుత్వం పౌరుల సేవ కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాలు కొంతమంది బలవంతుల ఆధీనంలోకి వెళ్లినట్లు అనిపిస్తోంది. సత్యం చెప్పాలంటే, ప్రజలకు సహాయం చేయాల్సిన కొందరు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గ్రామాల్లో భూములపై హక్కుల నిర్ధారణ, వారసత్వ హక్కులు, సర్వే వివరాలు వంటి ప్రాథమిక సేవలు సకాలంలో అందుబాటులో ఉండాలి. కానీ వాస్తవంలో ఇది చాలా అరుదుగా జరుగుతోంది. ప్రజలు దరఖాస్తులు వేసినా నెలల తరబడి సమాధానాలు రాకపోవడం సాధారణ విషయంగా మారింది. కొన్నిసార్లు ఫైళ్లను కావాలనే ఆపివేయడం కూడా జరుగుతోందన్న అనుమానం ప్రజల్లో ఉంది. గ్రామస్థాయిలో భూ సమస్యలు చిన్న చిన్న అపార్థాల వల్ల పెద్ద సమస్యలుగా మారిపోతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ వ్యవస్థలోని సిబ్బంది తగిన సమయానికి చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. దాంతో సమస్యలు పెరిగి కోర్టుల దాకా వెళ్లే పరిస్థితి ఏర్పడుతోంది. సాధారణ ప్రజలకు ఇది చాలా భారంగా మారుతోంది.రీ సర్వే పనులు చేపట్టినప్పటి నుండి చాలా చోట్ల భూముల సరిహద్దులు తప్పుగా నమోదు చేయబడటం, పాత రికార్డులతో కొత్త వివరాలు సరిపోలకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజలు తమ పూర్వీకుల నుండి వస్తున్న భూములకు కూడా హక్కులు నిర్ధారించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. భూములపై హక్కుల నిర్ధారణలో కొంతమంది బలవంతులు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. నిజమైన హక్కుదారుల కంటే బలమైన సంబంధాలు కలిగిన వారు తమ ఆధీనంలో పత్రాలు మలుచుకుని, అసలు హక్కుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ పరిస్థితి గ్రామీణ ప్రజల్లో న్యాయం మీద నమ్మకాన్ని తగ్గిస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కూడా పలు అవ్యవస్థలు చోటు చేసుకుంటున్నాయి. ఒక భూమి పై రెండు మూడు రకాల పత్రాలు



తయారు అవుతున్న సంఘటనలు తరచూ వినిపిస్తున్నాయి. ఇది ప్రజల్లో భయాన్ని కలిగిస్తోంది. భూమి కొనుగోలు చేసిన తర్వాత కూడా తామే నిజమైన యజమానులమా కాదా అన్న అనుమానం వారికి మిగిలిపోతోంది. దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం ఒక పెద్ద సమస్యగా ఉంది. ఒక సాధారణ సర్టిఫికెట్ పొందడానికి కూడా వారాల తరబడి తిరగాల్సిన పరిస్థితి. ఆన్లైన్ వ్యవస్థలు వచ్చినప్పటికీ వాటి ద్వారా పూర్తి పరిష్కారం లభించడం లేదు.సాంకేతిక లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల సిబ్బంది తీరుతో ప్రజలు భయపడి సరైన సమాచారం అడగకుండానే వెళ్లిపోతున్నారు. ప్రజాసేవకులు కావాల్సిన వారు బలవంతుల పక్షాన నిలబడి ప్రజలను వెనక్కి తగ్గేలా చేస్తున్నారనే భావన పెరుగుతోంది. సమస్యలు పెరగడానికి ప్రధాన కారణం పర్యవేక్షణ లోపం. ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయకపోవడం వల్ల క్రింద స్థాయిలో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. ఫిర్యాదులు చేసినా సరైన స్పందన లేకపోవడం కూడా ప్రజలలో నిరాశను పెంచుతోంది. ఈ పరిస్థితుల్లో సాధారణ ప్రజలు న్యాయం కోసం మధ్యవర్తులు, రాజకీయ నాయకులు లేదా న్యాయవాదుల సహాయం తీసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సమయపరంగా, ఆర్థికపరంగా భారంగా మారుతోంది. రెవెన్యూ వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే కఠినమైన చర్యలు అవసరం. ఫైళ్ల ఆలస్యం, తప్పు రికార్డులు, బలవంతుల ఆధిపత్యం, సిబ్బంది నిర్లక్ష్యం వంటి అంశాలను సీరియస్‌గా పరిగణించి తక్షణ పరిష్కారం చేయాలి. ప్రజలు హక్కుల కోసం అధికారులను వేడుకోవాల్సిన పరిస్థితి కాకుండా, వారు స్వయంగా సేవలు అందేలా వ్యవస్థ మారాలి. పారదర్శకత, బాధ్యత, సమయపాలన వంటి విలువలను రెవెన్యూ వ్యవస్థలో అమలు చేయాలి. ప్రజల భూముల సమస్యలు పరిష్కారమైతే సమాజంలో శాంతి, న్యాయం నెలకొంటుంది. ఈ సమస్యలను వాయిదా వేస్తే సామాజిక అసమానతలు పెరుగుతాయి. అందుకే రెవెన్యూ వ్యవస్థలో తక్షణ సంస్కరణలు అవసరం.రెవెన్యూ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తే గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. లేకపోతే బలవంతులు మాత్రమే లాభపడే పరిస్థితి కొనసాగుతుంది. అందుకే ప్రభుత్వ యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యలను ప్రతి పౌరుడు సీరియస్‌గా పరిగణించి, సమాజంలో న్యాయం నిలబెట్టే ప్రయత్నం చేయాలి. వ్యవస్థలో మార్పులు రావాలంటే ప్రజల అవగాహన కూడా అంతే ముఖ్యం. ●

# ప్రజావాక్కు



### రిజర్వేషన్ సాధనకు బీసీల కదలిక అవసరం

బీసీ సమాజం దేశంలో పెద్దసంఖ్యలో ఉన్నప్పటికీ, రాజకీయ, ఆర్థిక, విద్యారంగాల్లో ఇంకా తగిన స్థానం పొందలేకపోయింది. అందువల్ల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది సముచిత హక్కు. ఈ హక్కును సాధించడానికి బీసీలు ఒకటిగా కదలిక చేయడం అత్యవసరం.మొదటగా బీసీ సంఘాలు,విద్యార్థిసంఘాలు, ఉద్యోగుల సంఘాలు ఐక్యతతో ముందుకు రావాలి. ఈ సమస్యపై అవగాహన సదస్సులు, చర్చాకార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలి. ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇవ్వడం, ఎమ్మెల్యేలు, ఎంపీలను కలవడం వంటి చర్యల ద్వారా రాజకీయఒత్తిడి తీసుకురావాలి.అలాగే సోషల్ మీడియా, వార్తామాధ్యమాల ద్వారా ప్రజాభిప్రాయం మేల్కొలపాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### దారి తప్పిన వర్షం

దారితప్పిన వర్షంతో రైతులు ఆగం ఆగం అవుతున్నారు. చేతికాడికి వచ్చిన తెల్ల బంగారం దండగ దోషాలుకు అమ్ముకోవలసిన పరిస్థితిఉంది.దీనివల్ల దళారులు లాభం పొందుతారు తప్ప రైతన్నఆగం అయితుండు. క్యూమలో నింబస్ మేఘాల ప్రభావంవల్లనే ఈ పరిస్థితి దాపురించింది. బహుశా కోతుల గురించి కూడా రైతు కమిషన్ ఆలోచించే పరిస్థితి వచ్చిందంటే పరిస్థితి చెయ్యి దాటి పోయిందని అర్థం అవుతున్నది. స్వామినాథన్ కమిటీ సిఫారసులుగాల్లో కలిసిపోయాయి. 2007లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం వేసిన జయంతి గోష్ కమిటీ నివేదిక బుట్టదాఖలు అయ్యింది.ఇన్ని ఒడిదుడుకుల మధ్య కూడా రైతన్నలు కాడిని నాగలిని నమ్ముకొని రేపటి ఉదయం కోసం ఎదురు చూస్తుంటారు.

- యార కొమురయ్య, అక్కపల్లి గూడెం

### రీ పట్టాలు ఇవ్వండి

రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఉన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీలలో రెవిన్యూ రికార్డుల ప్రకారం కొలతలుచూసి కొనుగోలు,అమ్మకాలు జరిగిన స్థలంలో వికలాంగుల ఇడ్లస్థలాలు కబ్జాలుచేశారు. ఇటీవల కొనుగోలు చేసిన వారికి రికార్డులు చూసి ప్రభుత్వం రీ పట్టాలు ఇవ్వాలి. కాలనీ భూ సమస్యలు పరిష్కారం చేసి న్యాయం చేయాలి. రీ పట్టాలు కొనుగోలు చేసిన వారికి ఇవ్వండి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు

భారతదేశం యువశక్తికి నిలయమని మనం గర్విస్తున్న తరుణంలో,విద్యాసంస్థల్లో చోటుచేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలు మనల్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. నేటి విద్యా వ్యవస్థ కేవలంమార్కుల పరుగుపందెంగా మారి, విద్యార్థులను అపారమైన ఒత్తిడికి గురిచేస్తోంది. తల్లిదండ్రుల అధిక అంచనాలు,కోచింగ్ కేంద్రాల వ్యాపార ధోరణి, విద్యాసంస్థల్లో మానసిక సంక్షేమానికి ప్రాధాన్యత లేకపోవడం ఈ విషాదానికి ప్రధాన కారణాలు.ఈ నిశ్శబ్ద వేదనలను అర్థం చేసుకోవడంలో మన సమాజం విఫలమవుతోంది.ఐఐటీ వంటి ప్రఖ్యాత సంస్థల్లోనేఆత్మహత్యలు జరగడం మనవిద్యావ్యవస్థలోని లోపాలను స్పష్టంగా చూపిస్తోంది. విద్యార్థి మానసిక ఆరోగ్యం ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించాల్సిన సమయం ఇది. ఈ మార్పు తక్షణమే రాకపోతే, దేశ భవిష్యత్తుకు తీరని నష్టం వాటిల్లుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### మహిళలకు ప్రత్యేక బస్సులుండాలి

తెలుగురాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం బాగానే ఉంది. అయితే తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి ఉచిత బియ్యం ఇచ్చినట్లు, బస్సుల్లో కూడా తెల్ల రేషన్ కార్డు ఉంటే ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తే బస్సుల్లో రద్దీ తగ్గుతుంది.ఎందుకంటే ఉచిత బస్సు అనగానే బస్సు నిండా మహిళలునిండిపోతున్నారు.పురుషులకు కేటాయించినసీట్లను కూడా వారే ఆక్రమించుకొంటున్నారు.ప్రతి బస్సులో సగంసీట్లు మహిళలకు, మిగతా సగం సీట్లు పురుషులకు కేటాయిస్తే బస్సుల్లో గొడవలుజరగకుండా ఉంటాయి.అంతేకాకుండామహిళల కోసమే కొన్ని బస్సులునడిపితే, బస్సుల్లోరద్దీ కూడా చాలావరకు తగ్గించవచ్చు. ఈ దిశగా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### లైంగిక దాడులను అరికట్టాలి

సమాజంలో చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడుల సంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది. యునిసెఫ్ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతం బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుండగా, వాటిలో 90శాతం దాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది. ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

Main tab page 111_Main tab page 111.qxd 10/14/2025 11:47 PM Page 1



## స్వదేశీ వస్తు వినియోగం ప్రాముఖ్యత పెంచాలి

### - ఎమ్మెల్సీ సోము వీర్రాజు

**ఒంగోలు, ప్రభావార్త**




ఇందిరా ప్రియదర్శిని కాలేజీ ఫంక్షన్ హాల్‌లో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సోమ వీర్రాజు హాజరై ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో స్వదేశీ వస్తు వినియోగం ప్రాముఖ్యతను వివరించారు, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా వికసితభారత్-2047 లక్ష్యాన్ని సాధించవచ్చు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మరొక ముఖ్య అతిథిగా జోనల్ ఇంచార్జ్ అశోక్ రాజు పాల్గొని మాట్లాడుతూ ఆత్మనిర్భల్ భారత్ కార్యక్రమాన్ని ప్రతి మండలం, గ్రామస్థాయికి తీసుకువెళ్లాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ ఎన్ఎస్ సూర్య కళ్యాణ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి టి అశోక్‌రెడ్డి, జేవీ నారాయణ, మాకినేని అమర సింహం, మాజీ జిల్లా అధ్యక్షులు పీవీ శివారెడ్డి, టీవీ కృష్ణారెడ్డి, యోగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడిక్యూర్ హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

### - గుండెజబ్బుతో బాధపడుతున్న వ్యక్తిని ప్రాణాలతో కాపాడిన డాక్టర్లు

**ఒంగోలు, ప్రభావార్త**




గుండెలో క్యాల్షియం పేరుకుపోయి స్టంట్ వేయలేని స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానిక మెడిక్యూర్ వైద్యులు కాపాడారు. అత్యాధునిక పరికరం ద్వారా శస్త్ర చికిత్సను అందించి కాపాడినట్లు మెడిక్యూర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కే శ్రీధర్‌బాబు తెలిపారు. నగరంలోని రాంనగర్ నాలుగో లైన్‌లో గల మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన శేషగిరిరావు 83 సంవత్సరాలు వయసు గల వ్యక్తి గుండెజబ్బుతో మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ని సంప్రదించారన్నారు. వైద్యపరీక్షల అనంతరం హైదరాబాద్, విజయవాడ తీసుకువెళ్లాలని వారి కుటుంబ సభ్యులకు తెలియజేసినప్పటికీ వారి కుటుంబసభ్యులు ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని కోరడంతో ఆత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి డ్రిల్లింగ్ మిషన్ లాంటి యంత్రం ద్వారా కాల్షియంని కట్ చేసుకుంటూ స్టంట్‌ను వేసి ప్రాణాలు కాపాడామని ఇది జిల్లాలోనే మొట్టమొదటి అరుదైన చికిత్స అన్నారు. 83 సంవత్సరాల వయసులో గుండె ఆపరేషన్ కూడా చేయటానికి వీలుపడని కారణంగా ఈ అత్యాధునిక పరికరం ద్వారా సాధ్యమైందని పేషంటు తమపై నమ్మకం ఉంచి ఈ చికిత్సను అందించుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రోగి కుమారుడు సుబ్బారావు మాట్లాడుతూ ఎంతకష్ట పరిస్థితుల్లోనైనా ఇక్కడే వైద్యం అందించాలని కోరామని, డాక్టర్ శ్రీధర్‌బాబు రిస్క్‌తో కూడుకున్నటువంటి చికిత్సను అందించి మా నాన్న ప్రాణాల కాపాడారని వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మెడికూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు, మేనేజర్ దాసరి సుధాకర్ పాల్గొన్నారు.

## విద్యా కమిటీ చైర్మన్ అభినందించిన డీఈవో

**కొండపి, ప్రభాతవార్త**



మండలంలోని కె ఉప్పలపాడు హైస్కూల్ అభివృద్ధికి కృషిచేసిన విద్యా కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మన్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్‌కుమార్ అభినందించారు. మంగళవారం ఆయ న ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్ ప్లస్ ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలను బోధన తరగతి గదులను భవనాలను పాఠశాలల్లోని మౌళిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల విద్యా ప్రగతి పరీక్ష సిద్ధత హాజరు శాతం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో సంభాషించారు కొందరి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి నేర్చుకున్న జ్ఞానాన్ని పరీక్షించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తి పెంచేలా బోధన చేయాలి పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచి ప్రతి విద్యార్థి హాజరుకావడానికి తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రలో భాగంగా ప్రతి విద్యార్థి యూనిఫాం షూస్ అందరూ ధరించే విధంగా విద్యార్థులకు సూచించాలని అన్నారు. పదో తరగతి ఇంటర్ గత సంవత్సర ఫలితాలను తెలుసుకొని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌యం ఎన్ రవీంద్ర ప్రసాద్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎంపీ మాగుంట పుట్టిన రోజు వేడుకలు



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఉదయం 7.30గంటల నుండి ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు అభిమానుల సమక్షంలో ఘనంగా న్విహిం చనున్నట్లు అభిమానులు తెలియజేశారు. ఉదయం 9గంటలకు అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కటింగ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఏపీ జెఎసి మహిళా నేతలు

**ఒంగోలు, ప్రభావార్త**



ఏపీ జేఏసీ అమరావతి ప్రకాశం జిల్లా ఉమన్ వింగ్ చైర్‌పర్సన్ నర్రా విజయలక్ష్మి, జనరల్ సెక్రటరీ సిహెచ్ శ్రీదేవి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కె రాజాబాబును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళా ఉద్యోగుల సమస్యల గురించి వారికి వివరించారు. మహిళల సమస్యలపై తనను ఎప్పుడైనా కలవచ్చని కలెక్టర్ వారికి చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సభ్యులు ఏ సుమలత, ఏ తిరుపతమ్మ, జి అనంతలక్ష్మి, షేక్ హసీనా, గాయత్రితో పాటు కలెక్టరేట్ యూనిట్ సభ్యులు ఉన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగపరుచుకోండి : కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**




ఎస్‌డీఅండ్‌టి డిపార్టమెంట్- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వ ర్యంలో ఈనెల 17న అక్టోబర్ 2025న ఎస్ఎన్ పాడు ప్రకాశం జిల్లాలోని డీఎంఎస్‌వీకే మహిళా ప్రాంగణంలో నిర్వహించబడనున్న జాబ్ మేళా కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ రాజాబాబు ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం పలు సంస్థలతో కలిసి ఈ జాబ్ మేళాలను నిర్వహిస్తోంది. ప్రతీ అర్హత ఉన్న అభ్యర్థి తప్పక ఈ మేళాలో పాల్గొని అవకా శాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటెరో లాబ్స్, శ్రీ చక్ర హ్యూం దాయ్, ఎంఆర్ఎఫ్, బ్రహ్మసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, భారత్ ఆక్సాలైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫ్లిప్ కార్ట్, పేటీఎం, పీఎస్ఆర్ కనస్ట్రక్షన్, తిరుమల ఆటోమోటివ్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి.18నుండి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు తమ అర్హతతో ఈ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు. బీటెక్, డిగ్రీ, ఇంటర్మీ డియట్, ఐటీఐ, డిప్లొమా, పీజీ వంటి అర్హతలున్న అభ్యర్థులకు వివిధ రంగాలలో అవకాశాలు లభించనున్నాయి. జిల్లా యువత తమ రిజిస్ట్రేషన్‌ను హెచ్‌టీటీపీఎస్://ఎన్ఐపీయు ఎన్‌వైఏఎం. ఏపీ.జీవోవి.జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి చేసుకోవాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సంతనూతల పాడులోని డీఎంఎస్‌వీకే మహిళా ప్రాంగణం నందు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రమాదేవి, జిల్లా ఉపాధి అధికారి జే.రవితేజ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి,ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ముఖ మండపానికి లక్ష విరాళం

**అద్దంకి, ఆక్టోబరు 14, ప్రభాతవార్త**



సింగరకొండలోని శ్రీ ప్రసన్నాం జనేయస్వామి నూతన ముఖ మండపానికి మంగళవారం కోగంటి బసవపున్నయ్య, సుశీలదేవి జ్ఞాపార్థం వారి మనుమళ్ళు శ్యామ్, సంజయ్, రూ.1,11,116లు ఆయల ఛైర్మన్ చుండూరీ మురళీ సుధాకరావుకు అందజేవారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ డైరెక్టర్ వెజెండ్ల ఆంజనేయులు తదితరులు వున్నారు.

## గ్రామాల సమగ్రాభివృద్ధి..సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే

### - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**ఒంగోలు, ప్రభాతవార్త**





గ్రామాల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఈ విషయాలలో నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోనని హెచ్చరిం చారు. ఒంగోలు డివిజన్‌లోని పంచాయతీ కార్య దర్శులకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాత సమావేశ మందిరంలో నిర్వహించిన ఓరి యంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రెగ్యులర్ విధులతో పాటు తమ పరిధిలో జరిగే అభివృద్ధి, ప్రభుత్వ ఆస్తులకు భద్రత, పారిశుధ్యం, ప్రజారోగ్యం, తాగునీటి సరఫరా సంబంధిత అంశాలపైన పంచాయతీ కార్య దర్శులు ప్రత్యేకదృష్టి సారించాలని ఆదేశించారు. పారిశుధ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆయన గుర్తు చేశారు. సీజనల్ వ్యాధు లు ప్రబలకుండా చూడటంలోనూ పారిశుధ్యం అత్యంత కీలకమన్నారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించడంలో ప్రభుత్వం మార్గదర్శ కాలను పగడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత పంచా యతీ కార్యదర్శులదేనని చెప్పారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాల న్నారు. ప్రత్యేకంగా కొన్ని స్థలా లను ఎంపిక చేసి స్వచ్ఛతలో అవి నమూనాగా నిలిచేలా ప్రత్యేక దృష్టి సారిం చాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఆ ప్రాంతాలలో చెత్త వేయకుండా ప్రజలకు కూడా అవ గాహన కల్పించాలన్నారు. సిం గిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి నందుకు దీనిపైనా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేకంగా ప్లాస్టిక్ వ్యర్థాల కోసం వీధి చివర్లో చెత్తడబ్బాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పంచాయతీకి సంరక్షణ అధికారిగా కార్యదర్శులపై తమ పరిధిలోని ప్రభుత్వ భూము లు ఆక్రమణకు ముగ్గురు కాకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇది పూర్తిగా రెవెన్యూకు సంబందించిన అంశమని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. గ్రామాల లో జరుగుతున్న స్వమిత్వ సర్వేలను పర్యవేక్షించా లని ఆయన చెప్పారు. పంచాయతీల పరిధిలో జరుగుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలలోనూ కార్యదర్శులు భాగస్వాములు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించినట్లుగా జీవీఏ పెంచడంలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలన్నారు.తాగునీటి సమస్య కేవలం ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి మాత్రమే చెందినదని అనుకోరాదని, స్థానిక పరిస్థితులపై పంచాయతీ కార్యదర్శుల సమగ్ర పర్యవేక్షణ అవసరమన్నారు. ఈ విధులలో మొక్కుబడిగా వ్యవహారిస్తే ఊరు కోబోనని హెచ్చరించారు.ఎలాంటి నిర్లక్ష్యం వహిం చినా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తినా పంచాయతీ కార్య దర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఆయా విషయాలకు సం బంధించిన రోజువారీ సమాచారాన్ని తనకు పం పించాలని ఉన్నతాధికారులను కలెక్టర్ ఆదేశిం చారు. ఈ సమావేశంలో డీపీవో వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈఓ చిరంజీవి, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ పాల్గొన్నారు.

## కోటి సంతకాల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

### - వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా పిలుపు

**మార్కాపురం, ప్రభాతవార్త**



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 14 వ తేదీ నుండి జరుగు సంతకాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వెన్నా హనుమా రెడ్డి పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్యకళా శాలలను ప్రైవేటుపరం చేయడం అంటే సామాన్య ప్రజలకు వైద్య విద్యను దూరం చేయడమేనని ఆయన విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యాన్ని, ముఖ్యంగా వైద్య విద్యను సామాన్య విద్యార్థులకు ఉచితంగా అందించాలన్న సామాజిక దృక్పథంతో గతంలో ఎన్నడు లేని విధంగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలలను మన రాష్ట్రానికి తీసుకురావడం జరిగిం దని ఆయన అన్నారు. నిర్మాణ దశ చివరిలో ఉన్న మెడికల్ కళాశాలను పూర్తిచేసి వినియోగం లోకి తీసుకు రావలసిన ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దేశంలోనే నేనే సీనియర్ ముఖ్యమంత్రిని అని పదేపదే చెప్పుకుంటున్న చంద్రబాబు ఆయన హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో గాని, అనంతరం విభజన రాష్ట్రంలో కానీ కనీసం ఒక్క మెడికల్ కాలేజీని కూడా తీసుకొని రాలేకపోయారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడాన్ని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుమయులకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకే మెడికల్ కళాశాలను కొంతమంది వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాగ్రహన్ని చవి చూడక ముందే మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేనిచో తమ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి పాలక వర్గాన్ని హెచ్చరించారు.

## టీడీపీ తమ్ముళ్ల ఆవేదన పార్టీ లోపల రచ్చ..

## బాబు జోక్యం తప్పనిసరి

**ఒంగోలు, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చి 16 నెలలు అవు తుంది. పార్టీలో అంతర్గత చర్యలు వేడెక్కుతున్నాయి. టీడీపీ నాయకులం దరూ తప్పులు చేస్తున్నారు, దోచుకుంటున్నారు అనే కామెంట్లు పార్టీలోపలే వినిపించడమే ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇసుక, మద్యం, మట్టి వంటి అంశాలలో పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నప్పటికి అందరూ దోషులా అన్నది అసలు ప్రశ్న. టీడీపీకి ప్రస్తుతం 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో పెద్ద సంఖ్యలో ప్రజలతో మమేకమై మంచి పాలన అందించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సుమారు 2 నుండి 5శాతం మంది మాత్రమే అక్రమాల్లో అన్యాయాల్లో జోక్యం చేసుకుంటున్నా రని లోపలి విశ్లేషణ చెప్తుంది. అయిన కొందరు విశ్లేషకులు మీడియా చర్చల్లో పాల్గొంటున్న టీడీపీ సీనియర్లు మాత్రం మిగిలినవారంతా అధికారం, హోదా అనుభవిస్తున్నారని ఒకే గాటున కట్టేస్తున్నారు. ఇలాంటి కామెంట్లు బాహ్య ప్రజల ముందు వస్తుండడంతో నిర్ధోషులైన మెజార్టీ తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామీద తప్పు లేదు. అయినా అందరిని కలిసి విమర్శిస్తు న్నారు. తప్పు చేసిన వారి పేర్లు చెప్పి చర్యలు తీసుకోవాలి. కానీ అందరిని కలిపి చెడగొట్టడం పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీసునందని పలు జిల్లాలకు చెందిన కీలక నేతలు స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. పార్టీ పట్ల విశ్వాసం ఉన్న నిజాయితీగా పని చేస్తున్న నాయకులు కూడా ఇలాంటి కామెంట్ల వల్ల మానసికంగా దెబ్బతింటున్నారు. మేము షూటిగా పని చేస్తున్నాం, ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నాం, ప్రజలతో ఉన్నాం అయినా మమ్మల్ని కూడా దోచు కుంటున్నారా అని అడుగుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే ప్రజల్లో ప్రతికూలత పెరిగి చివరికి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఇమేజ్‌లకే నష్టం వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తం అవు తుంది. అందుకే పార్టీ అంతర్గతంగా ఇప్పుడు ఓ డిమాండ్ జోరుగా వినిపిస్తుంది. తప్పు చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోండి. కానీ అందరిని ఒకే లైన్లో నిలపొద్దు, ఇది టీడీపీ భవిష్యత్తుకు కూడా అవసరం. తప్పు చేసిన కొందరిని వదిలి నిజాయి తీగా పని చేస్తున్న వారిని నిందించడం పార్టీ లోపల విభేధాలు పెంచుతుంది. టీడీపీ ఇప్పుడు అధికారం లో ఉంది. ప్రజల అంచనాలు కూడా ఎత్తులోనే ఉన్నాయి. అలాంటప్పుడు పార్టీలో తలెత్తిన చిన్న తప్పులు పెద్దవిగా మారకముందే చంద్రబాబు జో క్యం అవసరం. తప్పుచేసిన వారిని భయట పెట్టాలి కాని అందరిని ఒకే గాడిన పెట్టడం పార్టీ భవిష్యత్తు ను ప్రశ్నార్థకంగా చేస్తుంది అంటూ ప్రశ్నిస్తున్నారు.

## నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతోమేలు

### - రాష్ట్ర బీజేపీ సెల్స్ కో కన్వీనర్ నిడమానూరి డాక్టర్ సూర్యకల్యాణ్ చక్రవర్తి

**ఒంగోలు, ప్రభావార్త**



జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ నూతన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం ఒంగోలులో నూతన జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి వినియోగదారులు, వ్యాపారులతో కలిసి మాట్లాడి నూతన జీఎస్టీ విధానంపై అవగాహన కల్పించారు. రత్నదీప్, ఉషోదయ సూపర్ మార్కెట్లలో వినియోగ దారులతో మాట్లాడి తగ్గిన ధరలపై వాని అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మద్య తరగతి వారి మేలు కోరేది బీజేపీ ప్రభుత్వం మాత్రమే అని గుర్తు చేశారు. జీఎస్టీ స్లాబ్ లలో మార్పులు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అంతకు ముందు మంగమూరు రోడ్డులో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, ఐటీ సెల్ కన్వీనర్ గుర్రం సత్యనారాయణ, జిల్లా జనరల్ సెక్రటరీ జేవీ నారాయణ, జనరల్ సెక్రటరీ అశోక్ రెడ్డి, ఒంగోలు మండలం 5 అధ్యక్షులు గరికపాటి వంశీకృష్ణ, యువ మోర్చ వైస్ ప్రెసిడెంట్ వర్మ, రత్నదీప్ మేనేజర్ యుగంధర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మోడీ జీ కి థ్యాంక్స్ అంటూ నినాదాలు చేశారు.

## పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు భూగర్భ జల స్థాయి పెరిగేలా చెక్ డ్యామ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, చెరువులు, ఫీడర్ చానల్స్ పూడిక తీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు డ్వామా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు డ్వామా అధికారులతో సమావేశమై జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు జరుగుతున్న ఫారం ఫాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు, అమృత్ సరోవర్ పనులు, రోడ్డు ఫార్మేషన్, హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బౌండరీస్, తదితర పనులకు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా అమలు జరుగుతున్న వివిధ కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాలను, సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని, అందులో భాగంగా వాటర్ షెడ్స్, క్యాటిల్ షెడ్స్ నిర్మాణాలు తదితర పనులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రకాశం జిల్లా నీటి ఎద్దడి ఉన్న జిల్లా కాబట్టి ఈ విషయాన్ని ప్రధానంగా తీసుకొని భూగర్భ జల స్థాయి పెరిగేలా చెక్ డ్యామ్స్, ఇంకుడు గుంతల నిర్మా ణాలు, చెరువులు, ఫీడర్ చానల్స్ పూడిక తీత పనులపై క్లస్టర్స్ వారీగా ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు హార్టికల్చర్ ప్లానిటేషన్ ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఒక కోటి 11 లక్షల పని దినాలు కల్పించడం జరిగింది. మిగిలిన పని దినాల లక్ష్య సాధనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ల వారీగా చేపట్టే పనులలో లేబర్ మొబిలైజేషన్ ఎక్కువగా ఉండేందుకు తగు ప్రణాళికను సిద్ధం చేసుకొని అందుకు అనుగుణంగా అందరూ సమన్వయం చేసుకొని క్షేత్ర స్థాయి వరకు పని చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం యొక్క నియమ నిబంధనలను తప్పక పాటిస్తూ నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో భూగర్భ జల స్థాయి పెరిగేలా ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా అధికారులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిసిన బిల్లా చెన్నయ్య

**ఒంగోలు, ప్రభావార్త**



ఆంధ్రప్రదేశ్ ప్రిన్సి పల్ సెక్రటరీ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ (మైన్స్) ముఖేష్ కుమార్ మీనా, ఏపి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఇన్స్పె క్టర్ జనరల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్లను మాల మహానాడు రాష్ట్రఅధ్యక్షులు బిల్లా చెన్నయ్య మర్యా దపూర్వకంగా కలిశారు. వారి కార్యాలయాల్లో కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇరువురు సానుకూలంగా స్పం దించారు. బిల్లా చెన్నయ్య వెంట పాటు అనీల్ ఉన్నారు.



6_6.qxd 10/15/2025 12:40 AM Page 1



## విఆర్ సాహితీ పురస్కారానికి పుట్టంరాజు ఎంపిక



**అద్దంకి, అక్టోబరు 14, ప్రభాతవార్త**

కళామిత్రమండలి వార్షికోత్సవానికి పురస్కరించుకొని జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన పురస్కారాలకు అద్దంకికి చెందిన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఎంపిక అయ్యారు. వంకాలయపాటి రామకృష్ణ స్మారక సాహితీ ప్రతిభ పురస్కారం పేరుతో ఈ అవార్డులను ఇవ్వనున్నారు. 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నవంబరు 2న ఒంగోలులోని ఆర్డిఒ కార్యాలయ ప్రాంగణంలో ఎన్టిఆర్ కళాక్షేత్రంలో ఈ పురస్కారాల పంపిణీ సభా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిని పలువురు కవులు, కళాభిమానులు, అభినందించారు. అభినందించిన వారిలో వారణాసి రఘురామశర్మ, డివిఎం సత్యనారాయణ, కెవి పోలిరెడ్డి, సింగరకొండ ఆలయ చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, కె పాపారావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, కె సుబ్బారావు, కె. రామకోటేశ్వరరావు, కె.కుమార్, యు.రాజశేఖర్, ఎం. శ్రీనివాసరావు తదితరులు వున్నారు.

## మంత్రి అదేశాలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**అద్దంకి ,అక్టోబరు 14, ప్రభాతవార్త**

మండలంలోని మణికేశ్వర గ్రామంలో సోమవారం భారీ వర్షం, ఉరుములు, మెరుపులతో శివాలయం వద్ద నున్న ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయింది. గ్రామస్థులు రెండు రోజులుగా త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రామ టిడిపి నేత కరిముల్లా ఈ సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. మంత్రి అదేశాలతో యుద్ద ప్రాతిపధికన ఆ శాఖ అధికారులు కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో క్రొత్త ట్రాన్స్ ఫార్మర్‌ను బిగించారు. దీనితో మణికేశ్వరం, కొంగపాడు, అనమనమూరు గ్రామాలకు త్రాగునీటిని అందించే స్కీంకు విద్యుత్ సౌకర్యంకూడ ఏర్పడింది. దీనితో ఆయా గ్రామస్థులు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం సేవించి డ్రైవింగ్ చేసిన వ్యక్తికి జరిమాన

**అద్దంకి అక్టోబరు 14, ప్రభాతవార్త**

పట్టణంలోని భవానీ సెంటర్‌లో మద్యం సేవించి, కారును నడుపుతున్న వ్యక్తిని పట్టణ సి.ఐ. ఎ.సుబ్బరాజు అదుపులోకి తీసుకొని స్థానిక ఎజెఎఫ్‌సిఎం కోర్టుకు హాజరు పరచగా ఆ వ్యక్తికి న్యాయమూర్తి బి. అఖిల వెయ్యి రూపాయాలు ఫైన్ విధించినట్లు సి.ఐ. సుబ్బరాజు వెల్లడించారు.

## తల్లి అంగన్వాడీ కార్యకర్త - తండ్రి పాత్రికేయుడు

**- పెద్ద కొడుకు క్రికెట్ ఆటలలో చిచ్చర పిడుగు**

**- కొప్పరం గ్రామానికి చెందిన మొగిలి వీర వెంకట శివ నాగ సిద్దార్థకు అంతరాష్ట్ర క్రికెట్ జట్టులో అవకాశం**







**సంతమాగులూరు ,అక్టోబరు 14 ,ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన మొగిలి సుబ్బారావు వృత్తిరీత్యా పాత్రికేయుడు, తల్లి తిరుమల సంతమాగులూరు మండలంలోనే అతి పేదకుటుంబాలు నివాసముండే కొప్పరం శివారు నెహ్రూనగర్ కాలనీలో అంగన్వాడీ కార్యకర్త వీరికి ఇద్దరు కుమారులు వీరి పెద్ద కుమారుడు వీర వెంకట శివ నాగ సిద్దార్థ ప్రస్తుతం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సీబీఐటీ పాఠశాలలో 7వ తరగతి చదవుతున్నారు.ఇందులో ప్రత్యేకత ఏముందని అనుకుంటున్నారా 7వ తరగతి చదివే 13 ఏళ్ళ వీర వెంకట శివ నాగ సిద్దార్థ ప్రపంచ వ్యాపితంగా క్రీడాభిమానులు అభిమానించే ఆట క్రికెట్ ఆటలో సిచ్చర పిడుగు. వీర వెంకట శివ నాగ సిద్దార్థ కు ఉగ్గుపాల వయసు నుండి క్రికెట్ ఆటపై మక్కువ. చిన్నతనం నుండే భారత క్రికెట్ ఛాంపియన్లు సచిన్ టెండుల్కర్,విరాట్ కోహ్లీ,ఎం.ఎస్ దోనీ, రోహిత్‌శర్మ లాంటి ప్రముఖుల క్రికెట్ ఆటలను కన్నార్పకుండా చూసేవాడు. తన బిడ్డ కు క్రికెట్ పై ఉన్న మక్కువ ను గుర్తించిన తల్లి దండ్రులు మొగిలి సుబ్బారావు, తిరుమల లు శివ నాగ సిద్దార్థను విద్యతోపాటే క్రికెట్ ఆటను కూడా ప్రోత్సహించారు. సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన కరాటే ఛాంపియన్ మరియు క్రికెట్ కోచ్ గంటెనపాటి అఖిల్ అలియాస్ ఇశ్రాయేలు తో క్రికెట్ ఆటలోని మెళుకువలు నేర్పించారు.శివ నాగ సిద్దార్థ కు తల్లిదండ్రుల ప్రోత్సాహం కోచ్ అఖిల్ సంపూర్ణ సహకారం ఉండటంతో ప్రాథమిక పాఠశాల స్థాయినుండే క్రికెట్ పోటీలలో పాల్గొనడం ప్రారంభించాడు. మండల ,జిల్లా స్థాయిల్లో తన ప్రతిభతో అనేక పథకాలు దక్కించుకున్న శివనాగ సిద్దార్థ ప్రస్తుతం ప్రపంచ దేశాల జట్లపై పోటీ పడేందుకు జరిగే అంతరాష్ట్ర క్రీకారుల ఎంపిక కోసం జరిగే పోటీలకు ఎంపికయ్యాడు.

కొప్పరం గ్రామానికి చెందిన మొగిలి వీర వెంకట శివ నాగ సిద్దార్థ సబ్ జూనియర్, సీనియర్స్ ఎలెవన్ క్రికెట్ నేషనల్ చాంపియన్ షిప్ లో తన సత్తా చాటాడు. ఈనెల 11, 12, 13వ తేదీలలో నరసరావుపేటలో కాసు బ్రహ్మానంద రెడ్డి కాలేజీ క్రీడా మైదానంలో జరిగిన పోటీలలో అండర్- 14, జూనియర్,ఏపీ-ఏ టీమ్ లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇచ్చాడు. దీంతో త్వరలో ఇండియా అండర్ 14 తరపున ఆడే అవకాశం వస్తుందని సిద్దార్థ తెలిపారు. ఈ టోర్నమెంట్ లో ఎనిమిది రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా నరసరావుపేట లోని సిబిఐటి పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న వీర వెంకట శివ నాగ సిద్దార్థను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ యోగిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, సిద్దార్థ కోచ్ అఖిల్ ను నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు,సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తేల్లప్రోలు రమేష్, మండల టీడీపీ నాయకులు చేవూరి వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు పుట్టవారిపాలెం పలువురు ప్రజా ప్రర్పంచ్ సన్నెబోయిన గురుబ్రహ్మం, ఐసీడీఎస్ సీడీపీఓ సుధ, సూపవైజర్లు ప్రమీల, సుష్మ , తాహసీల్దార్ రవిబాబు, ఎంపీడీఓ గద్దల జ్యోతిర్మయి, మండల విద్యాశాఖ అధికారి వేమవరపు కోటేశ్వరరావు,సీనియర్ పాత్రికయులు బి.కృష్ణారెడ్డి, సంతమాగులూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కంచర్ల సుబ్బారావు, ఆదర్శ మల్టీమీడియా అసోషియేషన్ అధ్యక్షులు అంగల కుదిటి కోటేశ్వరరావు తదితర పాత్రికేయులు ప్రజా ప్రతినిదులు, అధికారులు అభినందనలు తెలియజేశారు

## భర్త జ్ఞాపకార్థం అంగన్వాడీ కేంద్రానికి మౌళిక వసతుల కల్పన చేసిన నేలపాటి అంజమ్మ



**సంతమాగులూరు, అక్టోబరు 14,ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామానికి చెందిన నేలపాటి అంజమ్మ గారు తన భర్త నేలపాటి లక్ష్మీ ్మనారాయణ జ్ఞాపకార్థం అంగన్వాడీ బీసీ సెంటర్ కార్యాలయానికి మౌళిక వసతులు కల్పించారు. కేంద్రానికి కావలసిన ఫర్నిచర్ ఆఫీస్ టేబుల్1, కుర్చీలు10, టేబుల్ బల్ల 1,5 అరల డిస్ప్లేరాక్ 1విరాళంగా సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సంతమగులూరు ప్రాజెక్ట్ సి డి పి ఒ దీ. సుధ, సూపెర్వైసర్ సుష్మ రాణి, గ్రామ వైస్ ప్రెసిడెంట్ గమిడి వెంకటరావు గారు, అంగన్ వాడి కార్యకర్త శ్రీలక్షి ్మ మరియు తల్లి దండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, అధికారులు తన భర్త జ్ఞాపకార్థం అంగన్వాడీ కేంద్రానికి మౌళిక వసతులు కల్పించిన అంజమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త శ్రీలక్షి ్మ అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకి మంచి సేవలు అందిస్తున్నందుకు సిడిపివో అభినందించారు.

### బేటి బచావో బేటి పడావోను సద్వినియోగం చేసుకోవాలి

కామేపల్లి బీసీ అంగన్వాడి కేంద్రంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలందరినీ బాగా చదివించాలని పదవ తరగతితో వారి చదివి ఆపేయకుండా, ఉన్నత చదువులు చదివించాలని, ప్రభుత్వం బాలికల కోసము పలు సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్నాయని వాటిని సద్వినియోగ పరచుకోవాలని ఈ సందర్భంగా సిడిపిఒ తెలిపారు. బాలిక విద్య వలన దేశ భవిష్యత్తు బంగారు భవితమవుతుందని అన్నారు. ఆడపిల్లలు పుట్టిన తల్లిదండ్రులు ఆడపిల్ల పేరున సుకన్య సమృద్ధి యోజన పథకం కింద వారికి సమీపంలో ఉన్న బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ నందు ఖాతాను ప్రారంభించి సంవత్సరానికి ఒక లక్ష యాభై వేల రూపాయల వరకు జమ చేయవచ్చని, ఈ పొదుపు చేసిన సొమ్మును బాలిక 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఉన్నత విద్య కోసం కానీ, పెళ్లి కోసం కానీ తీసుకోవచ్చని అదేవిధంగా సుకన్య సమృద్ధి యోజనాలో వడ్డీ శాతం ఎక్కువగా ఉంటుందని తెలియజేశారు. బాలికలకు మంచి పౌష్టికాహారాన్ని అలాగే సమతుల్య ఆహారాన్ని అందించవలసిన బాధ్యత తల్లికి ఉంటుందని లేనిచో వారికి పోషణలోపం, రక్తహీనత లాంటి పలు సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలియజేశారు.

## నేడు ప్రేమ్ ఐ కేర్‌లో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

**అద్దంకి అక్టోబరు 14 ప్రభాతవార్త**

స్థానిక బంగ్లారోడ్డులోని ప్రేమ్ ఐ కేర్ నందు మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత మెగా కంటివైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అద్దంకి పట్టణంతోపాటు పరిసరగ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరంలో పాల్గొన్ని పరీక్షలు చేయించుకోవచ్చునని పేర్కొన్నారు.బుధవారం ఉదయం 10గంటలనుండి సాయంత్రం 6గంటల వరకు ఈ వైద్యశిబిరం బంగ్లారోడ్డులోని భాష్యం స్కూల్ ఎదురుగా వున్న ప్రేమ్ ఐ కేర్‌లో నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## హనుమాపురంలో వైద్యశిబిరం



**అద్దంకి అక్టోబరు 14, ప్రభాతవార్త**

ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా హెచ్ఐవి నియంత్రణ సమీకృత హ్యూహం దిశ, హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ టిఐ ఆధ్వర్యంలో హనుమాపురం గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బివిసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన, ఈ శిబిరంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ ఎం. సీతారామయ్య పాల్గొన్ని హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్టు నిర్వహిస్తున్న వైద్యశిబిరాలు, హెచ్ఐవి బాధితులను ఆదుకునేందుకు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఎ.మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీతో ప్రజలకు మేలు



**తాళ్లూరు,అక్టోబరు 14,ప్రభాతవార్త**

సూపర్ జీఎస్టీతో అన్ని రకాల నిత్యావసర, ఇతర సరుకుల ధరలు తగ్గి ప్రజలకు మేలు చేకూరిందని కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల వ్యాపారస్తులు, ఆదికారులకు జీఎస్టీ2.0,సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపీడీవో పి.అజిత అధ్యక్షత వహించారు.ఈసందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్టీ తగ్గింపుతో ఆటోమొబైల్స్, ఎల క్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువులపై ధరలు తగ్గాయన్నారు.ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీ తగ్గించినట్లు తెలిపారు. వ్యాపారస్తులు తగ్గిన జీఎస్టీ ప్రకారం కాకుండా అధికంగా వసూళ్లు చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు.కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి,సర్పంచు లు పోశం సుమలత శ్రీకాంత్ రెడ్డి,షేక్ వలి, కొర్ర పాటి శ్రీదేవి, రామయ్య, మన్నే పల్లి సొసైటీ అధ్యక్షులు గొంది రమణారెడ్డి (సమర), నాయకులు గొల్ల పూడి వేణు బాబు, రాచకొండ వెంకట్రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు .

## జీఎస్టీ 2.0 ద్వారా తగ్గిన ఇంటి నిర్మాణ ఖర్చులు



**పొన్నలూరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త**

జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలకు ఇంటి నిర్మాణ ఖర్చులు తగ్గుతున్నాయని,సొంతింటి కల నెర వేరుతుందని ఎంపిడివో పి. సుజాత అన్నారు. సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరలు తగ్గించిన తర్వాత ప్రజలకు సిమెంట్, బ్రిక్స్,టింబర్ మరియు ఇతర సామాగ్రిపై మరింత డబ్బు ఆదా అవుతుందని తద్వారా కొనుగోలు శక్తి పెరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏ.ఓ వెంకటేశ్వర్లు, ఏ.ఇ.పి.ఆర్.కోటేశ్వరరావు,డిప్యూటీ యం.పి.డి.ఓ శ్రీకాంత్ ,హౌసింగ్ సూపర్‌వైజర్ సుధీర్, పొన్నలూరు నీటి సంఘం అధ్యక్షులు మండవ ప్రసాద్, పల్లపోతు రమేష్,పొన్నలూరు పంచాయతీ కార్యదర్శి నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చయ్య సతీమణికి నివాళులర్పించిన మంత్రి స్వామి



**పొన్నలూరు,అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మండలంలోని రావులకొల్లు మాజీ ఎంపిటిసి పిచ్చయ్య సతీమణి మాధవి మృతి చెందగా విషయం తెలుసుకున్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి రావులకొల్లు లోని పిచ్చయ్య నివాసానికి వెళ్లి మాధవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.ఈకార్యక్రమంలో మాజీఎంపిపి కొండ్రగుంట శ్రీనివాసరావు, పొన్నలూరు నీటి సంఘం అధ్యక్షులు మండవ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన వర ప్రసాదరెడ్డికి సత్కారం



**బల్లికురవ, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

మండలంలోని గొర్రెపాడు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొంది నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లనున్న సీహెచ్ వరప్రసాద్‌రెడ్డిని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుసుమకుమారి మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందుతూ, బాధ్యతలను గుర్తించి మరింత బాధ్యతాయుతంగా పని చేసిన ప్రసాదరెడ్డి నేటితరం ఉద్యోగులకు ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ మాధవ్, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు మీరావలి, బాజీ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## విశాఖలో టెక్ విప్లవానికి నాంది

**- రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయం - ఏపీ భవిష్యత్ దిశను మార్చే చారిత్రాత్మక పరిణామం**

**- గూగుల్ రాకతో ఏపీలో ఐటీ రంగం విస్తరించబోతుంది - రూ.15 బిలియన్ డార్ల పెట్టుబడితో గూగుల్**

**- డేటా సెంటర్లో 1.88 లక్షల మందికి ఉపాధి - సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి ఫలితమే**

**- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**మార్టూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇది ఒక కొత్త యుగం ఆరంభమని, విశాఖకు గూగుల్ రావడం ఏపీలో గేమ్ ఛేంజర్ కాబోతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి ఒక ప్రకటన విడుదల చేశారు. గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం ప్రారంభమవుతోందన్నారు. కేవలం ఒక పెట్టుబడి కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ దిశను మార్చే చారిత్రాత్మక పరిణామం అని అన్నారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ వచ్చిన తర్వాత అక్కడికి అనేక ఐటీ కంపెనీలు క్యూ కట్టాయని, ఐటీ కంపెనీల రాకతో హైదరాబాద్ స్వరూపమే మారిపోయిందన్నారు. గూగుల్ రాకతో ఏపీలో ఐటీ రంగం విస్తరించబోతోందని పేర్కొన్నారు. రూ.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ విశాఖలో సౌత్ ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌ను నిర్మించబోతోందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో 1.88 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయమని ఏపీ భవిష్యత్ దిశను మార్చే చారిత్రాత్మక ఒప్పందం అన్నారు.

**సీఎం చంద్రబాబు కృషి ఫలితమే :**

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్‌ను తీసుకువచ్చి నగరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు అదే దిశగా విశాఖను ఏఐ, డిజిటల్ టెక్ సిటీగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో సమావేశమై పెట్టుబడులు తెచ్చి, యువతకు ఉద్యోగ అవకాశాలు సృష్టించే దిశగా సీఎం చేస్తున్న కృషి ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు. సౌత్ ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్ ఏలూరి సాంబశివరావు తెలిపారు. రూ.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ విశాఖలో సౌత్ ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌ను నిర్మించబోతోందని తెలిపారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విశాఖ ఇప్పుడు సిటీ ఆఫ్ డెస్టినీ నుంచి సిటీ ఆఫన డిజిటల్ ఫ్యూచర్‌గా మారబోతోందని అన్నారు.

**పెట్టుబడులకు అనుకూల వాతావరణం :**

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 26 ఆధునిక పరిశ్రమల పాలసీలు వేగవంతమైన సింగిల్ విండో క్లియరెన్స్, పవర్ సప్లై, భూముల కేటాయింపు వంటి అంశాలు పెట్టుబడి దారులను ఆకర్షిస్తున్నాయని ఎమ్మెల్యే వివరించారు. గత ఐదేళ్ల కంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 16 నెలల్లోనే రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం, 9.5 లక్షల ఉద్యోగావకాశాలు సృష్టించబడటం రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనం అని అన్నారు.

**యువతకు గ్లోబల్ అవకాశాలు :**

గూగుల్ రాకతో రాష్ట్ర యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు అందనున్నాయి. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు, నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుండి పాఠ్యాంశాల్లో ఏఐ పాఠాలను చేర్చడం, నైపుణ్య శిక్షణ కేంద్రాలను విస్తరించడం ఇవన్నీ రాష్ట్రాన్ని టెక్ హబ్‌గా నిలబెట్టనున్నాయని తెలిపారు.

**రాష్ట్ర అభివృద్ధిని ఎవరు ఆపలేరు :**

పెట్టుబడిదారులను అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నించినా రాష్ట్ర అభివృద్ధిని ఎవ్వరు అడ్డుకోలేరు అని హెచ్చరించారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ వచ్చినప్పుడు ఐటీ రంగానికి గేమ్ చేంజర్ అయినట్టే ఇప్పుడు గూగుల్ విశాఖకు రావడం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ అభివృద్ధికి గేమ్ చేంజర్ అవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు.

## పవన్ గోపికృష్ణకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు



**మార్టూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

జీఎస్టీ సేవింగ్ అంశంపై అత్యుత్తమ ప్రతిభ కనపరిచి, ప్రధాని నరేంద్రమోడీతో ముఖాముఖికి అరుదైన అవకాశం పొందిన బొల్లాపల్లి విద్యార్థి చాతారాజుపల్లి పవన్ గోపికృష్ణను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు. బొల్లాపల్లికి చెందిన పవన్ గోపికృష్ణ పంగులూరు మండలం కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతిలోనే అద్భుత ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. జీఎస్టీ సేవింగ్స్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో రాష్ట్ర స్థాయిలో కావడం పర్చూరు నియోజకవర్గానికి గర్వకారణం అన్నారు. ఈనెల 16న గోపికృష్ణ శ్రీశైలంలో ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం రావడం అద్భుత ప్రతిభకు నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరినిన విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి కూచిన షారోన్ రాజు మృతదేహాన్ని గుర్తించడం జరిగింది

**- ఇటువంటి విషాధకర ఘటనలు పునరావృతం కాకుండా వాడరేవు తీరంలో భద్రతా చర్యలు మరింత పటిష్టం చేస్తాం**

**- సముద్ర తీరాలకు వచ్చే యాత్రికులు పోలీసు శాఖ హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలి**

**- సముద్ర తీరంలో ఈతకొట్టడం నిషేధం, కేవలం స్నానాలు మాత్రమే ఆచరించాలి**

**- మద్యం సేవించి సముద్రంలోకి దిగరాదు - అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**

**- జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్**



**చీరాల, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

కూచిన్ షారోన్ రాజు మృతదేహాన్ని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామ పరిధిలోని సముద్ర తీరంలో మంగళవారం మధ్యాహ్నం పోలీసు అధికారులు గుర్తించారని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. చీరాల ప్రభుత్వ వైద్యశాలలో శవ పంచనామఅనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సముద్ర తీరాలకు విహార యాత్రకు వచ్చే యాత్రికులు పోలీసు శాఖ సూచనలు , హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సూచించిన ప్రదేశాలలోనే సముద్రంలో స్నానాలు ఆచరించాలని తెలిపారు. సముద్ర తీరంలో ఈతలు వేయడం, మద్యం సేవించి సముద్రంలోకి దిగడం ప్రమాదకరం కనుక వాటిని నిషేధించడం జరిగిందన్నారు. మైకుల్లో పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూ ఉంటారని కానీ కొందరు యువకులు వారి హెచ్చరికలను పెడచెవిన పెట్టి సముద్రంలో సరదాగా ఆడుకుంటూ లోతుకు వెళ్తుంటారన్నారు. అటువంటి సమయంలో రాకాసి అలలు వచ్చినప్పుడు యువకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సముద్ర తీరంలో పోలీసు, మెరైన్, గజ ఈతగాళ్లతో పాటు డ్రోన్లతో నిఘాలు ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నప్పటికి ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. పోలీసు శాఖ ఆదేశాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సూచించిన ప్రదేశాలలో నిర్దిష్ట లోతులో సముద్రంలో స్నానాలు ఆచరిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు లోనుకాకుండా సురక్షితంగా ఆహ్లాదకరంగా సముద్ర తీరంలో గడుపుతూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. గత ఆదివారం జరిగిన విషాధ ఘటన మరెప్పుడూ చోటు చేసుకోకుండా ఉండేందుకు భద్రతాపరమైన చర్యలు మరింత పటిష్టం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ సూచనలు, హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సముద్ర తీరాలలో ఈతలు వేయడం, మద్యం సేవించి సముద్రంలో దిగే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు శాఖ హచ్చరికలను పెడ చెవిన పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే ఉపేక్షించమని ఎస్పీ హెచ్చరించారు. గల్లంతైన యువకుల ఆచూకీ గుర్తించేందుకు సుమారు 2 రోజుల పాటు నిర్విరామంగా కృషి చేసిన పోలీసు, ఫైర్, మెరైన్ రెవెన్యూ ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన వేటపాలెం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీప్రియ



**వేటపాలెం, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ఈ నెల 6వ తేదీన ఒంగోలులో నిర్వహించారు. ఈ పోటీలలో వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని యార్లగడ్డ లక్ష్మీ ప్రియ 52 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయులు దేవరకొండ సరోజిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకొనడం వలన ఆత్మరక్షణ, శారీరక దారుఢ్యం మానసిక ఉల్లాసంతో పాటు, ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా రాష్ట్ర, జాతీయ సర్టిఫికేట్లు ఉపయోగపడతాయని అన్నారు. పీఈటీలు జడ దేవభిక్షం, జరుబుల శ్రావణి, స్టాఫ్ సెక్రటరీ కాల్వ సోమశేఖర్, ఉమ్మిటి వేణుగోపాలరావు, అత్తులూరి వెంకట సుబ్బారావు, అవ్వారు సుజాత, సజ్జా వసుధ కుమారి, ఎల్.అంజమ్మ, టి.గురుమని, డీఎల్ లక్ష్మీనారాయణ, బీవీ కృష్ణమూర్తి, ఎం.బ్రహ్మానందరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు లక్ష్మీప్రియకు అభినందనలు తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి



**వేటపాలెం, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

వేటపాలెం మండలంలో దేశాయిపేట పంచాయతీలోని అయోధ్యనగర్ నందు పేకాట స్థావరంపై వేటపాలెం పీఎస్ఐ కే.జగజ్జీవన్‌రావు , సిబ్బంది మెరుపు దాడి చేశారు.ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4500ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పీఎస్ఐ వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఎంఆర్సీ భవనానికి నిధులు మంజూరు

**- స్థల సేకరణలో అధికారులు**






**నాగులుప్పలపాడు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మండలంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం దాతలు పాఠశాల కోసం అందించిన స్థలంలో అప్పట్లో ఎంఆర్సీ భవనం నిర్మించారు. శిధిలావస్థకు చేరిన భవనాన్ని తిరిగి అధునాతన సౌకర్యాలతో నిర్మించేందుకు ప్రభుత్వం కోటిరూపాయలు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఎమ్మార్సీ భవన్ ఉన్న స్థలంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నత పాఠశాల కలవు. ఈ కూటమిలోని ఎంఆర్సీ భవనం శిధిలావస్థలో ఉంది. చదువులకే పరిమితమైన విద్యార్థులు ఆట స్థలం లేక కనీసం ప్రార్ధన స్థలం లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మార్సీ భవనాన్ని అధునాతన సౌకర్యాలతో నిర్మించేందుకు మండల స్థాయి కార్యాలయాలు ఉన్న చోట నిర్మించాలని అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. దాదాపు 20 సెంట్లు స్థలం అవసరం. మండలంలో 80 పాఠశాలలు కలవు. టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది 250 మంది కి పైగా ఉన్నారు. విద్యార్థుల సంఖ్య 6 వేలకు పైగా ఉండటంతో వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**మండల కాంప్లెక్స్ వైపే అధికారులు చూపు :**

నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వ్యవసాయ అధికారి కార్యాలయం ఇందిరా క్రాంతి పథకం గిడ్డంగులు సబ్ స్టేషన్ విద్యుత్‌తో పాటు జగనన్న కాలనీ ఇప్పటికే కాంప్లెక్స్‌గా ఏర్పాటు అయింది. ప్రభుత్వ భూమి విశాలంగా ఉండటంతో అవసరమైన మండల విద్యాశాఖాధికారి భవనానికి స్థలం ఇచ్చేందుకు జిల్లా అధికారులు రంగం సిద్దం చేస్తున్నట్లు తెలుస్తుంది.

## ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య



**వెలిగండ్ల, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గండ్లోపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.ఎస్సై కృష్ణపావని తెలిపిన వివరాల మేరకు మండలంలోని గండ్లోపల్లి గ్రామానికి చెందిన తోకల కౌసల్య మంగళవారం సాయంత్రం సమయంలో తన పుట్టింటి వద్ద ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణపావని తెలిపారు.

7_7.qxd 10/15/2025 12:41 AM Page 1



## హాజీపురంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన గాయం తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని హాజీపురం గ్రామంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గాయం సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల క్లస్టర్ కన్వీనర్ గాయం తిరుపతిరెడ్డి పాల్గొని లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రేషన్ లబ్దిదారులకు ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని రేషన్ డీలర్లు లబ్దిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాయం సుబ్బారెడ్డి, గాయం రామిరెడ్డి, సర్పంచ్ రామసుబ్బమ్మ, గ్రామ వీఆర్వో ఝాన్సీ, ఇర్మియా, ఖాశిం, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో అవకతవకలకు చెక్

### - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, అక్టోబ్ 14, (ప్రభాతవార్త**

క్యూ ఆర్ కోడ్‌తో కూడిన నూతన స్మార్ట్ కార్డుల పంపిణీతో బోగస్ రేషన్ కార్డులు, ప్రజా పంపిణీలో అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని టీడీపీ మండలఅధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని హనుమంతాపురం పంచాయతీ నారాయపల్లిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తండ్రి ముక్కు నరసారెడ్డి టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డిలు పాల్గొని వారి చేతుల మీదుగా లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, ఈ స్మార్ట్ రేషన్ కాడ్డులు ప్రజలకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా నాణ్యమైన నిత్యవసర వస్తువులు అందించడానికి ఉపయోగపడతాయని అదే విధంగా ఆధునిక సాంకేతిక వినియోగంతో అవినీతి, మధ్య వర్తిత్వం తగ్గిపోతుందని ప్రతి అర్హులైన కుటుంబానికి నేరుగా ప్రయోజనం చేరేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలియజేశారు. రేషన్ డీలర్లు లబ్దిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నాగురి కోటయ్య, శెట్టి దేవసహాయం, నల్లబోతుల వెంకట కొండయ్య, వద్దిపాటి లక్ష్మయ్య, బెల్లంకొండ రంగనాయకులు, సర్పంచ్ కూడలి అరుణ-దసరాథ, కూటగుండ్ల గ్రామ పార్టీ అధ్యక్షులు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## దర్శిలో జరిగే సీఐటీయు మహాసభలకు తరలిరండి

### - కురిచేడులో కార్మికులతో ప్రచారం చేస్తున్న నాయకులు



**కురిచేడు, అక్టోబర్ 13, (ప్రభాతవార్త**

దర్శిలో జరిగే సీఐటీయు ప్రకాశం జిల్లా 13వ మహాసభలకు కార్మికులంతా తరలిరావాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య అన్నారు. కురిచేడు పంచాయతీ కార్మికులలో మహాసభల కరపత్రం ప్రచారం చేసి మాట్లాడుతూ నవంబర్ 7నుంచి 9వ వరకు సీఐటీయు మహాసభలు దర్శిలో జరుగుతున్నాయన్నారు. సీఐటీయు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, నెల నెల ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కార్మిక, ఉద్యోగుల పక్షాన పోరాడుతుందని సీఐటీయు మహాసభలకు దర్శి నియోజకవర్గంలోని ప్రజలంతా సహకరించి జయప్రదం చేయాలని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తుందని, పని గంటలు పెంచుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విదానాలపై ఈ మహాసభలలో చర్చించి ఆందోళన, పోరాటాలను నిర్ణయిస్తామని తెలిపారు. ఈ ప్రచారంలో పంచాయతీ యూనియన్ నాయకులు కమ్మిలి అశోక్ కుమార్, బెంజిమన్, నాసరయ్య, సాల్మన్, లక్ష్మయ్య, పిచ్చమ్మ, ఏసమ్మ, గంటె కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీశైలం పర్యటన నేపధ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

### - పెద్దదోర్నాలలో వాహనాలు నిలిపివేత



**పెద్దదోర్నాల, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 16న మహాపుణ్యక్షేత్రం శ్రీశైల పర్యటన నేపధ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టింది శ్రీశైలం వెళ్లే వాహనాలను 16వ తేదీ గురువారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు దోర్నాలలో మళ్లించనున్నట్లు నగర్ వద్ద నిలిపివేయనున్నట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. ఈ మేరకు పెద్దదోర్నాల పోలీసు స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16వ తేదీ ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు అన్ని రకాల వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా కర్నూలు వైపు వెళ్లే వాహనాలను కూడా పెద్దారవీడు మండలం కుంట వద్ద నుండి గిద్దలూరు వైపుకు దారి మళ్లించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన సమయంలో రహదారి వెంట భారీగా భద్రత దళాలు మోహరించనున్నాయి. ప్రజలు, భక్తులు, ప్రయాణికులు ఈ మార్పుల గుర్తించి ముందుగా తెలుసుకొని, తగిన ప్రణాళికలతో ప్రయాణాలు చేసుకోవాలని డీఎస్పీ యు.నాగరాజు కోరారు. ఘాట్ రోడ్లో ప్రయాణించు వాహనాలకు ఫిట్నెస్, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఫిట్నెస్, లైసెన్స్ లేని వాహనాలను తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీశైలం వెళ్లే వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అటువంటి వాహనాలను తనిఖీ చేసి దోర్నాలలోనే నిలిపివేస్తామన్నారు. కావున భక్తులు వాహనదారులు అటవీశాఖ, పోలీసు శాఖ హెచ్చరిక ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ప్రధాని పర్యటనతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు అందరూ సహకరించాలని డీఎస్పీ నాగరాజు కోరారు. ఈ సమావేశంలో యర్రగొండపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రభాకరరావు, దోర్నాల ఎస్సై వి.మహేష్ పాల్గొన్నారు.

## నూతన స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ



**సంతనూతలపాడు, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

సంతనూతలపాడు ఒకటవ సచివాలయంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో రేషన్ షాపు నెంబర్లు 3,4,5లకు సంబంధించి 944 మంది లబ్ధిదారులకు సంబంధించి క్యూఆర్ కోడ్ ఆధారిత నూతన స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను మాజీ జడ్పీటీసీ, టీడీపీ నేత తన్నీరు శ్రీనివాసరావు, సంతనూతలపాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేవి శ్రీలత, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎస్.మాధవిలత, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్దన్, వీఆర్వో పి.వెంకట స్వామిలు పంపిణీ చేశారు. షాపు నెంబర్ మూడుకు సంబంధించి 375 రైస్ కార్డులను, నాలుగో దుకాణానికి సంబంధించి 282 కార్డులను, ఐదో నెంబర్ దుకాణానికి సంబంధించి 287 రైస్ రేషన్ కార్డులను ప్రభుత్వం కేటాయించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తన్నీరు భువన్న శ్రీను, మద్దిరాల సుబ్బారావు, మట్టా పోలిశెట్టి పావులూరి నారాయణస్వామి చౌదరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రుద్రవరంలో నూతన రైస్ కార్డులు పంపిణీ చేసిన సొసైటీ చైర్మన్ విజయమ్మ



**సంతనూతలపాడు, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో నూతన స్మార్ట్ రైస్‌రేషన్ కార్డులను సంతనూతలపాడు సిండికేట్ రైతు సొసైటీ చైర్మన్ కుకట్ల విజయమ్మ, రుద్రవరం గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు కుకట్ల శరత్‌బాబులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఎం.శ్రీనివాసులు, జిల్లా తెలుగు యువత కార్యవర్గ సభ్యులు సిరిగిరి హరినాథ్, టీడీపీ నాయకులు మన్నం సుబ్బారావు, గ్రామస్తులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## ఆత్మ నిర్భర్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



**గిద్దలూరు, అక్టోబరు 14,(ప్రభాతవార్త**

భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో జరిగిన ప్రతి ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ (ఆత్మ నిర్భర్ భారత్) కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంఎల్‌సి సొమ్ము వీర్రాజు, ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమ జిల్లా ఇన్చార్జి అశోక్ రాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ స్వదేశీ తయారీ వస్తువులను ప్రజలు కొనుగోలు చేసి ఆర్థిక వ్యవస్థ పటిష్ట పరిచే విధంగా ప్రతి బీజేపీ నాయకులు కార్యకర్తలు గ్రామాలలో ప్రజలకు సమావేశాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించి కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె వి నారాయణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, మాజీ జిల్లా ఎస్‌సి మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టే మల్ల పుల్లయ్య, కొమరోలు మండల అధ్యక్షులు కె వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేవలపై నిఘా, భూములపై దర్యాప్తు





**మార్కాపురం రూరల్, అక్టోబరు 14 ,(ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలో ప్రభుత్వ సేవల అమలు పర్యవేక్షనకు సంబంధించి అధికారులు అలర్ట్‌గా ఉన్నారు. ఈ క్రమంలో తహశీల్దార్ చిరంజీవిచర్యలు తీసుకుంటూ ప్రజాసేవలో సమర్థత పెంచేదిశగా పావులు కదుపుతున్నారు. బాపూజికాలనీ పరిధిలో ఉన్న తొమ్మిదో వార్డు సచివాలయాన్ని తహశీల్దార్ చిరంజీవి అకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు రికార్డులను పరిశీలించిన ఆయన విధి నిర్వహణలో సమర్థత కోసం అవసరమైన సూచనలు చేశారు. ముఖ్యంగా స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇక మరోవైపు మార్కాపురం మండలం ఇడుపూర్ గ్రామంలో అసైన్మెంట్ భూముల వివాదంపై తహశీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. తాళ్లపల్లి వెంకట సుబ్బారావు, రాచకొండ యలమందయ్యల ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత భూములను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి, స్థలస్థితిగతులను అధ్యయనం చేశారు.విచారణ నివేదికను రెవెన్యూ కోర్టుకు సమర్పించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. అధికారుల ఈ చర్యలు ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు సేవల మెరుగుదలకై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## హిందువుల సొమ్ముతో దేవాలయాలు నిర్మించడమే అయితే తప్పేంటి

### - బిజెపి నాయకులు పి వి కృష్ణారావు



**మార్కాపురం రూరల్, అక్టోబరు 14, (ప్రభాతవార్త**

హిందూ దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) నిధులను వినియోగించే విషయంపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మార్కాపురంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు విలేకరుల సమావేశం నిర్వహించి ఈ వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "హిందువుల సొమ్ముతో హిందూ దేవాలయాలు నిర్మిస్తే షర్మిలమ్మకు ఏమిటి నష్టమని ప్రశ్నించారు. టిటిడి ఆధ్వర్యంలో దళితవాడలలో దేవాలయాల నిర్మాణం చేస్తామంటే అందుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం సబబు కాదని విమర్శించారు. ఇతర మతాల ఆదాయాలను పక్కన పెట్టి కేవలం హిందు దేవాలయాల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకొని విమర్శించడం వెనుక కాంగ్రెస్ పార్టీ అసలు ఉద్దేశ్యం ఏమిటో ప్రజలకు అర్థమవుతుందని తెలిపారు. పీవీ కృష్ణారావు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న మానవతా భావన ఉంటే షర్మిల స్వయంగా తన సొమ్ముతో సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కోటపాటి శ్రీకాంత్, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు ఏ సుబ్బారావు, మైనార్టీ మోర్చా నాయకులు బాషా, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువకుల మృతి పట్ల ఎమ్మెల్యే కందుల పరామర్శ





**మార్కాపురం రూరల్, అక్టోబరు 14, (ప్రభాతవార్త**

మార్కాపురం మండలానికి చెందిన యువకులు గణేష్ (20), అబినాష్ (22) సోమవారం రాత్రి కొనకనమిట్ల మండలంలోని ఎదురాళ్లపాడు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలు ప్రస్తుతం పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచబడ్డాయి. ఈ నేపథ్యంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారితో కలిసి తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు కూడా బాధిత కుటుంబాలను ఓదార్చారు.

## ఈతకు వెళ్ళి సగిలేరు వాగులో యువకుడు మృతి





**గిద్దలూరు రూరల్, అక్టోబరు 14, (ప్రభాతవార్త**

గిద్దలూరు మండలంలోని కొండపేట గ్రామ సమీపంలోని సగిలేరు వాగులో ఈతకు వెళ్ళి యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు గిద్దలూరు పట్టణంలోని రామాలయం వీధికి చెందిన సయ్యద్ రసూల్ కుమారుడు సయ్యద్ ఆసిఫ్ (22) ఈతకు వెళ్ళి నీటిలో మునిగి మృతిచెందాడు. అంతకు ముందు వాగులో గల్లంతయిన యువకుడిని స్థానికులు, అధికారులు కలిసి వాగు నుంచి వెలికి తీశారు. యువకుడు స్వల్పంగా ప్రాణం ఉన్నట్లు మెదలడంతో బ్రతికి ఉండే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సిపిఆర్ చేసిన వైద్యులు అప్పటికే యువకుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. యువకుడు మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడు సయ్యద్ ఆసిఫ్ అటవీ శాఖలో జీప్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది.

## విద్యార్థినీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**రాచర్ల, అక్టోబర్ 14,(ప్రభాతవార్త**

విద్యార్థినీలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ఐసిడిఎస్ సిడిపిఓ మహిత అన్నారు. రాచర్ల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆమె బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, బాల కార్మిక నిరోధక చట్టాలపై, సైబర్ నేరాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పలుగుంటిపల్లి అంగన్వాడి కేంద్రంలో పిల్లల తల్లులతో మమేకమై పిల్లల విద్యాభివృద్ధి, మానసిక ఎదుగుదల తదితర అంశాలపై మాట్లాడారు. కిషోర్ బాలికల అంగన్వాడి చిన్నారుల విషయంలో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, రాచర్ల అంగన్వాడి సూపర్వైజర్ వసంతకుమారి, ఏఎస్ఐ వై శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్, తాగునీటిని పరిశీలించిన డీపీఓ వెంకటేశ్వరరావు



**సంతనూతలపాడు, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సంతనూతలపాడులో మంగళవారం నాడు శానిటేషన్, ఓహెచ్ఎస్ఆర్ తాగునీటి ట్యాంకు, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం, గార్బేజ్ కలెక్షన్, స్వామిత్వ సర్వే లను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. వాటర్ ట్యాంక్ వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా వాటర్ టెస్టింగ్ చేయించారు.15 రోజులకు ఒక సారి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును క్లీన్ చేయాలని డీపీవో వెంకటేశ్వరరావు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్ కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు ట్యాంక్ పరిసరాలు పరిశుభ్రం చేయించాలన్నారు. ఇంటింటా ఆయన సందర్శించి గార్బేజ్ కలెక్షన్‌ను పరిశీలించి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని డీపీవో సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో వర్మీ కంపోస్టును డీపీవో వెంకటేశ్వరరావు పరిశీలించి కంపోస్టు అమ్మకాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో పి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రావు,పంచాయతీ కార్యదర్శిఎన్.ప్రతాప్‌కుమార్, డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ చక్రధర్, నియోజకవర్గ రిసోర్స్ పర్సన్ జయశంకర్,గ్రామపంచాయతీ ప్రతినిధులు బాబురావు,శిఖామణి, పంచాయతీ శానిటేషన్ సిబ్బంది, క్లాప్ మిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

## ఛీ పాడు పార్కును పాడు చేశారు

### - పార్కు పాడుతో అల్లాడి పోతున్నా ప్రకృతి ప్రేమికులు

### - మండల కార్యాలయం ఆవరణలో ఉన్న పార్కు తొలగింపుపై పలు విమర్శలు



**యర్రగొండపాలెం, అక్టోబరు 14, (ప్రభాతవార్త**

యర్రగొండపాలెం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.5లక్షల వ్యయంతో ఉపాధి హామీ నిధులతో అర ఎకరా స్థలంలో ఏర్పాటు చేసిన పార్కును నేడు అధికారులు అర్ధాంతరంగ తొలగించడం చూస్తుంటే పట్టణంలో పలురకాల విమర్శలు వినిపిస్తున్నాయి. ,నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెం పట్టణంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్కును పూర్తిగా తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యలయాలను నిర్మించేందుకు ప్రయత్నాలు చెసిన విషయం తెలిసిందే.ప్రస్తుతం యంపిడివో కార్యాలయ ఆవరణలో ఉన్న పార్కును ద్వంసం చేసి మరో కట్టడం నిర్మించాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పాలకులు తమ ప్రభుత్వం అధికారంలో ఉంటే చాలు ప్రభుత్వ స్థలాలను తమ తమ అన్యులకు, ఉద్యోగ సంఘాలకు పంచిపెట్టడం యర్రగొండపాలెంలో అనవాయితీగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతవైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగిన ఆదిమూలపు సురేష్ కోట్ల విలువ చేసే స్థలాలను ఉద్యోగ సంఘాలకు పప్పు బెల్లాలుగా పంచిపెట్టిన విషయం మరవక ముందే, ప్రస్తుత ప్రభుత్వంలో నేటీ పాలకులు ఇక్కడి పార్కును తొలగించి ఆస్థానంలో మరో కట్టడాలు కట్టడానికి పార్కును పాడు చేయడం మంచి పరిణామం కాదని పలువురు విమర్శలకు దిగుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన భవనాలు అవసరమే, అయితే వాటిని నిర్మించే స్థలాలు ఇవికావు అని పలువురు ఆరోపిస్తున్నారు.

**బాలికల వసతి గృహం నిర్మాణం కోసమే పార్కు తొలగించారనే చర్చ :**



ఇక్కడ బాలికల వసతి గృహం నిర్మాణం కోసమే పచ్చని పార్కును తొలగించారనే చర్చ కొనసాగుతుంది. బాలికల వసతిగృహం నిర్మాణం కోసమే ఈ పార్కు తొలగించాలనుకుంటే బాలికల వసతి గృహనికి ఈ స్థలం అంత నెలవైన బాలికల భద్రతతో కూడినది కాదేమో అనే సందేహం పలువురు వ్యక్తం చెస్తున్నారు. నియోజక వర్గ కేంద్రమైన యర్రగొండ పాలెంలో నియోజకవర్గానికి ఉండవలసిన శాఖపరమైన ప్రభుత్వ కార్యాలయాలు లేవనే విషయం తెలిసిందే. యర్రగొండపాలెం నియోజకవర్గంగా ఎర్పడిన నాటినుంచి నియోజక వర్గంలో కాంగ్రెస్ ఆ తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన వ్యక్తులే విజయం సాధిస్తూ వస్తున్నారు. నియోజవర్గం ఏర్పడి 20సంవత్సరాలు గడుస్తున్నా ఒక్కసారి కూడ తెలుగుదేశం పార్టీ గెలిచిన దాఖాలాలు లేవు. అయితే నియోకవర్గం కేంద్రంలో అభివృద్ధి మాత్రం తెలుగుదేశం ప్రభుత్వ హయంలో జరిగింది అనేది మాత్రం వాస్తవం. రాజకీయంగా ఇది వైసీపీ గడ్డ, వైసీపీకి అడ్డ అని చెప్పుకోవడం తప్ప ఆపార్టీలో గెలిచిన నాయకులు నియోజక వర్గ అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవు అనే విమర్శ ఉంది. 1924 ఎన్నికలలో మళ్ళీ వైసీపీ గెలిచినప్పటికి అధికారం మాత్రం తెలుగుదేశంపార్టీ చెతిలోకి పోవాడంతో ఓడిన అభ్యర్ది నియోజక వర్గ ఇంచార్జిగా నియోజక వర్గ పరిధిలో చక్రం తిప్పుతుండటంతో వైసీపీలో గెలిచిన అభ్యర్దికి పవర్ లేకపోవడం విచిత్రంగా గోచరించే పరిస్దితి ఇక్కడ నెలకొని ఉంది.

## కార్మిక నేత అమీరుల్లా ఖాన్‌కు ఘననివాళి



**మార్కాపురం రూరల్, అక్టోబరు 14, (ప్రభాతవార్త**

గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా, ప్రస్తుతం మున్సిపల్ కోఆప్షన్ సభ్యునిగా, అలాగే మోటార్ వర్కర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) అధ్యక్షునిగా సేవలందించిన కార్మిక నేత పఠాన్ అమీరుల్లా ఖాన్‌కు మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో నిర్వహించిన సంతాప సభకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాశిం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం మాట్లాడుతూ అమీరుల్లా ఖాన్ అవినీతి మరకలేని రాజకీయ జీవితాన్ని గడిపారని, ప్రజల మధ్య జీవిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. మోటార్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అందె నాసరయ్య మాట్లాడుతూ ఖాన్ జీవితాంతం కార్మికుల హక్కుల కోసం పోరాడిన నేతగా గుర్తించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం శ్రమించారని చెప్పారు.సభను ఉద్దేశించి ఎస్‌కె ఖాసిం మాట్లాడుతూ ఖాన్ లేకపోవడంలోటే అయినా ఆయన ఆశయాల సాధన కోసం కార్మికులు కృషిచేయాలన్నారు. సభ ప్రారంభంలో అమీరుల్లా ఖాన్ చిత్రపటానికి శాసనాల వీరబ్రహ్మం, అందె నాసరయ్య, రైల్వే డీఆర్సీసీ సభ్యుడు గాయం నారాయణ రెడ్డి, ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కెజీ నరసింహం తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అమీరుల్లా ఖాన్ కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

## మద్దులూరులో నూతన రైస్ కార్డులు పంపిణీ చేసిన టీడీపీ మండల అధ్యక్షులు హరిబాబు



**సంతనూతలపాడు, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో నూతన స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మద్దులూరు గ్రామ అభివృద్ధి నాయకులు నువ్వుల మీరయ్యలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు ధర్మవరపు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దాసరి రవీంద్రబాబు, బొడ్డపాటి చంద్రశేఖర్, నాదెండ్ల ఆంజనేయులు, వీఆర్వో హనుమంతరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై డైట్ ఛాత్రోపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన





**సంతనూతలపాడు, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం మైనంపాడు డైట్ కళాశాలలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమంను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు అధ్యక్షత వహించారు. విద్యార్థులు సబ్జెక్టు వారీగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే సర్వతోముఖాభివృద్ధికి తేలికగా సాధ్యపడునని ప్రిన్సిపాల్ సుబ్బారావు పేర్కొన్నారు. పాండిచ్చేరి యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంజనేయస్వామి వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంజనేయ స్వామిని డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు అధ్యాపకులు సత్కరించారు.

## రాయితీ శనగ విత్తనాల కొరకు రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

**కంభం, అక్టోబరు 14 (ప్రభాతవార్త**

మండలంలోని రైతులు రాయితీ శనగ విత్తనాల కొరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంభం మండలానికి 1150 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించారని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించి తీసుకోవాలన్నారు. ఆధార్, పొలం పాస్ బుక్, సెల్ ఫోన్ నెంబర్ తో సంప్రదించాలని తెలిపారు. క్వింటా శనగ విత్తనాల ఖరీదు రూ.7800లు కాగా రాయితీ రూ. 1950లని రైతు రూ.5850లు చెల్లించాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల భౌతికకాయాలను సందర్శించిన ఎమ్మెల్యే కందుల



**కొనకనమిట్ల, అక్టోబర్ 14, (ప్రభాతవార్త**

మండలంలోని ఎదురాళ్లపాడు వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల భౌతిక కాయాలను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతులు గణేష్, అభినాష్‌లది మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామం. మంగళవారం పొదిలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉన్న యువకుల భౌతికకాయాలను సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసు కున్నారు. డాక్టర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు ఉన్నారు.

## అన్న క్యాంటీన్లు రుచికరమైన అన్నం ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవు

### - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ హెచ్చరిక



**కనిగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లలో నాణ్యమైన ఆహారం అందించకపోతే సహించేది లేదని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ హెచ్చరించారు. మంగళవారం అన్న క్యాంటీన్‌లో టిఫిన్ నాణ్యతపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చైర్మన్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టోకెన్ల పంపిణీ, ఆహార నాణ్యత, నిర్వహణ విధానంపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో స్వయంగా టిఫిన్ రుచి, సాంబార్ నాణ్యతను పరిశీలించి గఫార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనంలో అన్నం గట్టిగా ఉండటం, సాంబార్ పలుచగా ఉండటం వంటి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించకపోతే కఠిన చర్యలు తప్పవు. ఇలాంటి నిర్లక్ష్యం మళ్లీ సహించం అని ఆయన స్పష్టం చేశారు. అలాగే భోజనశాలలో పరిశుభ్రత ఖచ్చితంగా పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు కొనసాగితే ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియామకంపై

### దేవకి వెంకటేశ్వర్లుకు ఆర్యవైశ్యుల ఘన సన్మానం



**కనిగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
శ్రీశైలం దేవస్థానం పాలకవర్గ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఏపీ వాసవిసత్ర సముదాయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లుని ఆర్యవైశ్య సమాజం ఘనంగా సన్మానించింది. శ్రీశైలంలోని ఈ సన్మాన కార్యక్రమంలో రాచపూడి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో పాటు కనమర్లపూడి లక్ష్మీమోహన్, రాచపూడి లక్ష్మీ, మునగ ఉమా శివలక్ష్మీ, అచ్యుత ధనమ్మ, అన్నా లక్ష్మీ కుమారి, అచ్యుత లక్ష్మీ, దేవకి సత్యవతి తదితరులు పాల్గొన్నారు. కనిగిరి ఆర్యవైశ్య మహిళా సంఘం తరుపున మహిళలు పూలదండలు, శాలువాలతో దేవకి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి సమాజం అభివృద్ధికి దేవకి వెంకటేశ్వర్లు చేస్తున్న కృషి ప్రశంసనీయమని, ఆయన దేవస్థాన పాలకవర్గంలో ఉండటం సమాజ గౌరవం అని పేర్కొన్నారు.

## స్మార్ట్ కార్డులతోనే పారదర్శకంగా రేషన్ పంపిణీ

### - మాజీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి



**కనిగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
రేషన్ సరఫరాలో పారదర్శకతను కాపాడేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు కీలకమని మాజీ తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పాత కూచిపూడి పల్లెలో స్మార్ట్ కార్డ్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాడ మనోహర్‌రెడ్డి, రత్తయ్య, ప్రసాద్, నారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం సరైన లబ్దిదారులకే చేరేందుకు స్మార్ట్ కార్డు వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ విధానం వల్ల మోసాలు తగ్గి, ప్రజలకు న్యాయం జరుగుతుంది అని పేర్కొన్నారు. అలాగే ప్రజలు స్మార్ట్ కార్డులను సక్రమంగా వినియోగించుకోవాలని, రేషన్ సరఫరాలో ఏవైనా లోపాలు గమనించిన వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## డెంగీ, మలేరియా నివారణకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

### - పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి - శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్



**కనిగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
ప్రతి పౌరుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం తమ బాధ్యతగా భావించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రైడే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి పట్టణంలోని కందుకూరు రోడ్డులోని ఆర్టీసీ డిపో వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయబ్ రసూల్ మాట్లాడుతూ .. వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇండ్ల చుట్టు పక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచి, పాడైపోయిన టైర్లు, కూలర్లు, కొబ్బరి బొండాల చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని కోరారు. పూల తొట్లలో, ఇండ్ల ముందు ఉన్న కాలువల్లో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలన్నారు. కాలువల్లో చెత్త వేయడం వలన మురికి నీరు నిలిచి దోమల పెరుగుదలకు దారి తీస్తుందని, దాని వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కనిగిరి పట్టణ ప్రజలు శుభ్రత పట్ల జాగ్రత్తగా వ్యవహరించి 'శుభ్రమైన కనిగిరి-ఆరోగ్యవంతమైన కనిగిరి' నిర్మాణానికి సహకరించాలన్నారు.

## జగన్ నాయకత్వంలో పార్టీ బలోపేతం చేయాలి





**కనిగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (సీఈసీ)సెంట్రల్ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడుబంటేలచెన్న సత్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ భాస్కర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా,కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పరిస్థితులపై సత్యనారాయణరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి చేయడానికి పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## కనిగిరిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### - అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం



**కనిగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఆ దిశగా మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి వేగంగా సాగుతుందని, కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషి చేస్తున్నారని వారు ప్రశంసించారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 7వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పిల్లి కిరణ్, ఉండేలా శ్రీను, తమ్మినేని సురేంద్ర, షరీఫ్, రమణారెడ్డి, అచ్చాల శ్రీను, నవీన్, తమ్మినేని శ్రీను, శ్రీకాంత్, అలాగే టీడీపీ కేవీఎస్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మనస్థాపంతో పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

**బల్లికురవ, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన నాయుడు లక్ష్మణరావు(37)అవివాహితుడు. అదే గ్రామంలో ఒక స్త్రీతో జరిగిన వివాదంతో మనస్తాపం చెంది 13వ తేదీ ఉదయం తన నివాస గృహంలోనే గ్రామాక్సిన్ గడ్డి మందు తాగాడు. ప్రథమ చికిత్స అనంతరం లక్ష్మణరావును మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరులోని తులసీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు తరలించారు, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వై.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కటకం శివప్రసాద్‌కు ఘనంగా సన్మానం చేసిన మిత్రబృందం





**పామూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ గ్రామ కార్యదర్శిగా నియమితులైన కటకం శివప్రసాద్‌కు కాపు నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానం చేసి స్వీట్లుపంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి మిత్ర బృందం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.కటకం శివమాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభిమానంతో పామూరు పట్టణ తెలుగుదేశం పార్టీ గ్రామ కార్యదర్శిగా నియామకం చేసిన వారికి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు.శివ మాట్లాడుతూ నాపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీ గ్రామకార్యదర్శిగా నియమించి నందుకు పార్టీ కార్యకర్తలకు నాయకులకు మిత్ర బృందానికి అందుబాటులో ఉండి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలియజేసి రేపు జరిగే గ్రామ స్థాయి సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిశెట్టి నారాయణ, బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కేవీఆర్, కనిగిరి నియోజకవర్గ యువత అధ్యక్షులు తడికమల్ల సుబ్బారావు, వార్డు మెంబర్ పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, పోతురాజు నారాయణ, మొగుళ్ళూరి సుబ్రహ్మణ్యం, అస్లిం, చిన్న హజరత్, ఆర్ఆర్ రఫీ, ప్రవీణ్ కుమార్, నాని నాయుడు, రామిశెట్టి ప్రతాప్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న ఆకుపాటి వెంకటేష్



**పామూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
ఒంగోలు పట్టణ విద్యా సంస్థల అధినేత శ్రీధర్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్. ఈ కార్యక్రమంలో కనకం ప్రసాద్, పుప్పాల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గూగుల్ డేటా సెంటర్‌తో ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ఆర్థికశకం ప్రారంభం

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ
### - కూటమి ప్రభుత్వంపై నమ్మకానికి నిదర్శనం భారీ ఒప్పందం
### - ఐటీలో విశాఖ ఎదుగుతున్న తీరు రాష్ట్రానికి గర్వ కారణం
### - చదువుకున్న యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు



**దర్శి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
విశాఖ కేంద్రంగా రూ.87,250 కోట్లతో గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్‌తో రాష్ట్రాభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని హర్షం వ్యక్తం చేశారు. దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. గూగుల్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక ఐటీ దిగ్గజం సంస్థలు విశాఖని తమ ఎంపికగా గౌరవంగా భావిస్తున్నామన్నారు. దీని ద్వారా బ్రాండ్ ఏపీకి పెట్టుబడిదారులే ప్రచారకర్తలన్న నినాదాన్ని సీఎం చంద్రబాబు మరోసారి నిజం చేసి చూపించారన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్, యాక్సెంచర్, సిఫీ, సత్యా, డబ్ల్యూఎన్ఎస్ ఇలా ప్రముఖ సంస్థలన్నీ ఏర్పాటు చేయనున్న ఐటీ ప్రాంగణాలతో సాగరనగరం రూపురేఖలన్నీ మారబోతున్నాయని తెలిపారు. మంగళవారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. గూగుల్ డేటా సెంటర్ ద్వారా రాష్ట్రంలో కొత్త ఉద్యోగావకాశాలు, భారీ పెట్టుబడులు, అత్యాధునిక టెక్నాలజీతో వ్యాపార వాతావరణం ఏర్పడనుందని పేర్కొన్నారు. గూగుల్ ఒప్పందం ద్వారా దేశ చరిత్రలోనే అతి పెద్ద సింగిల్ ఎఫ్‌డీఐ సాధించడం చంద్రబాబు, లోకేష్ శ్రమ, సమర్థత, నిబద్ధతకు తార్కాణంగా పేర్కొన్నారు. గూగుల్ సహా మిగిలిన సంస్థల డేటా సెంటర్లు, జీసీసీల ఏర్పాటుతో విశాఖ దేశంలోనే మొట్టమొదటి ఏఐ నగరంగా కూడా రూపుదిద్దుకోనుందని, త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖ నగరం, వీఎంఆర్డీఏ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న మౌలిక వసతులతో రానున్న రోజుల్లో మరిన్ని భారీ పెట్టుబడులు కూడా వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## రెండు బీరువాలు బహుకరించిన వజ్జా ప్రసాద్‌రావు



**ముండ్లమూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శంకరాపురం నందు జీవశాస్త్ర ఉపాధ్యాయులు పని చేయుచున్న వజ్జా ప్రసాదరావు పాఠశాల సైన్స్ ప్రయోగశాల నిర్వహణ, ఇతర ఆఫీసు అవసరాల నిమిత్తం రెండు బీరువాలను రూ.20వేలు విలువ చేసే బీరువాలు బహుకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రసాదరావుకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, నారాయణస్వామి, వి.ప్రసాదరావు, ఎన్.ఇజ్రాయేల్, డి.శ్రావణ్ కుమార్, ఎన్.అరుణ కుమారి, వి.చిరంజీవి, పి.శ్రీనివాసరావు, ఏ.లేవి ప్రసాద్, కే.ప్రసన్న కుమార్, జి.పార్వతి, ఎన్.లీలా ఉమాదేవి, కే.కోటేశ్వర కుమార్, డి.గాలిబి తదితరులు పాల్గొన్నారు.

## బూచేపల్లికి తన్వికారెడ్డి వస్త్ర బహుకరణ కార్యక్రమంలో పాల్గొన్న

### మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి



**దర్శి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మనుమరాలు దర్శి ఎమ్మెల్యే వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నందినీల కుమార్తె బూచేపల్లి తన్వికారెడ్డి వస్త్ర బహుకరణ ఫంక్షన్లో హైదరాబాద్‌లో బూచేపల్లి తన్వికా రెడ్డి నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమం సందర్భంగా తన్వికా రెడ్డిని ఆశీర్వదించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి. ఈ సందర్భంగా జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు తన్వికారెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బూచేపల్లి కుటుంబ సభ్యులు, జిల్లాలోని, దర్శి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశంలో రైతును రాజును చేస్తాం

### - ప్రకృతి వ్యవసాయ డాక్టర్ ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి



**దర్శి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా దేశంలోని రైతులను రాజును చేస్తున్న భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ అని, రైతును రాజును చేస్తామని దర్శి ప్రకృతి వ్యవసాయ డాక్టర్ ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చలివేంద్రం కొండ దగ్గర ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కేంద్రం దర్శనాపురికి 7 కిలోమీటర్ల దూరంలో ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతుని రాజును చేస్తామన్నారు. నిదర్శనం ప్రకృతి వ్యవసాయ కేంద్రానికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న దొనకొండలో ఈనెల 12వ తేదీన బీడీఎల్ కంపెనీ కేంద్రం ఆమోదముద్ర కూడా వేసిందని, రైతే దేశానికి వెన్నుముక అని, రైతు నేస్తం తరుపున డాక్టర్ వెంకటరెడ్డికి పద్మశ్రీ అవార్డుని ప్రకటించాలని దర్శి నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతన్నలు పాల్గొన్నారు.

## లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలి

### - సబ్ స్టేషన్‌ను పరిశీలించిన ఈఈ పి.శ్రీనివాసులు



**ముండ్లమూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని గ్రామాలలో ఓల్టేజి సమస్య లేకుండా వినియోగదారులకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందేలా చూడాలని ఈఈ పి.శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రమైన ముండ్లమూరులోని సబ్ స్టేషన్‌ను మంగళవారం ఈఈ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మొండి బకాయిలను వెంటనే వసూళ్ళ చేసి విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. సిబ్బంది గ్రామాలలో వినియోగదారులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ అంకబాబు, సిబ్బంది ఉన్నారు.

## ప్రధానమంత్రి సభా ఏర్పాట్ల సమీక్ష

### - జన సమీకరణపై మంత్రుల సమావేశం





**అద్దంకి, అక్టోబరు 14, ప్రభాతవార్త**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌పై ఈ నెల 16న కర్నూలులో భారీబహిరంగ సభ నిర్వహించ నున్నారు. ఈ నేపద్యంలో రాష్ట్ర మంత్రులు సమావేశమై బహిరంగ సభ నిర్వహణ, జనసమీకరణపై ప్రత్యేక సమీక్ష చేశారు. పాణ్యంలో విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, రాయలసీమను ప్రత్యేక పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిఎస్‌టి సమస్కరణలతో తీర్చి దిద్దనున్నారని ఆయన వెల్లడించారు. అనంతరం కర్నూలులోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రధాన మంత్రితోపాటు సిఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్, విద్యావనరుల శాఖమంత్రి నారా లోకేష్‌లు పాల్గొననున్న భారీ సభకు జనసమీకరణపై పలువురు మంత్రులు, శాసనసభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌తోపాటు పలువురు మంత్రులు బిసి జనార్ధన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, నడింపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్య ప్రసాద్, ప్రకాశం జిల్లా శాసనసభ్యులు, ఎంఎల్‌సిలు, పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రవేటికరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ఉద్యమం

### - అద్దంకిలో పోస్టర్ అవిష్కరణ
### - కోటి సంతకాల ఉద్యమంను అద్దంకిలో ప్రారంభించిన డాక్టర్ అశోక్ కుమార్





**అద్దంకి అక్టోబరు 14, ప్రభాతవార్త**
మెడికల్ కాలేజిల ప్రవేటి కరణ పేరుతో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వలో భారీ కుట్రకు తెరలేపిందని, అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. మెడికల్ కాలేజిల ప్రవేటికరణను వ్యతిరేకిస్తూ కోట సంతకాల ఉద్యమాన్ని అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి అశోక్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత పోస్టర్‌ను కూడ పార్టీ నాయకులతో కలిసి అశోక్ కుమార్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45రోజుల పాటు కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పిపిపిల పేరుతో కూటమి నేతలకు మెడికల్ కాలేజిలను కట్టబెట్టేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కుట్రకు తెరలేపిందన్నారు. ఈ కుట్రలో విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతుందని, పేదలకు మెడికల్ విద్య అందని ద్రాక్షలా మారుతుందని, ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కూటమి ప్రభుత్వంలో వారి నేతలకు దోచిపెట్టడమే అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం దోచుకో, దాచుకో అనేవిధానాలతో సాగుతుందన్నారు. జగనన్న పాలనలో విద్య, వైద్యాన్ని రెండు కళ్ళుగా భావించి, సుపరిపాలన అందించారని, పేదలకు ఉన్నత విద్య, కార్పోరేట్ వైద్యాన్ని అందించడంతో పేదల హృదయాలలో జగనన్న చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కూటమి ప్రభుత్వం నాశనం చేస్తుంటే, వైసిపి నేతలు చూస్తు ఊరుకోరన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని వైసిపి నేతలను, జగనన్న అభిమానులను వేధిస్తున్నారని, ఈ వేధింపులు జగనన్న అభిమానులను, అడ్డుకోలేరన్నారు. జగనన్న ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజిలను మంజూరు చేసారని, అవి నిర్మాణంలో వివిధ దశలలో వున్నాయని వీటిని పిపిపిల విధానాలో ప్రవేటు వ్యక్తులను అప్పగించి, డబ్బులు దండుకునే కుట్రకు కూటమి ప్రభుత్వం తెరతీసిందన్నారు. కోటి సంతకాలను సేకరించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు అశోక్ కుమార్ పేర్కొన్నారు.

## నకిలీ మద్యంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట




**గిద్దలూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త**
గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపి ఇన్చార్జి కె.పి.నాగార్జున రెడ్డి ఆదేశాలతో కల్తీ మద్యంకి వ్యతిరేకంగా మంగళవారం గిద్దలూరు నియోజకవర్గంలో వైయస్ఆర్ సీపీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వైయస్ఆర్‌సీపీ నగర పార్టీ అధ్యక్షులు మానం బాలి రెడ్డి, మండల అధ్యక్షులు బత్తెం ఓబుల్ రావు,రాష్ట్ర అనుబంధ విభాగ సభ్యులు సూరస్వామి రంగారెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, గిద్దలూరు టౌన్ నందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు వెళ్లి స్థానిక ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నారా వారి సారా వద్దు, నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీయవద్దు అంటూ నినాదాలతో కార్యక్రమం సాగింది. బత్తెం ఓబుల్ రావు మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీ, సరఫరాపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరపాలని కోరారు. నకిలీ, కల్తీ మద్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తించి, వారి కుటుంబాలను ఆదుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.

## రాయితీ శనగ విత్తనాలకై పేర్లను రిజిస్టర్ చేసుకోవాలి



**రాచర్ల, అక్టోబరు 14, ప్రభాతవార్త**
ప్రభుత్వం రాయితీపై రైతులకు అందజేసే శనగ విత్తనాల కొరకు తమ పేర్లనురిజిస్ట్రర్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. మంగళవారం దాదాపు 80 మంది రైతులు తమ తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో శనగల కొరకు తమ పేర్లు నమోదు చేసుకున్నారని వారందరికీ అవసరమైన మేరకు విత్తనాలు అందివ్వడం జరుగుతుందన్నారు ఇంకా అవసరమైన వారు తమ ఆధార్ కార్డు పట్టాదార్ పాస్ పుస్తకం మొబైల్ తో రైతు సేవ కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు రెండు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన వాటిని రైతులు పొందవచ్చు అన్నారు 2500 హెక్టార్లలో రైతులు శనగ సాగుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు

## గుండెపోటుతో వ్యక్తి మృతి



**రాచర్ల, అక్టోబరు 14,ప్రభాతవార్త**
గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన
గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం ఆకవీడు గ్రామంలో చోటుచేసుకుంది.ఆకవీడు గ్రామానికి చెందిన సాదు రామాంజనేయులు మంగళవారం గుండెనొప్పి గురికావడంతో కుటుంబ సభ్యులు గిద్దలూరులోని డిజిఆర్ వైద్యశాలలో చేర్పించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు,ఒక అబ్బాయి ఉన్నారు. అబ్బాయి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిసింది.

## సోము వీర్రాజును కలిసిన మండల బీజేపీ నాయకులు



**కొనకనమిట్ల, అక్టోబర్ 14, ప్రభాతవార్త**
ఒంగోలులో ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో మంగళవారం జరిగిన ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన బీజేపీ జిల్లా కార్య సభ్యులు సోము వీర్రాజును జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కొనకనమిట్ల మండల నాయకులు కలిశారు. శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా నాయకులు కల్లం సుబ్బారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షులు మన్నం శ్రీనివాసులు, కేవీఆర్ తదితరులు ఉన్నారు.

15-10Pg5 9th_15-10Pg5.qxd 10/14/2025 9:46 PM Page 1



# 71 మందితో బీహార్ బిజెపి తొలి జాబితా

## కేంద్ర మాజీ మంత్రి, ఇద్దరు డి.సిఎంలకు చోటు, స్పీకర్ నందకిశోర్ యాదవ్‌కు దక్కని కమలం టిక్కెట్

**పాట్నా, అక్టోబరు 14:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బిజెపి 71 మంది పేర్లతో తొలి జాబితా విడుదల చేసింది. ఇందులో 9 మంది మహిళలకు కమలం పార్టీ టికెట్లు ఇచ్చింది. ఈ జాబితాలో మాజీ కేంద్ర మంత్రి రాంక్రిపాల్ యాదవ్, ఇద్దరు డిప్యూటీ సిఎంలు పేర్లుండగా, స్పీకర్ నందకిశోర్ యాదవ్‌కు చోటు దక్కలేదు. డిప్యూటీ సిఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాల తారాపూర్, లఖిసరాయ్‌ల నుంచి పోటీ చేస్తుండగా, మాజీ కేంద్ర మంత్రి రాంక్రిపాల్ యాదవ్ దానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇక అసెంబ్లీ స్పీకర్ నందకిశోర్ యాదవ్ 2010 నుంచి పాట్నా సాహిబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఈసారి ఆ స్థానం నుంచి రత్నేష్ కుశ్వాహాను బిజెపి బరిలోకి దించింది. సీనియర్ బిజెపి నేత, మాజీ మంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (కటిహార్), ఆరోగ్య మంత్రి మంగల్ పాండే (సివాన్), మరో మంత్రి నితిన్ నబిన్ (బంకిపూర్) లకు తొలి జాబితాలోనే టికెట్లు దక్కించుకున్నారు. కామన్‌వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ శ్రేయాసి సింగ్ మరోమారు జముయి నియోజకవర్గంలో తన భవితవ్యం తేల్చుకోనున్నారు. 243 బీహార్ అసెంబ్లీలో ఎన్‌డిఎ కూటమి తరఫున బిజెపి 101, జెడియు 101, ఎల్‌జెపి(ఆర్‌వి) 29, ఆర్ఎల్ఎం 6, హెచ్ఎఎం 6 సీట్లలో పోటీ చేస్తున్నాయి. ఈ మేరకు కూటమిలోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరిన విషయం తెలిసిందే.





### ప్రశాంత్ కిశోర్ 65 మందితో రెండో జాబితా

ప్రశాంత్ కిశోర్ తన జన్ సురాజ్ పార్టీ తరఫున 65 మంది అభ్యర్థుల పేర్లతో రెండో జాబితాను విడుదల చేశారు. ప్రతి వర్గానికి ప్రాతినిధ్యం కల్పిస్తామని చెబుతూ వస్తున్న ప్రశాంత్ కిశోర్ ఆమేరకు కుల, మత, వర్గ సమీకరణాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన 14 మందికి పీకే అవకాశం కల్పించారు. అలాగే మైనారిటీలకు 14 సీట్లు కేటాయించారు. మరో 10 మంది ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులను జన్ సూరజ్ పార్టీ తరఫున పోటీ చేయిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు 116 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ప్రశాంత్ కిశోర్, ఏ స్థానం నుంచి పోటీ చేస్తున్నది ఇంకా వెల్లడించలేదు. అసలు పోటీ చేస్తాడా లేదా అన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. 1989 భాగల్పూర్ అల్లర్ల బాధితుల తరఫున ఉచితంగా వాదించిన లాయర్ అభయ్ కాంత్ ఝా, సివాన్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ షానవాజ్ ఆలం బధారియా నుంచి పోటీ చేయనున్నారు. రిటైర్డ్ పోలీస్ అధికారి నస్రుల్లా ఖాన్ నోఖా (రోహ్తాస్) నుంచి, ప్రొఫెసర్ శశికాంత్ ప్రసాద్ పుల్వారీ నుంచి బరిలోకి దిగుతున్నారు. మొదటి జాబితా(51)లోని అభ్యర్థులలో 49 మంది తొలిసారి పోటీ చేస్తున్న వారే. మలి జాబితాలోనూ వైద్యులు, న్యాయవాదులు, సివిల్ సర్వీసెస్ మాజీ అధికారులున్నారు.

### తండ్రి టికెట్లిచ్చాడు.. కొడుకు వెనక్కి తీసుకున్నాడు

బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మహాకూటమిలో కీలక భాగస్వామి ఆర్‌జెడిలో తండ్రి, కొడుకుల మధ్య టికెట్ల పంచాయతీ రచ్చకెక్కింది. సోమవారం మధ్యాహ్నం అధినేత లాలూప్రసాద్ యాదవ్ తమ పార్టీ విధేయులు కొందరికి ఫోన్ చేసి, ఇంటికి ఆహ్వానించారు. వారికి స్వయంగా బి.ఫారాలు అందజేశారు. కార్యకర్తలు, అనుచరులతో సంబరాలు చేసుకుంటూ స్వస్థలాలకు వెళ్లిపోయారు. టికెట్ల విషయం తెలిసిన లాలూ తనయుడు తేజస్వి యాదవ్ తండ్రి లాలూపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎవరెవరికి టికెట్లు తీసుకున్నారో వారందరికీ రాత్రి ఫోన్ చేసి, ఆయా బి.ఫారాలు వెనక్కి తీసుకున్నాడు. మహాఘట్ బంధన్‌కు సంబంధించి సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. అప్పుడే టికెట్ల కేటాయింపు మంచిది కాదని, అందుకే తేజస్వి యాదవ్ ఆ నిర్ణయం తీసుకున్నారని ఆర్‌జెడి పార్టీ వర్గాలు తెలిపాయి. తండ్రి టికెట్లు ఇస్తే, కొడుకు వెనక్కి తీసేసుకున్నాడంటూ బీహార్ రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది.

**మహాకూటమికి కుదిరిన సీట్ల సర్దుబాటు?**

ఆర్‌జెడి- కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్ కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఆర్‌జెడి 135, కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. మిగిలిన సీట్లలో కూటమిలోని పార్టీలకు కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు ఆర్‌జెడి పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు సిపిఐ(ఎంఎల్) 18 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది.

# సముద్రంలోనూ యుఎస్-చైనా ట్రేడ్ వార్



## నౌకలపై సైతం ప్రత్యేక ఫీజులు

**బీజింగ్, అక్టోబరు 14:** అమెరికా-చైనా మధ్య ఇటీవల వాణిజ్య ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్న సంగతి తెలిసిందే. బీజింగ్‌పై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం రాజుకుంది. తాజాగా ఇరు దేశాలు నౌకలపై పరస్పర ప్రత్యేక ఫీజులు ప్రకటించాయి. అమెరికా యాజమాన్యం నిర్వహణలో ఉన్న నౌకలు, యుఎస్ నిర్వహించే లేదా ఆ దేశ జెండాలతో వచ్చే ఓడలపై ప్రత్యేక ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు చైనా మంగళవారం ప్రకటించింది. అయితే, చైనా నిర్మించిన నౌకలకు ఈ ఫీజుల నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది. అటు అమెరికా కూడా మంగళవారం నుంచి ఈ ఫీజులు వసూలు ప్రారంభించింది.

**చివరి వరకూ పోరాడతాం: చైనా:** మరోవైపు, అమెరికా అదనపు సుంకాలపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందించింది. 'వాణిజ్య యుద్ధం, టారిఫ్‌ల అంశంపై మా వైఖరి స్థిరంగా ఉంది. మీరు (అమెరికాను ఉద్దేశిస్తూ) యుద్ధం కోరుకుంటే మే చివరి వరకూ పోరాడతాం. అదే చర్చలు కావాలనుకుంటే మా తలుపులు తెరిచే ఉన్నాయి' అని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు.

ప్రపంచంలో ఎక్కడా దొరకని అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఇటీవల చైనా నియంత్రణలు విధించింది. ఇకపై విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇది ట్రంప్‌నకు కోపం తెప్పించింది. దీంతో బీజింగ్‌పై 100 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అవి నవంబరు 1వ తేదీ నుంచి గానీ, అంతకు ముందు నుంచి గానీ అమలులోకి వస్తాయని తెలిపారు. దీంతోపాటు చైనాకు అమెరికా సంస్థలు ఎగుమతి చేసే కీలక సాఫ్ట్‌వేర్‌ల పైనా నియంత్రణలు విధిస్తామని వెల్లడించారు.

# అఫ్ఘాన్‌తో సంబంధాలు నిలిపేశాం..

## పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

**ఇస్లామాబాద్, అక్టోబరు 14:** అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాల మధ్య ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. ఈ క్రమంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అఫ్ఘాన్‌తో ఉన్న అన్ని సంబంధాలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు సంబంధించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం ప్రతిష్టంభన నెలకొంది. శత్రుత్వాలు లేవని మీరు చెప్పొచ్చు. కానీ ప్రస్తుత పరిస్థితులు దానికి ప్రతికూలంగా ఉన్నాయి. నేటికి దానితో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి సంబంధాలు లేవు' అని పేర్కొన్నారు. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య ఉన్న శత్రుత్వం తిరిగి ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా చర్చలకు అవకాశం ఉంటుందా అనే ప్రశ్నకు.. బెదరింపులతో కూడి చర్చలు సరికావన్నారు. బెదరింపులపై చర్యల తర్వాత చర్చలకు అంగీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా పాక్ సైనిక ప్రతిస్పందనకు ఆసిఫ్ మద్దతిచ్చారు. దాడికి ప్రతిదాడి సహజమన్నారు. పౌరులను, వారు ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోలేదన్నారు. కేవలం వారి రహస్య స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. అఫ్ఘాన్ పలు ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం కల్పిస్తోందని



ఆరోపించారు. అక్కడ అంతర్జాతీయ ఉగ్రవాదం ఉందని ప్రపంచానికి తెలుసన్నారు. తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టిటిపి) చీఫ్ నూర్ వలీ మెహ్సూద్ గురించి అడగ్గా తాము లక్ష్యంగా చేసుకున్న వ్యక్తి వారి భూభాగంలోనే ఉన్నారని ఆసిఫ్ బదులిచ్చారు. ఈ సందర్భంగా దౌత్య ప్రయత్నాలలో నిజాయితీ అవసరమన్నారు.

పొరుగు దేశాలు మాతో సంతోషంగానే ఉన్నాయి. తాజా ఉద్రిక్తతలపై అఫ్ఘానిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ మాట్లాడారు. పాక్ తప్ప, పొరుగు దేశాలన్నీ తమతో సంతోషం గానే ఉన్నాయన్నారు. తమకు ఎవరితోనూ గొడవలు అక్కర్లేదన్నారు. అఫ్ఘాన్‌లో శాంతి ఉందన్నారు.

# పాక్ పిఎం ప్రశంసలతో ట్రంప్ ఉక్కిరిబిక్కిరి



**ఇస్లామాబాద్, అక్టోబరు 14:** ఇజ్రాయెల్-హమాస్‌ల యుద్ధం ముగింపునకు సంబంధించి ఈజిప్టులోని షర్మ్-షేక్‌లో శాంతి ఒప్పందంపై దేశాధినేతలు సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ఆయనంత గొప్ప అధ్యక్షుడు లేడన్నట్లు వ్యాఖ్యలు చేశారు. షరీఫ్ మాటలకు ట్రంప్ ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. చివరకు తాను మాట్లాడాల్సింది ఏమి లేదంటూ చేతులెత్తేసి ఇంటికి వెళ్లిపోదామంటూ షరీఫ్‌తో చమత్కరించారు. షెహబాజ్ మాట్లాడుతూ 'ఈ రోజు చరిత్రలో గొప్ప రోజులలో ఒకటి. ఎందుకంటే అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో అవిశ్రాంత ప్రయత్నాల తర్వాత గాజాలో శాంతి సాధన అయ్యింది. ఆయన నిజంగా శాంతిని కోరుకునేవాడు. ట్రంప్ ఈ ప్రపంచాన్ని శాంతి, శ్రేయస్సుతో జీవించేలా చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారు' అని కొనియాడారు. ఈ సందర్భంగా భారత్-పాక్ మధ్య జరిగిన ఘర్షణను కూడా ట్రంపే ఆపారంటూ క్రెడిట్ ఇచ్చేశారు. 'భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని ఆపడంతోపాటు కాల్పుల విరమణ సాధించడానికి ట్రంప్ అసాధారణ ప్రయత్నాలు చేశారు. భారత్-పాక్ రెండూ అణ్వస్త్ర శక్తులు. ఆ నాలుగు రోజుల్లో ట్రంప్, ఆయన అద్భుతమైన బృందంతో జోక్యం చేసుకోకపోతే.. ఆ ఘర్షణలు పశ్చిమాసియాకు విస్తరించి ఉండేవి. ఏం జరిగిందో చెప్పేందుకు కూడా ఎవరూ మిగిలేవారు కాదు. ఇందుకుగాను నోబెల్ శాంతి బహుమతికి పాక్ ఆయన్ను నామినేట్ చేసింది. ఇది అందుకునేందుకు ఆయన అర్హుడు. ఇప్పటివరకు ఏడు యుద్ధాలు ఆపారు. ఇది ఎనిమిదవది' అంటూ షరీఫ్ తన ప్రసంగాన్ని ముగించారు. షరీఫ్ ప్రసంగం నేపథ్యంలో అక్కడే ఉన్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోని నోటిమీద చేయి వేసుకొని చూస్తూ ఉండిపోయారు. షరీఫ్ ప్రసంగం తర్వాత ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. షరీఫ్ ప్రసంశలతో ఉబ్బితబ్బిబ్బయిన ట్రంప్ ఇది తాను ఊహించలేదన్నారు. ఇంకా తాను మాట్లాడేందుకు ఏమీ లేదంటూ ఇంటికి వెళ్దాం అంటూ చమత్కరించారు. దీంతో ఆ ప్రాంగణం మొత్తం నవ్వులు విరిశాయి.

## షరీఫ్ సమక్షంలోనే ట్రంప్ భారత్‌పై పొగడ్తలు

### ఆ దేశంతో గొడవ పడకండి అంటూ పాక్ ప్రధానికి హితవు

**కైరో, అక్టోబరు 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై పొగడ్తలు కురిపించారు. ఇండియా చాలా గొప్ప దేశమని, తన స్నేహితుడు అక్కడ ఉన్నత పదవిలో ఉన్నాడని వ్యాఖ్యానించారు. ఈజిప్ట్‌లో జరిగిన పీస్‌సమ్మిట్‌లో ట్రంప్ ఈ వ్యాఖ్యలుచేశారు. ఈ సమిట్‌కు ప్రపంచ దేశాల అధ్యక్షులు, ప్రధానులు, ప్రతినిధులు హాజరయ్యారు. ట్రంప్ వెనకే పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ఉన్నారు. ట్రంప్ తన ప్రసంగంలో భాగంగా భారత్‌ను పొగడడంతో పాటు ఇండియా, పాక్ సామరస్యంగా కలిసి ఉంటాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా తన వెనకే ఉన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఇదే విషయమై అక్కడికక్కడే ప్రశ్నించారు. భారత్‌తో గొడవ పడకుండా కలిసి ఉంటారు కదా?అని అడగగా షెహబాజ్ షరీఫ్‌కు ఏం చెప్పాలో అర్థంకాక అలాగే అన్నట్లు నవ్వుతూ తలూపడం కనిపించింది.



## మీరు చాలా అందంగా ఉన్నారు..

### ఇటలీ ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ప్రశంసలు

**కైరో, అక్టోబరు 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో మరో సారి వార్తల్లో నిలిచారు. ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీని ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని సరదా వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఓ అంతర్జాతీయ కార్యక్రమంలో ఇతర దేశాధినేతల సమక్షంలో మెలోనీ అందాన్ని ఆయన బహిరంగంగా ప్రశంసించారు. ఈజిప్టులో జరిగిన ఓ శాంతి ఒప్పందంపై సంతకాల కార్యక్రమానికి ట్రంప్, మెలోనీ సహా పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, నిజానికి ఇలాంటి మాటలు చెప్పడానికి నాకు అనుమతి లేదు. బహుశా ఇలామాట్లాడితే నారాజకీయ జీవితం కూడా ముగిసిపోవచ్చు. అయినా సరే నేను ఆ అవకాశాన్ని తీసుకుంటున్నానని అన్నారు. అనంతరం మెలోనీ వైపు చూస్తూ, మిమ్మల్ని అందంగా ఉన్నారని పిలవడంలో మీకు ఎలాంటిఅభ్యంతరంలేదు కదా? ఎందుకంటే మీరునిజంగానే అలా ఉన్నారని పేర్కొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారింది. ప్రధాని మెలోనీతో పాటు అక్కడ ఉన్న ఇతర నేతలందరూ నవ్వులు చిందించారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ జార్జియా మెలోనీ ఒక అద్భుతమైన నాయకురాలని కొనియాడారు. శాంతి ఒప్పందం కోసం ఆమె ఇక్కడికి వచ్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించినవీడియోలు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

# అమెరికా అధ్యక్షుడికి మాజీల ప్రశంసలు

## గాజా శాంతి ఒప్పందంపై ప్రపంచనేతల హర్షం



**కైరో, అక్టోబరు 14:** అమెరికా రాజకీయాల్లో అరుదుగా కనిపించే దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆయన రాజకీయ ప్రత్యర్థులు, మాజీ అధ్యక్షులు జో బైడెన్, బిల్ క్లింటన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇజ్రాయెల్‌హమాస్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరదించుతూ, ట్రంప్ చొరవతో కుదిరిన శాంతి ఒప్పందమే ఈ అనూహ్య పరిణామానికి కారణమైంది. ఈ ఒప్పందంలో భాగంగా, రెండేళ్లుగా హమాస్ చెరలో ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీలు సురక్షితంగా తమ స్వదేశానికి చేరుకున్నారు. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో భాగంగా ఈ కీలక ముందడుగు పడింది. ఈ ఒప్పందంపై మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హర్షం వ్యక్తం చేశారు. గాజా ఒప్పందాన్ని ఆయన స్వాగతించారు. ఇలాంటి ఒప్పందం కుదిరేలా చూడటం సులభమైన విషయం కాదు. బందీల విడుదల చాలా సంతోషాన్నిచ్చిందని ఆయన అన్నారు. అమెరికా, ప్రపంచ దేశాల మద్దతుతో మధ్యప్రాచ్యం శాంతి బాట పడుతోందని బైడెన్ వ్యాఖ్యానించారు. మరో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ కూడా ట్రంప్ దౌత్యాన్ని కొనియాడారు. హమాస్ దాడితో మొదలైన ఘర్షణలో జరిగిన మానవ నష్టం తీవ్రంగా బాధించింది. ఇప్పుడు కాల్పుల విరమణ జరగడం, 20 మంది బందీలు విడుదల కావడం, గాజాకు మానవతా సాయం అందడం గొప్ప విషయం. ఈ ఘనత అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం, ఖతార్ వంటి దేశాలకు దక్కుతుందని క్లింటన్ ప్రశంసించారు. రాజకీయ ప్రత్యర్థుల నుంచి వస్తున్న ఈ పొగడ్తలపై అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ, ఇదంతా చాలా బాగుంది. వారు వాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నారు. కాగా, ఈజిప్టులోని షర్మ్ ఎల్‌షేక్‌లో ఈ చారిత్రక శాంతి ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరిగాయి. పలు దేశాల అగ్రనేతల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలి సంతకం చేయగా, ఆ తర్వాత ఈజిప్టు, ఖతార్, తుర్కియే అధినేతలు సంతకాలు చేశారు.

# పింఛన్ విత్‌డ్రాలలో భారీ మార్పులకు ఇపిఎఫ్‌ఒ నిర్ణయం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఏడుకోట్లకు పైగా పీఎఫ్ చందాదారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పాక్షిక విత్‌డ్రాలకు సంబంధించిన నిబంధనలు సరళీకరిస్తూ ఈపీఎఫ్‌వో బోర్డు నిర్ణయం తీసుకుంది. చందాదారులు తమ ఈపీఎఫ్ ఖాతా నిల్వలో వంద శాతం వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవీయ నేతృత్వంలో జరిగిన ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్టు కార్మిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. ఈపీఎఫ్ సభ్యుల సౌకర్యార్థం ఈపీఎఫ్ స్కీమ్‌లోని పాక్షిక విత్‌డ్రా నిబంధనలను సులభతరం చేయాలని సీబీటీ నిర్ణయించింది. తాజా నిర్ణయంమేరకు చందాదారులు ఉద్యోగి, యజమాని వాటాతో సహా ప్రావిడెంట్ ఫండ్‌లోని అర్హమైన బ్యాలెన్స్‌లో వంద శాతం వరకు విత్‌డ్రాచేసుకునే అవకాశం ఉంటుంది. ఈమేరకు 13 క్లిష్టమైన నిబంధనలను ఒక నిబంధనగా క్రమబద్ధీకరించింది. దీనిని మూడు రకాలుగా వర్గీకరించింది. అవి ముఖ్యమైన అవసరాలు (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు. మరోవైపు ఉపసంహరణ పరిమితులను కూడా సరళీకరించారు. విద్య కోసం విత్‌డ్రాలు పదిసార్ల వరకు, వివాహం కోసం ఐదుసార్ల వరకు




అనుమతించారు. ఇక అన్ని పాక్షిక విత్‌డ్రాలకు సంబంధించిన కనీస సర్వీసును 12 నెలలకు తగ్గించారు. ఇంతకు ముందు ప్రత్యేక పరిస్థితుల కింద చందాదారు పాక్షిక ఉపసంహరణకు సంబంధించి ప్రకృతి విపత్తు, సంస్థల లాకౌట్లు/మూ సివేతలు, నిరుద్యోగం, మహమ్మారుల విజృంభణ వంటి కారణాలను స్పష్టం చేయాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడు చందాదారు ఏ కారణాన్ని పేర్కొనకుండానే దరఖాస్తు చేసుకో వచ్చు. పీఎఫ్ ఖాతాలో జమ చేసే మొత్తంలో 25 శాతాన్ని కనీస నిల్వగా ఉంచాలన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో ఈపీఎఫ్‌వో అందించే అధిక వడ్డీ రేటు (ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ) ప్రయోజనాన్ని సభ్యులు పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది పదవీ విరమణ సమయానికి నిధిని కూడబెట్టు కోవడానికి దోహదపడనుంది. ఈపీఎఫ్ ముందస్తు ఫైనల్ సెటిల్‌మెంట్‌ను పొందే వ్యవధిని ప్రస్తుత 2 నెలల నుంచి 12 నెలలకు మార్చారు. అలాగే తుది పెన్షన్ ఉపసంహరణ వ్యవధిని 2 నెలల నుంచి 36 నెలలకు మార్చారు. కాగా ఈపీఎఫ్ 95 పెన్షనర్ల ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) సర్వీసులు అందించడానికి గాను ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవడానికి బోర్డు ఆమోదం తెలిపింది. కాగా. వచ్చే నెల 1నుంచి పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు (డీఎల్‌సీ) ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్యక్రమం 30 వరకు అమలు కానుంది.

# సంక్షిప్తంగా..

## మలేసియాలో చిన్నారులను కబళిస్తున్న వింతవైరస్..



**కౌలాలంపూర్, అక్టోబరు 14:** మలేషియాలో వేల మంది చిన్నారులు ఫ్లూ తరహా వ్యాధి బారినపడటం కలకలానికి దారి తీసింది. కొవిడ్ సంక్షోభం తొలి రోజులను గుర్తుకు తెస్తున్న ఈ పరిణామంతో అప్రమత్తమైన ప్రభుత్వం వెంటనే పలు స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. అయితే, ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు తగిన అనుభవం వైద్య సిబ్బందికి ఉందని అక్కడి వైద్య శాఖ డైరెక్టర్ జనరల్ మహమ్మద్ ఆజమ్ అహ్మద్ తెలిపారు. ఇన్‌ఫ్లెక్షన్ల వ్యాప్తి నిరోధానికి సంబంధించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా ఫాలో కావాలని స్కూల్ యాజమాన్యాలకు సూచించారు. ఎన్ని స్కూళ్లకు సెలవులు ప్రకటించారనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడంచలేదు . దేశ వైద్య శాఖ సమాచారం ప్రకారం, పలు ప్రాంతాల్లో చిన్నారులు ఫ్లూ తరహా ఇన్‌ఫెక్షన్ల బారిన పడ్డారు. 97 ప్రాంతాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉంది. అంతకుముందుకు 14 ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండగా కేవలం వారం రోజుల్లో ఇన్‌ఫెక్షన్ క్లస్టర్ల సంఖ్య 97కు చేరుకుంది.

## మిలిటెంట్ల చొరబాట్లను భగ్నంచేసిన ఆర్మీ


**శ్రీనగర్, అక్టోబరు 14:** జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి సోమవారం మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కుప్వారా జిల్లాలోని మచిల్, దుద్నియాల్ సెక్టర్‌లో చొరబాటు యత్నాలను భద్రతా దళాలు భగ్నం చేశాయి. ఇద్దరు ఉగ్రవాదులను మట్టుపెట్టాయి .మచ్చిల్ సెక్టర్‌లో నియంత్రణ రేఖకు సమీపంలో సోమవారంరాత్రి భద్రతా దళాలు ఉగ్రవాదుల కదలికల్ని గుర్తించాయి. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ జరగ్గా భారత సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇక దుద్నియాల్ సెక్టర్‌లో పేలుళ్లు సంభవించడం ఆందోళనకు దారి తీసింది.దీంతో, భద్రతాదళాలు ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టాయి. సరిహద్దు వెంబడి మళ్లీ చొరబాట్లకు ప్రయ త్నాలు మొదలయ్యాయన్న ఆందోళన వ్యక్తమవు తోంది. ఇప్పటికే భద్రతా దళాలు అనుమా నాస్పద ప్రాంతాల్లో ఉగ్రవాద ఏరివేత చర్యలు ప్రారంభించాయి. ఉగ్రవాదులకు సహకరిస్తున్న హ్యాండర్లు, సానుభూతిపరుల నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసే పనిలో ఉన్నాయి.

## మరోదాడికి సిద్ధం అవుతున్న పాక్: మనోజ్‌కుమార్

**న్యూఢిల్లీ,అక్టోబరు 14:** పాకిస్థాన్ మరో దాడికి ప్రయత్నించే అవకాశం ఉందని వెస్టర్న్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ హెచ్చరించారు. జమ్ము కశ్మీర్‌లో ఆయన మాట్లాడుతూ, పహల్గామ్ తరహాలో పాకిస్థాన్ మరో దాడికి ప్రయత్నిస్తే భారత్ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా గట్టిగా బదులిచ్చినప్పటికీ పాకిస్థాన్ తన వైఖరిని మార్చుకోవడం లేదని విమర్శించారు. పాకిస్థాన్ ప్రతి కదలికపై దృష్టి సారించామని మనోజ్‌కుమార్ వెల్లడించారు. ఈసారి అలాంటి దుశ్చర్యకు పాల్పడితే మనం ఇచ్చే సమాధానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పాకిస్థాన్ దుందుడుకు చర్యలకు పాల్పడితే ఈసారి గట్టి గుణపాఠం చెబుతామని భారత సైన్యం గత నెలలోనే స్పష్టం చేసింది. ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌కు సమీపంలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్‌లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన విషయం తెలిసిందే.

## ఫ్లాట్‌కొనాలని వెళ్లి 31వ అంతస్తు పైనుంచి పడి మృతి

**లక్నో, అక్టోబరు 14:** ఒక వ్యక్తి ఫ్లాట్ కొనుగోలు చేయాలని భావించి స్నేహితుడితో కలిసి అపార్ట్‌మెంట్ బిల్డింగ్ వద్దకు వెళ్లిన ఒక వ్యక్తి లోపల భవనం చూద్దామని 31వ అంతస్తు వరకూ వెళ్లి ఆపైనుంచి పడి చనిపోయిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ప్రాపర్టీ డీలర్‌ను కలిసి మాట్లాడిన వెనువెంటనే ఆ బిల్డింగ్ 31వ అంతస్తు నుంచి కిందపడి అతడు మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. 27 ఏళ్ల సత్యం త్రిపాఠి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఇందిరపురంలో నిర్మించిన సాయా గోల్డ్ అవెన్యూ సొసైటీలోని ఒక ఎత్తైన అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేయాలని అతడు భావించాడు. ఆదివారం రాత్రి 8 గంటలకు సత్యం త్రిపాఠి తన స్నేహితుడు కార్తీక్



సింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారితో కలిసి ఫ్లాట్ చూడటానికి ఆ అపార్ట్‌మెంట్ బిల్డింగ్ వద్దకు వెళ్లాడు. ఆ ముగ్గురు సుమారు 50 నిమిషాలు అక్కడ ఉండి మాట్లాడుకున్నారు. ఇంతలో సత్యం త్రిపాఠి ఉన్నట్టుండి బిల్డింగ్ 31వ అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

15-10pg6exHMNWJQE 10_15-10pg6exHMNWJQE.qxd 10/14/2025 11:14 PM Page 1





## తిరుపతిలో డ్రగ్ ఇంజక్షన్స్ కలకలం

### ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుపతి, అక్టోబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలో మత్తుకోసం డ్రగ్స్ ఇంజక్షన్‌లు వాడుతున్న ముగ్గురు వ్యక్తులను తిరుపతిలోని ఆర్‌సి రైల్వేగేట్ పట్టాలపై పోలీసులు పట్టుకున్నారు. డ్రోన్ సాయంతో దీన్ని గమనించిన పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని మత్తు ఇంజక్షన్‌లు తీసుకుంటున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి వారిని వెస్టుపోలీసుస్టేషన్‌లో ఉంచి విచారణ చేశారు. కౌన్సెలింగ్ ఇచ్చారు. యువత, వ్యక్తులు మత్తుకు బానిసలు కాకూడదని, జీవితం నాశనం చేసుకోవద్దని ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన గమనించాలని సూచించారు.



## తప్పుడు పోస్టులపై కఠిన చర్యలు

### ఇద్దరు వైసిపి నేతలు అరెస్టు

తిరుపతి, అక్టోబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలో కల్తీమద్యం కలకలం, ప్రజల భద్రత ఎక్కడ అని తప్పుడు వీడియో సామాజిక మాధ్యమంలో ప్రచారం చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసినట్లు తిరుపతి అదనపు ఎస్పీ రవి మనోహరచారి తెలిపారు. అరెస్టు అయినవారిలో చంద్రశేఖర్ వెంకటేష్ (25), ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వద్ద వ్యక్తిగత సహాయకుడుగా పని చేస్తున్నాడు. మరొకరు బ్రుంగి నవీన్(38) వైసిపి సోషల్ మీడియా టీం సభ్యుడుగా ఉన్నాడని తెలిపారు. అయితే ఇదంతా అసత్య ఆరోపణలేనని, ప్రభుత్వంపై తప్పుడు పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తప్పవని అదనపు ఎస్పీ రవి మనోహరచారి హెచ్చరించారు.

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

తిరుపతిరూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీలో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ముని కుమార్ (38) అనే వ్యక్తి మృతి చెందాడు. మంగళ వారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఇంటిలో మంటలు చెలరేగాయి.



ఇంట్లో నిద్రించే మునికుమార్, అతని తల్లి అప్రమత్తమై బయటకు వచ్చేసారు. ఇంట్లో ఉండే విలువైన వస్తువులు కాలిపోతాయని గమనించిన మునికుమార్ వాటిని తీసుకురావటానికి మళ్లీ ఇంట్లోకి వెళ్ళి అగ్నికి ఆహుతి అయ్యాడు. దట్టమైన పొగ మధ్యలో చిక్కుకొని, ఉక్కిరిబిక్కిరై ఊపిరాడక మృతి చెందాడు. కొడుకు మరణించడంతో వృద్ధురాలైన తల్లి కన్నీరు మున్నీరయ్యారు. మునికుమార్‌కు ఇంకా పెళ్ళికాలేదని, ఆ ఇంట్లో తల్లి కొడుకు మాత్రమే ఉండేవారని స్థానికులు తెలిపారు. మునికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.



## దుర్గమ్మవారి దర్శనం ఆనందకరం: కేరళ డిజిపి

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 14 ప్రభాతవార్త: దుర్గమ్మవారిని దర్శించుకోవటం ఎంతో సంతోషంగా వుందని కేరళ రాష్ట్ర డిజిపి ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. డిజిపి దంపతులకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

### డిప్యూటి సిఎంకు దుర్గమ్మవారి వేదాశీర్వచనం



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు దుర్గమ్మవారి ఆశీర్వచనాలను వేదపండితులు అందించారు. మంగళవారం ఆయన కార్యాలయానికి వెళ్ళిన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఇఓ వికె శీనా నాయక్‌ల బృందం ఆయనకు దుర్గమ్మవారి ప్రసాదాలు, జ్ఞాపిక, శేషవస్త్రం అందించారు.

# వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

### నందంపూడి వేద సభలో మాజీ సిజెఐ జస్టిస్ ఎన్వి రమణ



ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 14 ప్రభాతవార్త: వేద భూమిగా పేరొందిన భారతదేశంలో వేదాలకు తగిన గుర్తింపు లభించడం లేదని, వేద సభలు గ్రామ స్థాయిలో కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహిస్తే వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటి చెప్పడంతో పాటు వేదాలకు, వేద పండితులకు ఎంతో గుర్తింపు లభించి వారి ఆర్థిక సమస్యలు తీరుతాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ అభిప్రాయపడ్డారు. నందంపూడిలో వడ్లమాని లక్ష్మీనారాయణ అవధాని స్మృత్యర్థం ఆయన కుమార్డు సుబ్రహ్మణ్య ఘనాపాటి ఆధ్వర్యంలో వడ్లమాని లక్ష్మీనారాయణ మెమోరియల్ ట్రస్ట్ పేరిట వేద సభను మంగళవారం నిర్వహించారు. మహా మహోపాధ్యాయ శాస్త్రనిధి బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశం సంస్కృతి, సాంప్రదాయాలకు పుట్టినిల్లని, దక్షిణ భారతదేశంలోని కోనసీమ ప్రాంతం వేద పండితులకు పుట్టిల్లన్నారు. వేద పండింతులకు ఎన్నో ఆర్థిక సమస్యలు ఉన్నాయని అయినప్పటికీ వేదాల ప్రాశస్త్యాన్ని, అర్థాలను సమాజానికి చాటిచెబుతున్నారన్నారు. వేదాలను పటించడం వలన మాతృ భాషను, సంస్కృతిని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా వడ్లమాని లక్ష్మీనారాయణ అవధాని మోమోరియల్ ట్రస్టుకు రూ.2 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి ఆస్థాన వేద పండితులు ఉపాధ్యాయుల కాశీపతి సోమయాజి ఘనాపాటి, టిటిడి శ్రీ వెంకటేశ్వర హయ్యర్ వేదిక్ స్టడీస్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు, టిటిడి బోర్డు మాజీ సభ్యులు దొక్కా నాథ్ బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేరి కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు వడ్లమాని పద్మావతి, అనుపిండి బాబ్జి, నూకల శంభూ ప్రసాద్, వడ్లమాని కామేశ్వరరావు, అరిగెల బలరామ్మూర్తి, పితాని వీరాస్వామి, డీఎస్పీ సుంకర మురళీమోహన్, సిఐ ఆర్. భీమరాజు, తహసీల్దార్ బి. చిన్నబాబు, అధిక సంఖ్యలో టిటిడి ఆస్థాన వేదపండితులు పాల్గొన్నారు.

### సింహతలాటం బహుకరణ..

వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని తన మనమడు ప్రముఖ వేదపండితుడు ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య రవితేజ ఘనాపాటికి బహుకరించిన సింహతలాటం, ఒక లక్ష రూపాయల నగదును జస్టిస్ వెంకటరమణ రవితేజ ఘనాపాటి చేతికి అలంకరించి, నగదును అందించి సత్కరించారు.

# సులభ దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఒ డి.బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 14 ప్రభాతవార్త: రానున్న కార్తీక మాసం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ముఖ్యంగా మహిళా భక్తులకు సులభ దర్శనం కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి మంగళవారం వివరించారు. కార్తీక మాసంలో స్వామి అమ్మవార్ల దర్శనానికి స్థానిక భక్తులే కాకుండా మహిళా, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని కాబట్టి ప్రత్యేక ఏర్పాట్లుతో పాటు దర్శన వేళలు మార్పు చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 20 నుంచి కొత్త పూజా విధానాలను అమలు చేస్తునట్లు వివరించారు. పలు మార్పులు చేస్తున్నట్లు వివరించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాధశ రుద్రాభిషేకాలు, మృత్యుంజయస్వామి చేయదల్చుకున్న భక్తులు ప్రత్యేక వేబ్‌సెట్‌ను రూపొందించినట్లు వివరించారు. అభిషేకం టిక్కెట్లును వెబ్‌సైట్ ద్వారానే నమోదు చేసుకోవాలని ఇఓ సూచించారు. టిక్కెట్లు అన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తరువాత భక్తులు దర్శనానికి అభిషేకాలకు వచ్చిన వార ఆధార్ కార్డు, ఇతర వివరాలను కౌంటర్ నందు పరిశీలించిన పిమ్మటే అనుమతించబడుతుందని కౌంటర్లలో ఎలాంటి పరిస్థితిలో అనుమతించబడదని ఇవో తేల్చిచెప్పారు.



కుమారస్వామి తిప్పపై వెలిసిన సుబ్రమణ్యం స్వామి

### కుమారస్వామికి ప్రత్యేక అలంకారాలు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి(సుబ్రమణ్యం స్వామి) ఆలయంలో మంగళవారం విశేష పూజలు, అభిషేకాలు అలంకారాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆలయంలోని మూకేశ్వర తీర్థం ఎదురుగా ఉన్న వళ్ళీ దేవసేన సమేత చెంగల్వరాయ స్వామి ఆలయంలోనూ, రంగుల గోపురం పక్కనే ఉన్న సుబ్రమణ్యం స్వామి ఆలయంలో, తేరువీధిలోని షణ్ముఖ స్వామి ఆలయంలో అలాగే కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. విశేషంగా పూజలు నిర్వహించారు. గతంలో ఇక్కడ మొక్కుబడిగా పూజలు నిర్వహించే వారు. అయితే గత మూడు వారాలుగా ఇక్కడ దేవస్థానం ప్రత్యేక అర్చకుని నియమించారు. అలంకారాలను ఆలయ ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్‌ను నియమించారు. ఆయన సారథ్యంలో అలంకారాలు కళ్ళు మిరుమిట్లు గొల్పేలా తీర్చిదిద్దుతున్నారు.

# చిట్టీల పేరుతో రూ.2 కోట్లకు కుచ్చుటోపి

జగ్గయ్యపేట/ పెనుగంచిప్రోలు, అక్టోబరు 14 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట అసెంబ్లీ పరిధిలోని పెనుగంచిప్రోలులో చిట్టీలు బంగారం స్కీమ్‌ల పేరుతో జరిగిన భారీ మోసం మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలతోపాటు సేకరించిన సమాచారం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీదుర్గా గోల్డ్ లక్కీ డ్రా స్కీమ్ పేరుతో చెన్నా దుర్గారావు అనే ఫర్నిచర్ వ్యాపారి ప్రజల్ని నమ్మించాడు. 22 నెలల కాల పరిమితితో నెలసరి వాయిదాల సొమ్ము సేకరించి ప్రతి నెలా లక్కీ డ్రా అంటూ ప్రచారం చేశాడు. ప్రతి నెల రూ.3 వేలు చెల్లించాలని, ప్రతి నెల 10వ తేదీన తమ దుకాణం వద్ద డ్రా తీస్తామని, డ్రాలో గెలిచిన వారికి 10 గ్రాముల బంగారం ఇస్తామని, గ్రూపుకు 79 మంది సభ్యులతో 22 నెలల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ఇస్తామని నమ్మించి పలు గ్రూపుల్లో సభ్యులను చేర్పించాడు. 2023 నుండి ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టాడు. అయితే ఐదు రోజుల క్రితం దుకాణం మూసివేసి ఇంటికి తాళంవేసి కుటుంబంతో సహ కన్పించకుండా పోయాడు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేయటంతో సభ్యులుగా చేరిన బాధితులు తాము మోసపోయామని గ్రహించి లబోదిబో అంటూ పోలీసులకు ఫిర్యాదుచేశారు. లక్కీడ్రా పేరుతో దాదాపు రూ.2 కోట్లకు పైబడి వసూలుచేసి పరారైనట్లు పోలీసులు చెప్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వర్లు మీడియాకు తెలిపారు. అత్యాశకు పోతే మోసపోవటం తప్పదని పలు మార్లు హెచ్చరికలు చేస్తున్నా అమాయకంగా మోసగాళ్ళను నమ్మి నష్టపోతున్నారంటూ పోలీసులు అంటున్నారు.

## అండర్-23 క్రికెట్ టోర్నీకి జగ్గయ్యపేట క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట, అక్టోబరు 14 ప్రభాతవార్త: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-23 కల్నల్ సికె నాయుడు మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్స్‌కు ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట క్రీడాకారులు టి. వరుణ్‌సాత్విక్, ఎస్.రాజేష్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా మంగళవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర క్రీడాకరులను అభినందించారు. ఎంపికైన ఇరువురు యువకులు స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూలు క్రీడా మైదానంలో ఏసిఏ, కెడిసిఏ బివి సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెక్స్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్నారు. వరుణ్ సాత్విక్ పాల్గొనే ఆల్ ఇండియా టోర్నమెంట్ ఈనెల 16వ తేదీ నుండి అనంతపురంలో ప్రారంభం కానుంది. అలాగే రాజేష్ ప్రస్తుతం హర్యానాలో జరుగుతున్న ఆల్ ఇండియా వన్‌డే టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు కోచ్ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

### జగ్గయ్యపేట కరాటే యోధులు గిన్నీస్ బుక్ రికార్డు

చెన్నైలోని ఎస్ఐవిఇటి కాలేజీలో ఈనెల 5వ తేదీన జరిగిన వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ (డబ్ల్యుకెఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఈవెంట్‌లో భారత కరాటే మాస్టర్లు చరిత్ర సృష్టించారు. ఈప్రపంచ రికార్డు ప్రయత్నంలో లక్షమంది కరాటే మాస్టర్లు, విద్యార్థులు భాగస్వాములై నిరంతరంగా 30 నిముషాలపాటు పంచులు, బ్లాకులు, కిక్స్ చేసి చైనా దేశం ముందుగా సాధించిన 80 వేల మంది 20 నిముషాల రికార్డును అధిగమించారు. ఈ చారిత్రాత్మక ఘనతకు జగ్గయ్యపేటకు చెందిన కరాటే గురువు మాస్టర్ ఫైజ్‌మీరా షరీఫ్, ఆయన కుమారుడు మొహ్మద్ అల్లాహ్ షరీఫ్, అలాగే విద్యార్థి అబ్దుల్ చంద్ కూడా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన జట్టులో భాగస్వాములయ్యారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ కరాటే మాస్టర్ ఫైజ్‌మీరా షరీఫ్, మొహ్మద్ అల్లాహ్ షరీఫ్, అజ్మీర్ చంద్రికలను శాలువాలతో సత్కరించి అభినందించారు.


చంద్రబాబు, లోకేష్‌లకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే గుగూల్ కంపెనీతో ఎంఓయు చేసుకుని న్యూఢిల్లీ నుండి తిరిగి స్వగృహానికి విచ్చేసిన రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌కు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మంగళవారం స్వాగతం పలికారు. ఉండవల్లిలో వారి నివాసం వద్ద స్వాగతం పలికి తన సంతోషాన్ని వ్యక్తపర్చారు.



కరాటేలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన జగ్గయ్యపేట చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

## జగ్గయ్యపేట మల్లిఖార్జునరావుకు రాష్ట్ర శ్రేష్ట విద్యా సేవా పురస్కారం

జగ్గయ్యపేట, అక్టోబరు 14 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన చేగు విద్యాలయ ప్రధాన కార్యదర్శి, విద్యాదాన వితరణశీలి, షరాబు వ్యాపారి కొత్తమాసు మల్లిఖార్జునరావును రాష్ట్ర, జిల్లా శ్రేష్ట విద్యా సేవా పురస్కారం వరించింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఏపిపిఎస్ఏ- డెమెక్రటిక్ వారు ఇటీవల గుంటూరులో నిర్వహించిన సభలో రాష్ట్ర, జిల్లా శ్రేష్ట విద్యా సేవా అవార్డు పురస్కారాన్ని ప్రధానం చేసింది. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీమున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, జగ్గయ్యపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తాడేపల్లి సోమేశ్వరరావు (సోమయ్య), చేగు విద్యాలయ ప్రిన్సిపాల్ రాయపూడి నరసింహారావు, కరస్పాండెంట్ పెనుగొండ వెంకటరాజీవ్ తదితర ప్రముఖులు, పలు విద్యాలయాల ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావును అభినందించారు.





## రైళ్లలో ఆకస్మిక తనిఖీలు

### ఒక్క రోజే రూ.కోటికి పైగా ఆదాయం

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 14 ప్రభాతవార్త: ప్రస్తుత దీపావళి, ఛాత్ పండుగల సీజన్‌లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో టిక్కెట్‌లు లేకుండా/ సరైన టిక్కెట్‌లు లేని ప్రయాణికుల నుంచి రికార్డు స్థాయిలో దక్షిణ మధ్య రైల్వే కోటి రూపాయలకు పైగా అపరాధ రుసుము వసూలు చేసి రికార్డు నెలకొల్పింది. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే ఆదేశాల మేరకు మంగళవారం రైల్వేజోన్ వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఈ ప్రత్యేక టికెట్ తనిఖీలలో జోన్ ఒకే రోజు అత్యధికంగా రూ.1.08 కోట్ల రూపాయలను రైల్వే జోన్ సాధించింది. టికెట్ లేని ప్రయాణం లేదా అనధికారికంగా ప్రయాణించిన ప్రయాణీకుల నుంచి మొత్తం 16,105 కేసులను నమోదు చేసి, ఆ మొత్తాన్ని వసూలు చేయబడ్డాయి. మంగళవారం ప్రత్యేక స్క్వాడ్ బృందాలు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో దక్షిణ మధ్య రైల్వే జోన్ చరిత్రలో ఒకే రోజు ఆదాయం కోటిరూపాయల మైలురాయిని దాటడం ఇదే ప్రథమం. భారతీయ రైల్వే అన్నిజోన్ల కంటే మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఒక కోటి, ఎనిమిది లక్షల రూపాయలను వసూలు చేయడం రికార్డు. ఈ తనిఖీలలో డివిజన్‌ల వారిగా వసూలు చేసిన మొత్తం వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ డివిజన్‌లో అత్యధికంగా రూ.36.91 లక్షలు, గుంతకల్లు డివిజన్ రూ.28 లక్షలు, సికింద్రాబాద్ డివిజన్ రూ.27.9 లక్షలు, గుంటూరు డివిజన్ రూ.6.46 లక్షలు, హైదరాబాద్ డివిజన్ రూ.4.6 లక్షలు, నాందేడ్ డివిజన్ రూ.4.08 లక్షలు వసూలు చేశారు.




## జాల్నా-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 14 ప్రభాతవార్త: ప్రయాణీకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే రాయలసీమ జిల్లాల మీదుగా జాల్నా- తిరుచానూరు- జాల్నా మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. జాల్నా నుంచి తిరుచానూరు వెళ్ళే నెంబర్ 07653 ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 19 నుంచి నవంబర్ 30 వరకు ప్రతి ఆదివారం జాల్నా నుంచి బయలుదేరుతుంది. మార్గమధ్యలో ఈరైలు గుల్బర్గా, షాహ్ బాద్, వాడి, యాద్గీర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, తిరుపతి స్టేషన్‌లలో నిలుస్తోంది. తిరుచానూరు నుంచి జాల్నా వెళ్ళే నెంబర్ 07654 ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 20 నుంచి డిసెంబర్ 01 వరకు ప్రతి సోమవారం బయలుదేరుతుంది. ఈరైలు మార్గమధ్యలో రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూరు, క్రిష్ణా, యాద్గీర్, వాడి, షాహ్ బాద్, గుల్బర్గా స్టేషన్లతోపాటు ఈ మార్గంలోని కర్ణాటక, మహారాష్ట్రలలోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలుస్తాయి.

## ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండిగా సివి ప్రవీణ్ ఆదిత్య నియామకం

విజయవాడ, అక్టోబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండిగా సివి ప్రవీణ్ ఆదిత్య నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఏపీఏడీసీఎల్ పూర్తిగా ఏపీ ప్రభుత్వ యాజమాన్య పరిధిలో పని చేస్తున్నది. ఏపీఏడీసీఎల్ పరిధిలో కుప్పం (చిత్తూరు), ఓర్వకల్లు (కర్నూలు), దగదర్తి (నెల్లూరు) గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాల పనులు వేగవంతం చేస్తున్న క్రమంలో ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండిగా సివి ప్రవీణ్ ఆదిత్య నియమితులయ్యారు.



## పాకాలలో ఇద్దరు బాలురను సమయస్ఫూర్తితో రక్షించిన పోలీసులు

పాకాల, అక్టోబరు 14, ప్రభాతవార్త: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల పోలీసులు తమ సమయస్ఫూర్తి, అప్రమత్తతతో 11 సంవత్సరాలు, 12సంవత్సరాలు వయసున్న ఇద్దరు బాలురను సురక్షితంగా రక్షించారు. ఈ సందర్భంగా పాకాల ఎస్ఐ ఆర్.మురళి మోహన్ మాట్లాడుతూ పాకాల రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఇద్దరు బాలురు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని రైల్వే పోలీసు నుండి అందిన సమాచారం పై తాము వెంటనే స్పందించి అక్కడికి చేరుకుని బాలురను సురక్షితంగా తీసుకువచ్చి ఆశ్రమం కల్పించామన్నారు. ప్రాథమిక విచారణలో, బాలురు ఈనెల 11వ తేదీ శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుండి బయలుదేరి తిరిగి వెళ్లకపోవడంతో, తల్లి శ్రీలక్ష్మి శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాలురు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మిస్సయిన బాలురు కుమ్మర వరుణ్(12) తండ్రి మోహన్ రాజు, తరుణ్ (11)తండ్రి సురేంద్ర (సూరి) ఇద్దరూ శ్రీ సత్యసాయి జిల్లా, చెన్నేకొత్తపల్లి మండలం, మేడాపురం గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. తాము చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌తో సమన్వయం జరిపి అక్కడి నుండి కానిస్టేబుల్ శ్రీరాములు, హెడ్‌కానిస్టేబుల్ పోతులయ్య కలిసి బాలుర తల్లితండ్రులను పాకాల పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చారు. ఇద్దరు బాలురను వారి తల్లిదండ్రుల వద్దకు సురక్షితంగా అప్పగించామని చెప్పారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు పాకాల పోలీసుల సమయస్ఫూర్తి, సేవాభావాన్ని ప్రశంసిస్తూ అభినందించారు.

15-10P_g7exHMNWJQEK 11_15-10P_g7exHMNWJQEK.qxd 10/15/2025 12:30 AM Page 1



## గ్రామీణ ముఖచిత్రం మారేలా

# పల్లె పండగ 2.0



- రహదారి వ్యవస్థ మెరుగుపడాలి
- ప్రజారోగ్యం బాగుండాలి
- గ్రామీణులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండాలి
- సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి
- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

**విజయవాడ, అక్టోబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో గ్రామీణ ముఖ చిత్రం మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పల్లె రూపురేఖలు మారాలన్నారు. గ్రామీణ రహదారి వ్యవస్థ అభివృద్ధిచెందాలన్నారు. ప్రాథమిక విద్యనుంచి ఉన్నత స్థాయి చదువులు పల్లెలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజారోగ్యం బాగుండాలన్నారు. ప్రాథమిక వైద్యకేంద్రాలను అభివృద్ధి చెందామన్నారు. మన గ్రామాలు స్వచ్ఛతకు ప్రతిరూపాలుగా ఉండలన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో పల్లె పండగ 2.0 సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పల్లెపండుగ-1ని విజయవంతం చేసుకున్నామన్నారు. ఆ నాటి ప్రణాళికలు ఎంత వరకు కార్యాచరణలో పెట్టామనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఇదే సందర్భంలో పల్లెల్లో పట్టణ స్థాయి అభివృద్ధికి బాటలు వేసేలా పల్లెపండుగ 2.0 ప్రణాళికలు ఉండాలన్నారు. ఆయన ఇదే సందర్భంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు. పల్లె పండగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగించేలా పల్లె పండగ 2.0 ప్రణాళికలు ఉండాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తాను పదేపదే ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే, మనం ఇచ్చిన హామీలన్ని అమలులో ఉన్నాయా? లేదా! అనే అంశంపై పునశ్చరణ జరగాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వాతావరణం ఆదర్శనీయంగా ఉండాలన్నారు. అన్ని దిశలా పల్లెలు సంపూర్ణంగా మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న పల్లె పండుగ 2.0పై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రహదారుల అభివృద్ధి, నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతులు, గోశాలలు, మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాలో మంచినీటి సమస్య. జలజీవన్ మిషన్ పరిధిలో పరిష్కారం, ఉపాధి హామీ పనిదినాలు, వేతనాల చెల్లింపులు ఇతర అంశాలపైన డిప్యూటీ సిఎం పవన్ మాట్లాడారు. ఈ సమీక్షలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఓ.ఎస్.డి. వెంకటకృష్ణ, ఇంజనీరింగ్ చీఫ్ పంచాయతీరాజ్ బాలు నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణతో అన్ని వర్గాలకు విద్యావకాశాలు

విద్యాశాఖ అధికారుల సమావేశంలో తెలంగాణ వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతో విద్యావకాశాల్లో సామాజిక న్యాయం సాధ్యపడిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఇంత కాలం ప్రొఫెషనల్ కోర్సుల్లో నామమాత్రంగా ఉన్న వర్గాలకు, రిజర్వేషన్ల వర్గీకరణతో ఈ ఏడాది సముచిత ప్రాధాన్యం లభించిందని స్పష్టం చేశారు. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన కులాలకు చెందిన పిల్లలకు కూడా ఈ ఏడాది మెడికల్, ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో సముచిత సంఖ్యలో సీట్లు రావడం సంతోషంగా ఉందని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతోనే ఇది సాధ్యమైందని మంత్రి తెలిపారు. ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజిస్తూ ప్రభుత్వం రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ రిజర్వేషన్ల ప్రకారమే ఈ ఏడాది ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల సీట్లను భర్తీ చేశారు. ఈ మేరకు ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ఆయా వర్గాల విద్యార్థులకు వచ్చిన సీట్లు, ఇతర అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష చేశారు. మంగళవారం ఉదయం సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ, డాక్టర్ యోగితారాణా, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కిషన్ కుమార్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బావురి, మెహతర్, మాంగ్, బేడ బుడగ జంగం, మన్నె, కొలుపులవాండ్లు తదితర అత్యంత వెనుకబడిన కులాల పిల్లలకు ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎంబీబీఎస్‌లో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 41 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 561 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 324 సీట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్‌లో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 378 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 8246 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 5466 సీట్లు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఫార్మసీలో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 60 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 1603 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 898 సీట్లు వచ్చాయని తెలిపారు. గ్రూప్ 2, గ్రూప్ 3 కులాల పిల్లలు తమకు రిజర్వ్ చేసిన సీట్లతో పాటు, ఓపెన్ కేటగిరీలోనూ పెద్ద సంఖ్యలో సీట్లు సాధించారని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి విద్యతోనే సాధ్యమవుతుందని తమ ప్రభుత్వం నమ్ముతోందన్నారు. ఇందుకు అనుగుణంగానే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలంటే.. ఇంజినీరింగ్, మెడికల్ అడ్మిషన్లలో సీట్లు పొందిన ఎస్సీ కులాల విద్యార్థులు, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రాప్ అవుట్ అవకుండా చూసుకోవాలని విద్యా శాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజ నర్సింహ సూచించారు. అత్యంత వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన పిల్లలు ఆర్థిక ఇబ్బందులు, ఇంగ్లీష్ భాష రాకపోవడం వంటి సమస్యలతో ఆత్మన్యూనత భావానికి లోనయ్యే ప్రమాదం ఉందని, ఇది డ్రాప్ అవుట్స్‌కు దారి తీస్తుందని మంత్రి హెచ్చరించారు. విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేసి టీచింగ్ ఫాకల్టీని, సీనియర్ స్టూడెంట్లను మెంటార్లుగా నియమించాలని సూచించారు.



## మీతో పొగతాగే అలవాటు మాన్పించాల్సిందే

### ఇటలీ ప్రధానితో తుర్కియే అధ్యక్షుడి ఛలోక్తులు..!

**బీరూట్, అక్టోబరు 14:** ప్రపంచ రాజకీయాలు, యుద్ధ వాతావరణం వంటి తీవ్రమైన అంశాలపై చర్చించేందుకు సమావేశమైన ప్రపంచ నేతల మధ్య జరిగిన ఓ సరదా సంభాషణ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ధూమపానం అలవాటుపై తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ చేసిన వ్యాఖ్యలు, దానికి ఆమె ఇచ్చిన చమత్కార సమాధానం ఆసక్తికరంగా మారింది. గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు ఈజిప్టులోని షార్మ్ ఎల్‌షేక్‌లో శాంతి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన నేతలు అనధికారికంగా మాట్లాడుకుంటున్న సమయంలో ఎర్డోగాన్, ఇటలీ ప్రధాని మెలోనీ వద్దకు వచ్చి మాట్లాడారు. ఇహ్లాస్ న్యూస్ ఏజెన్సీ ప్రసారం చేసిన వీడియో ఫుటేజ్ ప్రకారం, విమానం నుంచి దిగుతున్నప్పుడు మిమ్మల్ని చూశాను. మీరు చాలా బాగున్నారు. కానీ, మీ చేత పొగతాగడం కచ్చితంగా మాన్పించాలి అని ఎర్డోగాన్ ఆమెతో అన్నారు. ఎర్డోగాన్ మాటలు వినగానే పక్కనే ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ నవ్వుతూ జోక్యం చేసుకున్నారు. "అది అసాధ్యం!" అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి మెలోనీ కూడా అంతే చమత్కారంగా బదులిచ్చారు. నాకు తెలుసు. కానీ నేను స్మోకింగ్ మానేస్తే, నాకు చిరాకు ఎక్కువై ఎవరినైనా ఏమైనా అనేస్తానేమో అంటూ ఆమె నవ్వేశారు. తుర్కియేని పొగాకు రహిత దేశంగా మార్చాలనే లక్ష్యంతో ఎర్డోగాన్ చాలాకాలంగా గట్టి ప్రచారం చేస్తున్నారు. పొగ రహిత తుర్కియే పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. మరోవైపు ఇతర దేశాధినేతలతో సత్సంబంధాలు పెంచుకోవడానికి ధూమపానం తనకు ఉపయోగపడిందని మెలోనీ గతంలో ఓ పుస్తకంలో పేర్కొనడం గమనార్హం. గాజాలో కాల్పుల విరమణ, దీర్ఘకాలిక శాంతి స్థాపన వంటి కీలక అంశాలపై చర్చించేందుకు జరిగిన ఈ సదస్సులో ఈ సరదా సంభాషణ ప్రత్యేకంగా నిలిచింది.

## నకిలీ మద్యం కేసు

# వెలుగులోకి కీలకాంశాలు

**విజయవాడ, అక్టోబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ అధికారులు ఇద్దరు నిందితులను విచారించారు. కీలక సమాచారాన్ని సేకరించారు. మద్యం బ్రాండ్‌ల నకిలీ లేబుల్స్ ముద్రించిన రవితో పాటు మరొకరిని అరెస్ట్ చేసి విచారించారు. నిందితులను రిమాండ్ రిపోర్టులో కీలకమైన విషయాలను పోలీసులు పేర్కొన్నారు. జనార్ధనరావుతో రవి చాలా కాలం నుంచి స్నేహం చేసేవాడని తేలింది. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో తయారైన నకిలీ మద్యం సీసాలకు అంటించిన లేబుల్స్‌ను హైదరాబాద్‌లో పలువురి సాయంతో కీలక నిందితుడు జనార్ధనరావు ముద్రించి తరలించేవారని రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. వీటిని సమకూర్చడంలో ఏ-4 రవి కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. జనార్ధనరావుకు రవితో ఎప్పటినుంచో స్నేహం ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన రవి స్థానికంగా పేపర్ మిల్లు నడిపారని నష్టాలు రావడంతో కుటుంబంతో సహా 2018లో హైదరాబాద్‌కు మకాం మార్చారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు రవికి ప్రధాన నిందితుడు జనార్ధనరావు రుణం కూడా ఇప్పించారని రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. 2023లో జనార్ధనరావుతో కలిసి రవి గోవా వెళ్లారని పేర్కొన్నారు. అక్కడ బాలాజీతో జనార్ధన్‌రావుకు పరిచయం ఏర్పడిందని అతడు సరఫరా చేసిన ముడిపదార్థాలతో అదే ఏడాది నవంబరులో ఇబ్రహీంపట్నంలోని పాత ఏఎన్ఆర్ బార్‌లో నకిలీ మద్యం తయారీ ప్రారంభించారని వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ములకలచెరువులోనూ మొదలుపెట్టారని తెలిపారు. తిరుమలశెట్టి శ్రీనివాసరావు సాయంతో నకిలీ లేబుల్స్‌ను హైదరాబాద్‌లో ముద్రించిన వీటిని రవి ఇబ్రహీంపట్నం పంపించేవారని తెలిపారు. సీసాలకు మూతలు, అవసరమైన ఇతర సామగ్రిని సమకూర్చుకునేందుకు పలువురిని జనార్ధనరావుకు రవి పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. ఇరువర్గాలకు లావాదేవీల విషయంలోనూ రవి అనుసంధాకర్తగా వ్యవహరించినట్లు తెలిపారు.


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లో జనార్ధనరావు, జగన్మోహనరావుల వాట్సాప్‌ల నుంచి వచ్చిన చాట్‌లను ఎక్సైజ్ పోలీసులు పరిశీలించారు. పేటీఎం, ఫోన్‌పే, తదితర వాటి ద్వారా

- హైదరాబాద్‌లో లేబుల్స్ ముద్రణ
- ఇబ్రహీంపట్నంకు తరలింపు
- ఈ తతంగమంతా రవి, శ్రీనివాసరావు సహకారంతో జనార్ధన్‌రావు చేసేవాడు
- ఈ ఏడాది ములకలచెరువులోనూ నకిలీ మద్యం తయారీకి శ్రీకారం
- రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి

> **రవి, శ్రీనివాసరావులకు 27వరకు రిమాండ్**
>
> సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో రవి, తిరుమలశెట్టి శ్రీనివాసరావులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం రాత్రి ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. వీరికి న్యాయాధికారి ఈనెల 27 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నిందితులను నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు.

సరఫరాదారులకు చెల్లింపులను గుర్తించారు. నకిలీ మూతలను సరఫరా చేసిన దారబోయిన ప్రసాద్‌కు లక్ష చెల్లించారని నిందితుడు బాలాజీ కుమారుడికి ఈనెల 9న రూ.99 వేలు బదిలీ చేశారని పేర్కొన్నారు. జనార్ధనరావు, ఏఎన్ఆర్ రెస్టారెంట్ నుంచి పలు దఫాలుగా లావాదేవీలు జరిగాయని గుర్తించారు.

జయచంద్రారెడ్డికి దక్షి ణ ఆఫ్రికాలోని అంగోలాలో డిస్టలరీ ఉందని అది బాగా నడుస్తోందని జనార్ధనరావు రవితో చెప్పినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అక్కడికి వెళ్లి వ్యాపార అవకాశాలను అన్వేషించాలని చెప్పి రవిని తీసుకుని సెప్టెంబరు 25న అంగోలా వెళ్లారని తెలిపారు. అక్కడ ఉండగానే ములకలచెరువులోని నకిలీ మద్యం తయారీ యూనిట్‌పై దాడుల గురించి సమాచారం వచ్చిందని దీంతో రవిని ఈనెల 5న ఆగమేఘాలపై హైదరాబాద్‌కు పంపించారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన టి. శ్రీనివాసరావు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. సురేష్ అనే స్నేహితుడి ద్వారా జనార్ధనరావు పరిచయమయ్యారు. నకిలీ లేబుల్స్‌ను తయారుచేసి ఇవ్వమని 2023లో శ్రీనివాసరావును జనార్ధనరావు కోరినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. తలారి రంగయ్య అలియాస్ రాజును పరిచయం చేయగా దిల్‌సుఖ్‌నగర్‌లోని అతని షాపులో వీటిని ముద్రించి రవికి అందజేసేవారని పేర్కొన్నారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి రమేష్, ఆతర్వాత షేక్ అల్లా భక్షా కూడా ముద్రించి సరఫరా చేశారని తెలిపారు. ఈనెల 8న శ్రీనివాసరావుకు అంగోలా నుంచి జనార్ధనరావు ఫోన్ చేశారని పేర్కొన్నారు. అతని విజ్ఞప్తి మేరకు ముంబయి ఎయిర్‌పోర్టు ఈనెల 10న వెళ్లాడని పోలీసులు తెలిపారు. ఆరోజు విమానాశ్రయంలో ఇద్దరూ కలిశారని ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు తన బ్యాగ్‌ను జనార్ధనరావు అందజేశారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అక్కడి నుంచి తిరిగి శ్రీనివాసరావు హైదరాబాద్ రాగా బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో ఫోన్‌తో పాటు దుస్తులు, వకాలత్ ఫారం, పాస్‌పోర్టు, ఉండగా వాటిని సీజ్ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం 12 మందిని భవానీపురం ఎక్సైజ్ పోలీసులు నిందితులుగా చేర్చారు. తాజాగా మరో నలుగురిని చేర్చారు. వీరిలో 13వ నిందితుడు శ్రీనివాసరావును సోమవారం అరెస్టు చేశారు. 14వ నిందితుడు తలారి రంగయ్య అలియాస్ రాజు, 15వ నిందితుడు రమేష్, 16వ నిందితుడిగా అల్లాభక్ష్‌ను చూపించారు. హైదరాబాద్‌కు చెందిన వీరంతా లేబుల్స్‌ను ముద్రించి, సరఫరా చేశారు.



## మాగంటి సునీతకు బి-ఫామ్

### రూ.40 లక్షల చెక్ ఇచ్చిన కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 14:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరఫున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపినాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తదితరలు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీ హిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది. కాగా, మాగంటి సునీత బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ సమయంలో హంగులు లేకుండా, కేవలం నలుగురితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

#### బిఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు ఊపందుకున్నాయి. నియోజకవర్గంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అలీ మస్కతి, టీడీపీ సీనియర్ మహిళా నేత షకీలా రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే లక్ష్యంతోనే పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

## నార్వేలో రాయబార కార్యాలయం మూసేయాలి: వెనిజులా అధ్యక్షుడు

### ప్రతిపక్ష నేతకు శాంతిపురస్కారం ఇవ్వడంపై ఆగ్రహం

**కారకాస్, అక్టోబరు 14:** తమ దేశంలోని విప్ నేతకు నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించడంపై వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మాదురో మండి పడుతూ నార్వేపై ప్రతీకారచర్యలకు పూనుకున్నారు. ఏకంగా నార్వేలోని తమ రాయబార కార్యాలయాన్ని మూసివేయాలని ఆదేశాలిచ్చారు. వెనెజులా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోను నోబెల్ అవార్డుల కమిటీ ఈ ఏడాది శాంతి పురస్కారానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే.



ఈ ప్రకటనపై వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా పోరాడుతున్న మచాడోను అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేయడంతో నోబెల్ కమిటీపై, నార్వేపై ఆయన మండిపడుతున్నట్లు సమాచారం. దీనికి ప్రతీకారంగా నార్వేలోని తమ దేశ రాయబార కార్యాలయం మూసివేయాలని ఆదేశించారని తెలుస్తోంది. అయితే, ఈ వివరాలేవీ అధికారికంగా బయటకు వెల్లడించలేదు. మచాడోకు నోబెల్ ప్రకటించడంపై వెనెజువెలా ప్రభుత్వం అసలు స్పందించనే లేదు. ఈ క్రమంలోనే వెనెజులా విదేశాంగ మంత్రిత్వశాఖ తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్టు పెడుతూ.. దౌత్య కార్యకలాపాల అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగంగా నార్వేలోని తమ రాయబార కార్యాలయం మూసివేస్తున్నట్లు వెల్లడించింది. దీంతోపాటు జింబాబ్వే, బుర్కినా ఫాసో వంటి దేశాల్లో తమ ప్రాతినిధ్యం పెంచుకునేందుకు గాను ఆస్ట్రేలియాలోని రాయబార కార్యాలయాన్ని కూడా మూసివేస్తున్నట్లు పేర్కొంది. అయితే, రాయబార కార్యాలయం మూసివేయాలన్న వెనెజువెలా ప్రభుత్వ నిర్ణయంపై నార్వే విదేశాంగ మంత్రిత్వశాఖ అసంతృప్తి వ్యక్తం చేసింది. అనేక విషయాల్లో తమ మధ్య విబేధాలు ఉన్నప్పటికీ.. వెనెజువెలాతో తాము చర్చలు కోరుకుంటున్నామని తెలిపింది. నోబెల్ బహుమతి ప్రకటనలలో నార్వే ప్రభుత్వానికి ఎలాంటి ప్రమేయం ఉండదని, నార్వేజియన్ నోబెల్ కమిటీ స్వతంత్రంగా అభ్యర్థులను ఎంపిక చేస్తుందని వివరణ ఇచ్చింది.



## బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలి

### మధుకర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

### తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**వేమనపల్లి, అక్టోబరు 14, ప్రభాతవార్త:** బిజెపి మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం బిజెపి అధ్యక్షుడు ఏటా మధుకర్ ఆత్మహత్య పట్ల రాష్ట్ర అధ్య క్షుడు ఎన్. రాంచందర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం మధుకర్ కుటుంబాన్ని పరామర్శించి, వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. మేమున్నాం అని మధుకర్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యం, అక్రమ కేసులు, స్థానిక కాంగ్రెస్ నాయకుల వేధింపులు,పోలీసుల బెదిరింపులు మధుకర్ మరణానికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. మధుకర్ మృతికి బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మధుకర్ ఆత్మహత్య కేసులో దోషులను శిక్షించే వరకు బిజెపి పోరాటం చేస్తుందని తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీలో పేర్లు ఉన్నప్పటికీ పోలీసులు ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఇవాళనే రామగుండం పోలీస్ కమిషనర్‌ను కలిసి కేసు పురోగతిపై చర్చించనున్నట్లు తెలిపారు. బిజెపి పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎవరు కూడా మన ధైర్యం కోల్పోవద్దని మీకు అన్ని విధాలుగా పార్టీ ఆదుకుం టుందని తెలిపారు. వీరితో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వీ. సుభాష్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, మాజీ ఎంపీ వెంకటేష్ నేత, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు కొయ్యల హేమ్మాజీ, గోమాస శ్రీనివాస్, దుర్గం అశోక్, మండల బిజెపి నాయకులు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

### అధికారులకు తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క ఆదేశం





**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త :** సచివాల యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళ వారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరయ్యారు. సమా వేశంలో ములుగు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై చర్చ జరిగింది. ములుగు జిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మంత్రి సీతక్క కోరారు. ఏటూరునాగరం, మంగపేట మండలాల్లో గోదా వరి నది వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేయాలని ఆమె సూచించారు. అలాగే రామప్ప సరస్సుపై పొట్లాపూర్ ఎత్తిపోతల పథకానికి పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామప్ప నుండి లక్న వరం వరకు దేవాదుల పైప్‌లైన్ పనులను ప్రారంభించాలని సీతక్క సూచించారు. ములుగు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయా లని మంత్రి సీతక్క కోరారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ములుగు ప్రాంతం లోని పెండింగ్ ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్ట్‌ల పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.

## అంతర్జాతీయ జర్నల్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

**హైదరాబాద్, అక్టోబరు 14, ప్రభాతవార్త:** వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విద్యా ప్రపం చంలో, మనం నేర్చుకునే, బోధించే, ఆవిష్కరించే విధానాన్ని జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంట లిజెన్స్ (ఏఐ) ఒక పరివర్తన శక్తిగా మారుస్తుందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ జర్నల్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్1 ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, వైస్‌చైర్మన్2 ప్రొఫెసర్ ఎస్.కె. మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గాంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరఫున ప్రచురితమైన ఇంటర్నేషనల్ జర్నల్ స్పెషల్ ఇష్యూను ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సంచికలో నాణ్యత గల పరిశోధన పత్రాలు ఉన్నాయని సంచికను విడుదల చేస్తూ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి చెప్పారు. కంటెంట్ సృష్టి, పరిశోధన సంశ్లేషణలో సహాయంబహుళ విషయాల సహకారాన్ని ప్రోత్సహించడంలో కూడా జనరేటివ్ ఏఐ కీలక పాత్ర పోషిస్తుం దన్నారు.

15-10pg10exK 12 ONG_15-10pg10exK.qxd 10/14/2025 10:13 PM Page 1





# రెండో టెస్ట్‌లో భారత్ ఘన విజయం

## 2-0తో వెస్టిండీస్‌పై క్లీన్ స్వీప్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో టీమ్‌ఇండియా ఘన విజయం సాధించి, సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఐదో రోజు మంగళవారం 121 పరుగుల లక్ష్యఛేదనలో 63/1తో ఆటను ప్రారంభించిన భారత్ మరో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సులభంగా చేరుకుంది. కేఎల్ రాహుల్ (58 నాటౌట్; 108 బంతుల్లో ఓవర్‌నైట్ స్కోరు 25) అద్భుత హాఫ్ సెంచరీతో, సాయి సుదర్శన్ (39; 76 బంతుల్లో-ఓవర్‌నైట్ స్కోరు 30) మంచి భాగస్వామ్యాన్ని అందించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (13) త్వరగానే వెనుదిరగ్గా, యశస్వి జైస్వాల్ (8) నాలుగో రోజు ఔటయ్యాడు. ఇక విండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్ రెండు, జోమెల్ వారికన్ ఒక వికెట్ తీశారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా 518 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ జైస్వాల్ (175), గిల్ (129) సూపర్ సెంచరీలతో రాణించగా, జైస్వాల్ రనౌట్‌గా పెవిలియన్ చేరాడు. సాయి సుదర్శన్ (87), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) ఆకట్టుకున్నారు. వెస్టిండీస్ బౌలర్లలో వారికన్ 3, రోస్టన్ ఛేజ్ 1 వికెట్ పడగొట్టారు. ఆ తరువాత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండిస్‌ను బౌలర్లు ముప్పు తిప్పలు పెట్టారు. కుల్‌దీప్ యాదవ్ (5/82), రవీంద్ర జడేజా (3/46) చెలరేగడంతో విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకే ఆలౌటై, ఫాలో ఆన్‌లో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కరేబియన్ జట్టు పోరాటాన్ని చూపించింది. జాన్ కాంప్‌బెల్ (115), షై హోప్ (103) సెంచరీలతో మెరిశారు. జస్టిన్ గ్రీవ్స్ (50 నాటౌట్), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) కూడా రాణించడంతో విండీస్ 390 పరుగులకే ఆలౌటైంది. ఇలా బ్యాట్స్‌మెన్, బౌలర్లు సమన్వయంగా రాణించడంతో టీమ్‌ఇండియా మరోసారి క్లీన్‌స్వీప్‌తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.



### టేబుల్ టెన్నిస్‌లో..

# భారత్ నిష్క్రమణ

## సింగపూర్ చేతిలో దారుణ ఓటమి

**న్యూఢిల్లీ:** సింగపూర్ చేతిలో దారుణ ఓటమి తర్వాత ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2025 నుండి భారత్ నిష్క్రమించింది. భారత్ మహిళల, పురుషుల జట్లు రెండూ క్వార్టర్ ఫైనల్ దశలోనే ఓడిపోయాయి. భువనేశ్వర్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో నాల్గవ సీడ్‌గా నిలిచిన మహిళల జట్టు సింగపూర్ చేతిలో 2-3 తేడాతో ఓడిపోయింది. ఫలితంగా పతకంపై భారత ఆశలు తొలగిపోయాయి. స్టార్ ప్యాడ్లర్ మానికా బాత్రా ఫామ్‌లో లేనట్లు కనిపించి, తన కంటే వంద స్థానాల కంటే తక్కువ ర్యాంక్‌లో ఉన్న ప్రత్యర్థి చేతిలో ఓడిపోయింది. తన మ్యాచ్‌లో 2-1తో ఆధిక్యంలో ఉన్న దియా చిటాలే, నిర్ణయాత్మక క్షణాల్లో సద్వినియోగం చేసుకోలేకపోయింది. యశస్విని ఘోర్పడే భారత్‌ను పోటీలో నిలబెట్టడానికి తీవ్రంగా పోరాడినా, చివరికి సింగపూర్ విజయం సాధించి సెమీఫైనల్లో చోటు దక్కించుకోలేకపోయింది. మరో మహిళల యాక్షన్‌లో, టాప్‌సీడ్ చైనా ఒక గంటలోపు థాయిలాండ్‌ను 3-0తో ఓడించింది, వాంగ్ మాన్యు, సన్ యింగ్షా మరియు కుయ్ మాన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఇక పురుషుల క్వార్టర్ ఫైనల్స్‌లో ఇరాన్‌కు చెందిన 15 ఏళ్ల బెన్యామిన్ ఫరాజీ ప్రపంచ నంబర్ 2 చైనాకు చెందిన లిన్ షిడాంగ్‌ను 3-2తో ఓడించాడు.





### సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో..

# 'కాస్ట్లీ స్టార్ల'కు రెడ్ కార్డ్

## టీమ్ నుండి నలుగురు ఔట్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 వేలానికి ముందుగా సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ లే ఆఫ్స్ మొదలు పెట్టేంది. ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ అద్భుతమైన ఆటతీరు కనబరిచినా ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ వంటి అద్భుతమైన టాప్ ఆర్డర్ ఉన్నప్పటికీ, వారు తమ మొదటి ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు ఓడిపోయారు. చివర్లో చెలరేగినా ప్లేఆఫ్స్ చేరుకోలేకపోయారు. కెప్టెన్ పాట్ కమ్మిన్స్ సహా అట్టిపెట్టుకున్న ఐదుగురు ఆటగాళ్లపై సన్‌రైజర్స్ రూ.75 కోట్లు ఖర్చు చేసింది. కానీ టోర్నమెంట్‌లో విజయవంతం కాలేకపోయింది. దీంతో వచ్చే ఐపీఎల్ వేలానికి గాను అట్టిపెట్టుకునే గడువు నవంబర్ 15 వరకు ఉండటంతో పేలవ ప్రదర్శన చేసిన ప్లేయర్స్‌ను పక్కనపెట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఈ వేలానికి ముందు మహ్మద్ షమీని వదిలేసే ఛాన్స్ ఉంది. గత సీజన్‌లో రూ.10 కోట్లకు కొనుగోలు చేసిన ఈ ప్లేయర్ 9 మ్యాచ్‌ల్లో 11.23 ఎకానమీ రేటుతో కేవలం 6 వికెట్లు మాత్రమే తీశాడు. ఫాంలేమి, గాయాల బెడద కారణంగా అతడికి వెచ్చించిన సొమ్ము భారీగా ఉంది కాబట్టి రిలీజ్ చేసి వేలంలో మళ్లీ తక్కువ ధరకు కొనే ఛాన్స్ ఉంది. ఇక ముంబై ఇండియన్స్ మాజీ ఓపెనర్ ఇషాన్ కిషన్‌ను గత మెగా వేలంలో రూ.11.25 కోట్లకు కొనుగోలు చేసింది. కిషన్ మూడవ స్థానంలో బరిలోకి దిగాడు. అతని సగటు కేవలం 26.60. ఎస్సార్ 138 కంటే తక్కువ ఉంది. అతను రాజస్థాన్ రాయల్స్ పై సెంచరీ సాధించి అద్భుతమైన ప్రదర్శనను ప్రారంభించినప్పటికీ, ఆ తర్వాత ఏడు మ్యాచ్‌లలో 4 కంటే తక్కువ సగటుతో కేవలం 33 రన్స్ మాత్రమే చేయగలిగాడు. ఇక చివర్లో 94 రన్స్ చేశాడు. ఈ రెండు ఇన్నింగ్స్‌లు మినహా అతడేం ప్రభావం చూపలేకపోయాడు. అలాగే ముంబైతో కలిసి రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన రాహుల్ చాహర్ ఇండియన్ సర్క్యూట్‌లో అత్యంత అద్భుతమైన స్పిన్నర్లలో ఒకరు. నిజానికి, అతను గత సీజన్‌లో హైదరాబాద్ తరపున ఒకే ఒక మ్యాచ్ ఆడి ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు. చాహర్ రూ.3.20 కోట్లతో సన్‌రైజర్స్‌లోకి వచ్చాడు. సో అతడ్ని వదులుకునే ఛాన్స్ ఉంది. అలాగే ఆడమ్ జంపాను కూడా రిలీజ్ చేస్తారని టాక్.

# మహిళల ఆసియా కప్‌లో భారత్ విక్టరీ

## 2-1తో కిర్గిజ్ రిపబ్లిక్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఆసియా కప్-2026 క్వాలిఫయర్స్ ఓపెనరల్‌లో భారత్ అండర్ 17 మహిళల ఫుట్‌బాల్ జట్టు తొలి విక్టరీ సాధించింది. బిష్కెక్‌లోని డోలెన్ ఒముర్జాకోవ్ స్టేడియంలో మంగళవారం జరిగిన గ్రూప్ బి మ్యాచ్‌లో భారత్ మహిళా జట్టు క్వాలిఫయర్స్ ప్రచారాన్ని 2-1 తేడాతో ఆతిథ్య కిర్గిజ్ రిపబ్లిక్‌పై విజయంతో ప్రారంభించింది. 27వ నిమిషంలో ఫార్వర్డ్ పెర్ల్ ఫెర్నాండెజ్ ప్రత్యర్థి బాక్స్ లోపల పాస్‌లను త్వరగా ఇచ్చిపుచ్చుకోవడంతో భారత్ తొలి ఆధిక్యాన్ని పొందింది. అయితే, ఆతిథ్య జట్టు వేగంగా స్పందించి, 33వ నిమిషంలో అక్మరల్ సయక్‌బేవా డిఫెన్సివ్ లాప్‌ను సద్వినియోగం చేసుకుని గోల్‌ను సమం చేసింది. ఇరు జట్లు బ్రేక్ స్థాయికి చేరుకునే పరిస్థితి తలెత్తింది. రెండవ అర్ధభాగంలో భారత్ మెరుగైన పోరును కొనసాగించిన నేపథ్యంలో కిర్గిజ్ జట్టు ఎదురుదాడిలో ప్రమాదాన్ని ఎదుర్కోవడంతో హోరాహోరీగా పోరాటం జరిగింది. 90వ నిమిషంలో కెప్టెన్ జులన్ నోంగ్మైథెమ్ నిర్ణయాత్మక క్షణాన్ని సృష్టించే వరకు మ్యాచ్ డ్రా వైపు వెళుతున్నట్లు అనిపించింది. అయితే బంతికి వేగంగా స్పందించి విజేతకు గోల్ చేసి భారత్‌కు మూడు పాయింట్లు అందించింది. ఈ విజయం భారత్ జట్టుకు తమ అర్హత ప్రచారానికి ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రారంభాన్ని ఇస్తుంది. క్వాలిఫయర్స్ ద్వారా మొదటిసారిగా ఎఎఫ్‌సి అండర్17 మహిళల ఆసియా కప్ ఫైనల్స్‌లో చోటు సంపాదించాలని లక్ష్యంగా భారత్ జట్టు పట్టుదలతో ముందుకెళుతోంది. భారత్ జట్టు ఈ వారం చివర్లో తమ రెండవ, చివరి గ్రూప్ బి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌తో తలపడనుంది.

# వరల్డ్ జూ.ఛాంపియన్‌షిప్‌లో తన్వి, ఉన్నతి, రక్షిత విజయం



**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025ను తన్వి శర్మ, ఉన్నతి హుడా తొలి విజయం సాధించారు. నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పతక ఆశావహులు భారత్ టాప్ సీడ్స్ తన్వి శర్మ, ఉన్నతి హుడా, రక్షిత శ్రీ ఆర్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ ప్రచారాలను సునాయాస విజయాలతో ప్రారంభించారు. బాలుర సింగిల్స్ విభాగంలో నలుగురు ఆటగాళ్ళు కూడా తదుపరి రౌండ్ లోకి ప్రవేశించారు. టాప్ సీడ్ తన్వి పోలాండ్‌కు చెందిన విక్టోరియా కలెట్కాను కేవలం 11 నిమిషాల్లో 15-2, 15-1 తేడాతో ఓడించగా, ఎనిమిదో సీడ్ ఉన్నతి హాంకాంగ్‌కు చెందిన లియు హోయ్ అన్నాపై 23 నిమిషాల్లో 15-8, 15-9 తేడాతో విజయం సాధించింది. ఆ తర్వాత రక్షిత శ్రీ కెనడాకు చెందిన లూసీ యాంగ్ సవాలును 15-5, 15-9 తేడాతో అధిగమించి తన ప్రచారాన్ని కొనసాగించింది. అలాగే బాలుర సింగిల్స్ విభాగంలో, 11వ సీడ్ రౌనక్ చౌహాన్ శ్రీలంకకు చెందిన తిసాత్ రూపతుంగను 15-3, 15-6తో ఓడించగా, 15వ సీడ్ సూర్యాక్ష్ తావత్ టర్కీయేకు చెందిన యుగిట్కాన్ ఎరోల్‌ను 15-5, 15-8తోను, లాల్తాజులా హార్మర్ యుఎస్ఎకు చెందిన లైలాన్ టాన్‌ను 15-11, 15-5తో ఓడించాడు. ఇక జ్ఞాన దత్తు తన సహచరులతో కలిసి 32వ రౌండ్‌లో బ్రెజిల్‌కు చెందిన జోక్విమ్ మెండోంకాను 15-10, 15-13తో ఓడించాడు.

# అంచనాలకు మించిన పసిడి!

## హైదరాబాద్‌లోనే తులం రూ.1.30 లక్షలు దాటిన వైనం

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** అంతర్జాతీయ పరిణా మాలు, ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ఒడిదొడుకు లకు తోడు రిజర్వుబ్యాంకుల పాలసీ రేట్ల నిర్ణయాలుకూడా బంగారం ధరలను రోజురోజుకూ పెంచుతున్నాయి. గత చరిత్రలో మనంఎన్నడూ చవిచూడని అంశాలు ఇపుడు మనం చూస్తున్నాం. ఒక్కరోజులోనే 3వేల రూపాయలు పెరిగి తులం బంగారం 1.30లక్ష రూపాయలకు పెరిగిందంటే ఇన్వెస్టర్లు ఈరంగంపై ఎంతగా ఆసక్తిచూపిస్తున్నారో అవగతం అవుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా ఇందుకు కీలకం అవుతున్నాయి. సమీప కాలంలో లక్షలోపు చేరుతుందన్న అంచ నాలు కూడా ఎక్కడా లేవు. మంగళ వారం 24 క్యారట్ల బంగారం ధర హైదరాబాద్‌లో ఒక్కసారిగా పెరిగింది. పదిగ్రాముల 24క్యారెట్లధర రూ.3200 పెరిగి రూ.1.30 లక్షలు దాటేసింది. పదిగ్రాముల విలువలు రూ.1,30, 850గా నమోదయింది. 22క్యారెట్ల తులంబంగారం కూడా రూ.1,21,150 గా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే మూడువేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. బంగారంధరలు దేశవ్యాప్తంగా కూడా రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఔన్స్ పసిడిధర 4115 డాలర్లకు చేరితే వెండిధరలు 51 డాలర్లకు చేరింది. 2022తోపోలిస్తే ఏడాది ఇప్పటివరకూ 50శాతానికిపైగానే ధరలు పెరిగాయి. ఈధోరణులు ఇలాగే కొనసాగితే బంగారం ధరలు తులం ఒక్కింటికి 1.50 లక్షలు దాటినా ఆశ్చర్యంలేదు.



ప్రపంచ వ్యాప్తంగా నెలకొంటున్న భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య ఒప్పందాల్లో నెలకొం టున్న అనిశ్చితి వంటివి ఒక ఎత్తు అయితే వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు ప్రక టించే పాలసీరేట్లు మరోవైపు బంగారంపై ధరలను పెంచుతున్నాయి. పారిశ్రామిక వినియోగం కూడా పెరుగు తుండటంతో వెండి మార్కెట్‌కూడా ఊపందుకుం టున్నది. ఇక చెన్నై మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్లధర రూ.1.29 లక్షలు, 22 కేరట్లు రూ.1.18 లక్షలుగా నడుస్తోంది. ముంబయిలో అయితే రూ.1,28,680 గాను, 22 కేరట్లు 1,17,950గాను ఉంది. ఇక ఢిల్లీలో పదిగ్రాముల మేలిమి బంగారం రూ.1,28,830వద్ద కొనసాగింది. 22 కేరట్లు మాత్రం రూ.1,18,100గా ఉంది. అలాగే బెంగళూరులో మేలిమి బంగారం 1,28,680గాను, 22 కేరట్లు 1,17,950గాను కొనసాగింది. కోల్‌కత్తాలో అయితే మేలిమి బంగారం రూ.1,28,680గాను, 22కేరట్లు 1,17,950గాను పలికింది.

# దిగివచ్చిన ద్రవ్యోల్బణం

**వాణిజ్యం**

**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** టోకు ధరలసూచీ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో స్వల్పంగా తగ్గింది. టోకు ధరల సూచీ 0.13 శాతానికి తగ్గిందని మంగళవారం కేంద్రం విడుదల చేసిన డేటా పేర్కొంది. ఆగస్టులో టోకు ధరల సూచి ద్రవ్యోల్బణం 0.52 శాతంగా ఉండగా గత ఏడాది ఇదే నెలలో 1.91 శాతంగా ఉందని నివేదిక చెప్పింది. టోకు ద్రవ్యోల్బణంలో సానుకూల ధోరణికి ఆహార ఉత్పత్తులు, ఆహారేతర వస్తువులు, రవాణా, దుస్తుల తయారీ ధరలు పెరగడమే కారణమని పరిశ్రమల మంత్రిత్వ తెలిపింది. ఆగస్టులో ఆహార ధరలు 3.06 శాతంతో పోలిస్తే సెప్టెంబర్‌లో 5.22 శాతం తగ్గాయి. అదే కాలంలో కూరగాయల ధరలు కూడా తగ్గాయి. ఆగస్టులో 14.18 శాతంతో పోలిస్తే సెప్టెంబర్‌లో కూరగాయల ధరలు 24.41 శాతం చేరాయి. ఆగస్టులో 2.55 శాతంతో పోలిస్తే తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 2.33 శాతానికి తగ్గింది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ట్రాక్ చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నెల ప్రారంభంలో తన బెంచ్‌మార్క్ పాలసీ రేట్లను 5.5 శాతం వద్ద మార్చలేదు. సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి 1.5 శాతానికి పడిపోయింది. ఆహార ఉత్పత్తులు, ఆహారేతర వస్తువులు, రవాణా పరికరాలు, దుస్తుల తయారీ ధరల పెరుగుదల కారణంగా సెప్టెంబర్ 2025లో టోకు ద్రవ్యోల్బణంలో సానుకూల ధోరణి ఉందని పరిశ్రమల మంత్రిత్వశాఖ తెలిపింది. టోకుధరల సూచీ ప్రకారం ఆగస్టులో 3.06 శాతంతో పోలిస్తే సెప్టెంబర్‌లో ఆహార ధరలు 5.22 శాతం తగ్గాయి. కూరగాయల ధరలు కూడా ఇదే కాలంలో తగ్గాయి. కూరగాయల ధరలు ఆగస్టులో 14.18 శాతంతో పోలిస్తే 24.41 శాతం తగ్గాయి. తయారైన ఉత్పత్తుల ద్రవ్యోల్బణం ఆగస్టులో 2.55 శాతంతో పోలిస్తే.. 2.33 శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ రంగాల్లో ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 2.58 శాతంగా నమోదైంది.గతనెలలో3.17 శాతంగా



ఉంది.రిజర్వుబ్యాంకు తన బెంచ్‌మార్క్ పాలసీ రేట్లను ఈ నెల ప్రారంభంలో 5.5 శాతం వద్దే యథావిధిగా కొనసాగించింది. రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి 1.5 శాతానికి పడిపోయిందని సోమవారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో గణనీయంగా తగ్గి 1.54 శాతానికి చేరుకుంది. గడిచిన ఎనిమిదేళ్లలో ఇదే కనిష్ఠం. అంతకుముందు నెలలో ఇది 2.07 శాతంగా నమోదైంది. కూరగాయలు, పప్పులతో పాటు ఇతర ఆహార పదార్థాల ధరలు అదుపులో ఉండడం ద్రవ్యోల్బణం తగ్గడానికి ప్రధాన కారణమని ఎన్ఎస్ఓ పేర్కొంది. 2024 సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 5.49 శాతంగా ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో మైనస్ 2.28 శాతంగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం మరుసటి ఆరు నెలల ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బీఐ తగ్గించిన విషయం తెలిసిందే. నైరుతి రుతుపవనాలు, ఖరీఫ్‌లో అధిక సాగు, రిజర్వాయర్లలో భారీగా నీరు ఉండడం, ధాన్యాల బఫర్ స్టాక్ కారణంగా ఆహార ఉత్పత్తులు అదుపులోనే ఉంటాయని అంచనా వేసింది.



# సుజుకినుంచి బర్గ్‌మాన్ హైడ్రోజెన్ స్కూటర్!

**టోక్యో, అక్టోబరు 14:** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ సుజుకి హైడ్రోజన్ఇంధన సెల్ స్కూటర్‌ను విడుదల చేయడానికి సిద్ధంగాఉంది. ప్రసిద్ధ బర్గ్‌మాన్ మోడల్ ఆధారంగా ఈ కొత్త స్కూటర్ ఆటోమోటివ్ ప్రపంచంలో కీలక దశను ప్రారంభించినట్లయింది. సుజుకి ఈ కొత్త మోడల్‌తో సాంప్రదాయ మోటార్‌సైకిళ్ల రైడ్ అనుభవం, ఎగ్జాస్ట్ సౌండ్‌ను మిళితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పర్యావరణ అనుకూల వాహనాల వైపు కదులుతోంది. ఈ వాహనంపై ప్రస్తుతం కంపెనీ పరిశోధన, అభివృద్ధి విభాగంలో అధ్యయనం జరుగుతోంది. కొత్త హైడ్రోజన్ బర్గ్‌మాన్ స్కూటర్‌ను జపాన్ మొబిలిటీ షో 2025లో ప్రదర్శించాలని నిర్ణయించింది. స్థిరమైన, పర్యావరణ అనుకూల వాహనాల శ్రేణిని అభివృద్ధి చేయడంలో సుజుకి, దీర్ఘకాలిక ఆసక్తిని ప్రదర్శిస్తుంది.

# ప్రపంచ ఆర్థికవృద్ధికి భారత్ గ్రోత్ ఇంజిన్

## ఐఎంఎఫ్ అధ్యక్షురాలు క్రిస్టాలినా జార్జివా



**న్యూయార్కు, అక్టోబరు 14:** ప్రస్తుత భారతదేశ ఆర్థిక వ్యవస్థ అద్భు తంగా ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివాచెప్పారు. భారతదేశం ప్రపంచవృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా మారుతోందని ఆమె ప్రకటించారు. 2025 ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ వార్షికసమావేశాలకు ముందు ఆమెవ్యాఖ్యలు ప్రాధాన్య తను సంతరించుకున్నాయి. ఈఏడాది ఐఎంఎఫ్, వరల్డ్‌బ్యాంక్ వార్షిక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈసమావేశాలు ఈనెల18 వరకు వాషింగ్టన్ డిసిలో జరుగుతాయి. ఈ సమావేశాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, పేదరిక నిర్మూలన, అభివృద్ధి వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఇదే సమయంలో క్రిస్టాలినా చైనాగురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చైనా వృద్ధి మందగిస్తోండగా, భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకభూమిక పోషిస్తోందని ఆమెచెప్పారు. గ్లోబల్ గ్రోత్ ప్యాటర్న్‌లు మారుతున్నాయి. చైనా మందగిస్తుంటే, భారతదేశంకీ గ్రోత్ ఇంజిన్‌గా ఆవిర్భవిస్తోంది అని ఆమె స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి మెరుగైన పాలసీలు, ప్రైవేట్ సెక్టార్ అనుకూలత, టారిఫ్ ప్రభావాలుతక్కువగా ఉండటం, సానుకూల ఆర్థిక పరిస్థితులు కారణాలుగా ఉంటాయని ఆమె తెలిపారు. ప్రపంచ వాణిజ్యంపై కూడా క్రిస్టాలినా మాట్లాడతూ మారుతున్న ట్రేడ్ టారిఫ్స్ ప్రభావం ఏ మేరకు ఉంటుందన్నది తేలాలంటే కొంత సమయం ఆగాల్సి ఉందని ఆమె చెప్పారు. ప్రస్తుత ట్రేడ్ టారిఫ్స్ కారణంగా అమెరికాలో ధరలు పెరిగి ఇన్‌ఫ్లేషన్ పెరిగే అవకాశం ఉందని, ఇది మానిటరీ పాలసీ, ఆ దేశ అభివృద్ధి మీద ప్రభావం చూపుతుందని ఆమె హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలకు కూడా పలుసూచనలు చేశారు క్రిస్టాలినా. ప్రపంచదేశాలు రుణభారం తగ్గించు కోవాలని, అది ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను ఉక్కిరిబిక్కిరి చేస్తుందని ఆమె హెచ్చరించారు. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతోన్న దేశాలు రెండిటిలోనూ రుణ స్థాయిలు ఇప్పటికీ పెరుగుతూనే ఉన్నాయని జార్జివా వ్యాఖ్యానించారు. క్రిస్టాలినా జార్జివా అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్. ఆమె బల్గేరియాకు చెందిన ఆర్థికవేత్త. 2019 అక్టోబర్ 1నుంచి ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబయి, అక్టోబరు 14:** స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. మార్కెట్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ద్రవ్యోల్బణం గణాంకాల ఆధారంగా ఉదయం మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. అయితే, చివరివరకు అదే ధోరణిని కొనసాగించడంలో విఫలమయ్యాయి. తొలి సెషన్‌లో సూచీలు పైకి కదిలినా ఇంట్రాడే తర్వాత లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో పతనమయ్యాయి. మళ్లీ మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోలేదు. సెన్సెక్స్ 82,404.54 పాయింట్లవద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 82,573.37 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ కనిష్టంగా 81,781.62 పాయింట్లకు పడిపోయింది. చివరకు 297.07 పాయింట్ల నష్టంతో 82,029.98 వద్ద ముగిసింది.

నిఫ్టీ సైతం 81.85 పాయింట్లు తగ్గి.. 25, 145.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం క్షీణించగా స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒక శాతం పడిపోయింది. నిఫ్టీలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, బజాజ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, టిసిఎస్, ట్రెంట్ ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. మాక్స్ హెల్త్‌కేర్, అపోలో హాస్పిటల్స్, టెక్ మహీంద్రా, విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్ లాభపడ్డాయి.

# ఇక జపాన్‌లోనూ భారత్ యుపిఐ సేవలు!




**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** భారత డిజిటల్ చెల్లిం పుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపిఐ) సేవలు మరో దేశానికి విస్తరించాయి. జపాన్‌లోకూడా మన యూపిఐ సేవలు అందు బాటులోకి రానున్నాయి. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పి సిఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్ఐపిఎల్, జపాన్‌కు చెందిన ప్రముఖ ఐటి సేవల సంస్థ ఎన్టీటీ డేటాతో మంగళవారం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో జపాన్‌కు వెళ్లే భారత పర్యాటకులకు చెల్లింపుల ప్రక్రియ మరింత సులభతరం కానుంది. ఎన్టీటీ డేటా నెట్‌వర్క్‌కు చెందిన వ్యాపార సముదాయాలు, దుకాణాల్లో భారతీయులు తమ స్మార్ట్‌ఫోన్లలోని యూపిఐ యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభంగా చెల్లింపులు చేయవచ్చు. దీనివల్ల అక్కడి వ్యాపారులకు కూడా వేగంగా లావాదేవీలు పూర్తికావడంతోపాటు వ్యాపారవృద్ధికి దోహదపడుతుంది. ఈ భాగస్వామ్యంపై ఎన్‌పిసిఐ ఇంటర్నేషనల్ ఎండి, సిఇఒ రితేష్ శుక్లా మాట్లాడుతూ, ఎన్టీటి డేటాతో కుదిరిన ఒప్పందం జపాన్‌లో యూపిఐ సేవలకు మార్గం సుగమం చేసింది. భారత పర్యాటకులకు డిజిటల్ చెల్లింపుల అనుభవాన్ని మెరుగుపరచడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. యూపిఐని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి, అత్యంత విశ్వసనీయమైన చెల్లింపుల వ్యవస్థగా నిలబెట్టాలన్న మా లక్ష్యంలో ఇది భాగమని తెలిపారు. గణాంకాల ప్రకారం, ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు సుమారు 2.08లక్షల మంది భారతీయులు జపాన్‌ను సందర్శించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 36 శాతం అధికం. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఎన్టీటీ డేటా జపాన్ పేమెంట్స్ హెడ్ మసనోరి కురిహర మాట్లాడుతూ, భారత పర్యాటకులకు షాపింగ్, చెల్లింపులను మరింత సౌకర్యవంతంగా మార్చడమే మా లక్ష్యం. ఈ ఒప్పందం ద్వారా జపాన్ వ్యాపారులకు కూడా కొత్త అవకాశాలు లభిస్తాయని వివరించారు. కాగా, ఎన్టీటీ డేటా జపాన్‌లో అతిపెద్ద కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ నెట్‌వర్క్ అయిన కాఫిస్‌ను నిర్వహిస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps